
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 256
బుధవారం 7-12-2022
SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ నాటికి సొంత ఇల్లు కలిగి ఉండేటట్లు చూడటం ప్రభుత్వాల కనీస బాధ్యత'


బ్రెజిల్ గర్జన
దక్షిణ కొరియాపై 4-1 తేడాతో విజయం 14వ సారి క్వార్టర్ ఫైనల్లోకి.. - 12లో


వృద్ధి రేటు అప్‌గ్రేడ్
ప్రపంచ బ్యాంక్ యూటర్న్.. అంచనాలు 6.5 నుంచి 6.9 శాతానికి పెంపు -13లో


నేటి నుంచి పార్లమెంట్
పార్లమెంట్ సమావేశాలు నేటి నుంచి ఈనెల 29 వరకు జరగనున్నాయి. కేంద్రం 16 బిల్లులను ప్రవేశ పెట్టే అవకాశముంది.
వివరాలు 6లో ▸



సరిహద్దు రగడ
మహారాష్ట్ర, కర్ణాటక మధ్య సరిహద్దు వివాదం ముదురుతోంది. బెళగావిలో ఇరు పక్షాలు పోటాపోటీగా నిరసనలు నిర్వహించాయి.
వివరాలు 6లో ▸


పీటీఐ పార్టీ నుంచి ఇమ్రాన్ ఔట్!
పీటీఐ పార్టీ అధ్యక్ష పదవి నుంచి మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను తొలగించే ప్రక్రియను పాక్ ఎన్నికల సంఘం ప్రారంభించింది.
వివరాలు 6లో ▸


సహజీవనం నేరమే
సహజీవనం, వివాహేతర సంబంధాలు వంటి వాటిని ఇకపై నేరంగా పేర్కొంటూ ఇండోనేసియా ప్రభుత్వం శిక్షలు ఖరారు చేసింది.
వివరాలు 6లో ▸

ఏది నిజం?
ప్రాజెక్టులనడుగుదాం..
నీళ్లెవరిచ్చారో?
- పూర్తి సామర్థ్యంతో నిండు కుండల్లా 'సీమ' ప్రాజెక్టులు
- బ్రహ్మంసాగర్ లీకేజీలను పట్టించుకోని బాబు.. నాడు నిల్వ 4 టీఎంసీలే
- లీకేజీలున్న చోట డయాఫ్రం వాల్ నిర్మించిన జగన్.. ఇప్పుడు 17.85 టీఎంసీల నిల్వ
- గండికోట, చిత్రావతి నిర్వాసితులకు పునరావాసాన్ని పట్టించుకోని నారా వారు
- దీంతో నాలుగైదు టీఎంసీలకు మించి నిల్వ చేయలేని దుస్థితి
- రెండింట్లో పునరావాసానికి రూ.1,600 కోట్లు ఖర్చుచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఫలితంగా గండికోటలో 26.85, చిత్రావతిలో 10 టీఎంసీల నిల్వ
- 10 నుంచి 20 వేల క్యూసెక్కులకు పెరిగిన అవుకు ప్రవాహ సామర్థ్యం
- శ్రీశైలం నీటితో సీమ సస్య శ్యామలానికి 'రాయలసీమ లిఫ్ట్'
- అసలు అలాంటి ఆలోచన కూడా చేయని చంద్రబాబు, రామోజీ

4లో

నాడు అవమానం..
నేడు సమున్నతం..
మూడున్నరేళ్లలో బీసీలను సమాజానికి వెన్నెముకగా నిలబెట్టిన సీఎం జగన్

- ఎన్నికల హామీలకు మించి అత్యధికంగా ప్రయోజనం
- 25 మంది మంత్రివర్గంలో ఏకంగా 11 మంది బీసీలకు స్థానం
- విద్య, రెవెన్యూ, వైద్యారోగ్యం, పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి లాంటి కీలక శాఖలు వారికే
- శాసనసభ స్పీకర్‌గా బీసీకే ఛాన్స్
- మూడున్నరేళ్లలో 8 రాజ్యసభ స్థానాలు దక్కితే సగం బీసీలకే
- సంక్షేమ పథకాలతో రూ.1.77 లక్షల కోట్లకుపైగా నేరుగా పేదల ఖాతాల్లోకి
- అందులో రూ.85,915.06 కోట్లు బీసీ సామాజిక వర్గాలకే
- బీసీలే సీఎంగా ఉన్న రాష్ట్రాల్లోనూ ఇంత మేలు జరగలేదంటున్న సామాజికవేత్తలు
- చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ప్రైవేట్ బిల్లు.. ఉభయ సభల్లోనూ పోరాటం


విజయవాడలోని ఇందిరా గాంధీ స్టేడియంలో సిద్ధమైన 'జయహో బీసీ' మహా సభ ప్రాంగణం

నాడు బాబు హయాంలో...
తమ హక్కులను పరిరక్షించాలని కోరిన నాయీ బ్రాహ్మణులను తాత్కాలిక సచివాలయం సాక్షిగా తోకలు కత్తిరిస్తానంటూ అధికార దర్పంతో చంద్రబాబు బెదిరించారు. హామీలను నెరవేర్చాలని విన్నవించిన మత్స్యకారులను తాట తీస్తానంటూ హూంకరించారు. బీసీలు న్యాయమూర్తులుగా పనికిరారంటూ అవహేళన చేశారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అంటూ దళితులను, కోడలు మగపిల్లాడ్ని కంటానంటే అత్త వద్దంటుందా? అంటూ మహిళలను కించపరిచి తన నిజ స్వరూపాన్ని చాటుకున్నారు.

నేడు జగన్ పాలనలో...
బీసీలను సమాజానికి వెన్నెముకలా తీర్చిదిద్దడమే లక్ష్యమని 2019 ఫిబ్రవరి 17న ఏలూరు బీసీ గర్జనలో చేసిన ప్రకటనను సీఎం జగన్ ఆచరించి చూపుతున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీతో బీసీల ఖాతాల్లోకి రూ.85,915.06 కోట్లు జమ చేశారు. అమ్మఒడి నుంచి విద్యాదీవెన వరకూ వివిధ పథకాల ద్వారా బీసీ విద్యార్థులకు సింహభాగం మేలు చేస్తూ ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకూ అత్యధిక పదవులను బీసీలకే కేటాయించారు.

2లో

జయహో బీసీ.. చలో విజయవాడ
- నేడు వైఎస్సార్‌సీపీ బీసీ మహాసభ
- 'వెనుకబడిన వర్గాలే వెన్నెముక' నినాదం

2లో


హైటెక్ సెక్స్ రాకెట్
14,190 మంది యువతులతో వ్యాపారం
- ముఠా గుట్టు రట్టు చేసిన సైబరాబాద్ పోలీసులు
- హైదరాబాద్ కేంద్రంగా దందా.. దేశవ్యాప్తంగా నెట్‌వర్క్
- ఉద్యోగాల పేరుతో దేశ, విదేశీ మహిళలకు ఎర
- బలవంతంగా వ్యభిచార కూపంలోకి దింపుతున్న వైనం
- వెబ్‌సైట్లు, వాట్సాప్ గ్రూప్‌లలో బాధితుల వివరాలు
- హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరుల్లో కాల్ సెంటర్లు
- స్టార్ హోటళ్లు, ఓయో రూమ్స్‌లో గదుల బుకింగ్
- అవసరమైతే విమానాలలో అమ్మాయిల తరలింపు
- మాదకద్రవ్యాలు సైతం సరఫరా చేస్తున్న ముఠా
- రాడిసన్ బ్లూ హోటల్ మేనేజర్ సహా 18 మంది అరెస్టు
- వివరాలు వెల్లడించిన కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

సాక్షి, హైదరాబాద్: హైటెక్ సెక్స్ రాకెట్ గుట్టు రట్టయింది. ఉద్యోగాల పేరుతో దేశ, విదేశీ మహిళలను ఆకర్షించి, బలవంతంగా వ్యభిచార కూపంలోకి దింపుతున్న ముఠాను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. పలు వెబ్‌సైట్లు, వాట్సాప్ గ్రూపుల్లో మొత్తం 14,190 మంది యువతుల ఫొటోలు, వివరాలు పెట్టి.. కాల్‌సెంటర్ల ద్వారా విటులను ఆకర్షిస్తున్న ఈ గ్యాంగ్.. హైదరాబాద్ కేంద్రంగా ఎన్నో ఏళ్లుగా ఈ దందా సాగిస్తోంది. ఈ కేసుకు సంబంధించి గచ్చిబౌలిలోని రాడిసన్ బ్లూ హోటల్ మేనేజర్ రాకేష్ సహా 18 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వ్యభిచారం నిర్వహించడంతో పాటు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న ఈ ముఠా వివరాలను ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ కవితతో కలిసి
మిగతా 10వ పేజీలో ▶

వైఎస్సార్‌సీపీ నేత
దారుణ హత్య
శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వైస్ ఎంపీపీ బరాటం రామశేషు(45)ను మంగళవారం ముగ్గురు దుండగులు దారుణంగా హత్య చేశారు. రామశేషు గ్యాస్ గోడౌన్‌కు వెళ్లగా.. బైక్‌పై వచ్చిన దుండగులు వేటకత్తులతో దాడి చేశారు.
3లో



పాలిటెక్నిక్ విద్యార్థుల ముంగిటకే
ఉద్యోగావకాశాలు
పాలిటెక్నిక్ విద్యలో సంస్కరణలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రస్తుత కోర్సులకు అదనంగా పరిశ్రమ ఆధారిత కోర్సులు
- ఆఫీస్ ఆటోమేషన్, ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ వంటివాటిలో శిక్షణ
- బ్యూటిఫికేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫుట్‌వేర్ టెక్నాలజీల్లో సర్టిఫికెట్ కోర్సులు
- ప్రముఖ సంస్థలతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ.. అలాగే 34 స్కిల్ హబ్‌లు
- పరిశ్రమలతో విద్యార్థులు, అధ్యాపకుల అనుసంధానం.. స్టైఫండ్‌తో ఇంటర్న్‌షిప్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాలిటెక్నిక్ డిప్లొమా విద్యలో సమూల మార్పుల దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక సంస్కరణలు చేపడుతోంది. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసే విద్యార్థులకు ఉపాధి మెరుగుపడేలా, వారి ముంగిటకే ఉద్యోగావకాశాలు వచ్చేలా నూతన ప్రణాళికలను అమల్లోకి తెస్తోంది. ప్రస్తుతం ఉన్న సిలబస్‌లో సమూల సంస్కరణలు చేస్తోంది. అలాగే కొత్తగా పలు పరిశ్రమ ఆధారిత కోర్సులను ప్రవేశపెడుతోంది. ఈ కోర్సుల బోధనకు వీలుగా అధ్యాపకులకు సైతం ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. రాష్ట్రంలో 84 ప్రభుత్వ, 165 ప్రైవేట్, 1 ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. వీటిలో 25 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులను కొత్త అంశాలతో సాంకేతిక విద్యాశాఖ అభివృద్ధి చేస్తోంది. కంపెనీల సూచన మేరకు పరిశ్రమ ఆధారిత
మిగతా 3వ పేజీలో ▶

వివాదాస్పద భూమినే.. వివాద రిజిస్టర్‌లో ఉంచాలి
- ఆ సర్వే నంబర్ మొత్తాన్ని నమోదు చేయొద్దు
- దీన్ని పక్కాగా అమలు చేయండి
- రెవెన్యూ శాఖకు ప్రభుత్వం ఆదేశం



సాక్షి, అమరావతి: ఏదైనా భూమికి సంబంధించి వివాదం తలెత్తితే.. ఆ భూమిని మాత్రమే వివాద రిజిస్టర్‌లో ఉంచాలని రెవెన్యూ యంత్రాంగానికి ప్రభుత్వం స్పష్టం చేసింది. దానికి సంబంధించిన సర్వే నంబర్ మొత్తాన్ని వివాద రిజిస్టర్‌లో నమోదు చేయొద్దని ఆదేశించింది. ఉదాహరణకు ఒక సర్వే నంబర్‌లో 10 ఎకరాల భూమి
మిగతా 14వ పేజీలో ▶



వంశీరామ్ బిల్డర్స్‌పై
ఐటీ దాడులు
రెండు తెలుగు రాష్ట్రాల్లో 36 ప్రాంతాల్లో సోదాలు
భారీగా నగదు, కీలక పత్రాలు స్వాధీనం
సాక్షి, హైదరాబాద్/అమరావతి: తెలంగాణలోని రియల్ ఎస్టేట్ సంస్థల ఆర్థిక అవకతవకలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు వరుస దాడులు నిర్వహిస్తున్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ వంశీరామ్ బిల్డర్స్‌పై ఆదాయ పన్ను శాఖ అధికారులు మంగళవారం ఉదయం నుంచే రెండు తెలుగు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించారు. ఆ సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి నివాసంతో పాటు కార్యాలయాల్లో రాత్రి పొద్దుపోయే దాకా సోదాలు జరిపారు. ఈ రియల్ ఎస్టేట్ సంస్థ రెండు రాష్ట్రాల్లోనూ నిర్మాణాలు సాగిస్తోంది. వంశీరామ్ బిల్డర్స్ పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఐటీ అధికారులు తమ సోదాల్లో గుర్తించినట్లు సమాచారం. ఈ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ఖాతాల్లో నుంచి భారీగా నగదు బదిలీ అయినట్లు.. ఆ ఖాతాలన్నీ సంస్థ బినామీ ఖాతాలుగా గుర్తించినట్టు చెబుతున్నారు. సంస్థ లావాదేవీల్లో
మిగతా 14వ పేజీలో ▶

ఏపీని తాకనున్న మాండూస్ తుపాను
- వాయుగుండంగా మారిన అల్పపీడనం
- చెన్నైకి 1020 కి.మీల దూరంలో కేంద్రీకృతం
- నేటి సాయంత్రానికి తుపానుగా బలపడే అవకాశం
- తీరం దాటాక చిత్తూరు వైపు కదిలే అవకాశం
- 8 నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో భారీవర్షాలు
- మూడురోజులు వానల ప్రభావం..తీరం వెంబడి గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో గాలులు


14లో

క్లుప్తంగా...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు సీఎం జగన్ నివాళి



అంబేడ్కర్ చిత్రపటానికి నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు సీఎం వైఎస్ జగన్ ఘన నివాళులర్పించారు. మంగళవారం తాడేపల్లిలోని తన నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలను సీఎం జగన్ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పినిపే విశ్వరూప్, మేరుగ నాగార్జున, ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, నందిగం సురేష్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో సీఎం వైఎస్ జగన్ పర్యటన రద్దు

పొగమంచు కారణంగా ల్యాండింగ్‌కు సహకరించని వాతావరణం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన రద్దయ్యింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వచ్చాయి. ఉదయం 11 గంటలకు సీఎం కడప విమానాశ్రయానికి వచ్చి అక్కడి నుంచి పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనాల్సి ఉంది. అలాగే రాయచోటి రోడ్డులోని మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డిగారి మల్లికార్జునరెడ్డి కుమార్తె వివాహ వేడుకకు హాజరు కావాల్సి ఉంది. కాగా దట్టమైన పొగమంచు కారణంగా విమానం ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించదని ఏవియేషన్ అధికారులు తెలుపడంతో సీఎం తన పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. రెండు రోజులుగా జిల్లా కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నేతృత్వంలో ముఖ్యమంత్రి పర్యటనకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది.

గిరిజన గురుకులాల్లోని ఖాళీల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

- మొత్తం 317 టీచింగ్ పోస్టులు ఖాళీ
- జిల్లా స్థాయి కమిటీల ఆధ్వర్యంలో ఎంపిక

సీతంపేట: రాష్ట్ర గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు గురుకులాల జేఎస్ హేమలతారాణి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కేడర్‌లలో 317 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఐటీడీఏలు ఉన్న జిల్లాల్లో అయితే ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో, నాన్ ఐటీడీఏల పరిధిలో జేసీల ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీ జరగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రిన్సిపాళ్లు కన్వీనర్లుగా వ్యవహరించి పారదర్శకంగా పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థికి ఇంగ్లిష్ ప్రావీణ్యం తప్పనిసరి. లాంగ్వేజ్ టీచర్లు తప్ప మిగిలిన అన్ని సబ్జెక్టులకు అభ్యర్థులు రెండు చోట్ల ఇంగ్లిష్ మీడియంలో చదివి ఉండాలి. ఏపీ టెట్ తప్పనిసరిగా క్వాలిఫై కావాలి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పోస్టుల భర్తీ జరుగుతుంది. డెమో, టీచింగ్ సామర్థ్యం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పీఈటీ, పీడీలకు ఫిజికల్ టెస్ట్‌ను డీఎస్‌డీఓ నిర్వహిస్తారు. దరఖాస్తుల స్వీకరణ, డెమో నిర్వహణ, ఇంటర్వ్యూ తేదీలను ఆయా జిల్లాల జేసీలు, ఐటీడీఏ పీఓలు జారీ చేస్తారు.

మహాసభకు 82,432 మంది బీసీ ప్రజాప్రతినిధులు

- విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నేడు జయహో బీసీ మహాసభ
- బీసీ మహాసభకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన విజయవాడ



సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన జ్యోతీరావు పూలే, సీఎం వైఎస్ జగన్‌ల కటౌట్లు



సభా ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంపీ విజయసాయిరెడ్డి, మంత్రి చెల్లుబోయిన, ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: వెనుకబడిన వర్గాల ప్రజలను (బీసీలను) సమాజానికి వెన్నెముకలా తీర్చిదిద్దుతానంటూ 2019 ఫిబ్రవరి 17న ఏలూరులో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన బీసీ గర్జనలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లుగా చిత్తశుద్ధితో అమలుచేసి చూపిస్తున్నారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల కంటే ఆ వర్గాలకు అధిక ప్రయోజనం చేకూరుస్తున్నారు. ఇదే అంశాన్ని వివరించి.. రానున్న రోజుల్లో మరింత ప్రయోజనం కల్పిస్తామని బీసీలకు భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో బుధవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో 'జయహో బీసీ' మహాసభను వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తోంది. ఉదయం పదిగంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ పాల్గొని.. గత మూడున్నరేళ్లుగా బీసీలకు చేస్తున్న మేలును, రానున్న రోజుల్లో కలిగించబోయే ప్రయోజనాలను వివరించనున్నారు. ఈ మహాసభకు 82,432 మంది బీసీ ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ.. వారికి పేరుపేరునా ఆహ్వానపత్రికలను పంపారు. వెనుకబడిన వర్గాలే వెన్నెముక నినాదంతో నిర్వహిస్తున్న ఈ మహాసభకు ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంతోపాటు విజయవాడ నగరాన్ని వైఎస్సార్‌సీపీ జెండాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

బీసీ డిక్లరేషన్‌లో చెప్పినదానికంటే అధికంగా..

బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీల కంటే ఆ వర్గాల ప్రజలకు మూడున్నరేళ్లుగా సీఎం వైఎస్ జగన్ అధిక ప్రయోజనం చేకూర్చారు. సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక తోడ్పాటు అందిస్తూ పేదరికం నుంచి గట్టెక్కించడం, అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాలతో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం, పరిపాలనలో సింహభాగం భాగస్వామ్యం కల్పించడం ద్వారా సమాజానికి వెన్నెముకలా బీసీలను తీర్చిదిద్దుతున్న అంశాన్ని సీఎం వైఎస్ జగన్ వివరించనున్నారు. రానున్న రోజుల్లోనూ ఇదేరీతిలో ప్రయోజనం చేకూరుస్తామని భరోసా ఇవ్వనున్నారు. స్థానికసంస్థల్లో బీసీలకు 34 శాతం.. ఎస్సీ, ఎస్టీలతో కలిపి 59.85 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 2019 డిసెంబర్ 28న తమ ప్రభుత్వం జీవో జారీచేస్తే.. దీనిపై టీడీపీ నేతలను పురిగొల్పి సుప్రీం, హైకోర్టుల్లో కేసులు వేయించి.. రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించేలా చంద్రబాబు కుట్ర చేసిన తీరును వివరించనున్నారు. రిజర్వేషన్లు తగ్గించేలా చేసి బీసీ వర్గాలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచినా.. స్థానికసంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 34 శాతం కంటే అధికంగా బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన తీరును గుర్తుచేయనున్నారు.



విజయవాడ వారధిపై రెపరెపలాడుతున్న వైఎస్సార్‌సీపీ జెండాలు

సగర్వంగా తలెత్తుకునేలా పరిపాలన

టీడీపీకి బీసీలే వెన్నెముక.. బీసీలు లేనిదే టీడీపీ లేదు.. అంటూ మాయమాటలు చెప్పే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఆ వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన ఉదంతాలను సీఎం వైఎస్ జగన్ మరోసారి గుర్తుచేయనున్నారు. తమ హక్కులు పరిరక్షించాలని కోరిన నాయీ బ్రాహ్మణులను తోక కత్తిరిస్తానంటూ సచివాలయం సాక్షిగా చంద్రబాబు బెదిరించడాన్ని, ఇచ్చిన హామీని అమలు చేయాలని అడిగిన మత్స్యకారులను తాట తీస్తానంటూ చంద్రబాబు భయపెట్టిన తీరును గుర్తుచేయనున్నారు. బీసీలు న్యాయమూర్తులుగా పనికిరారంటూ సుప్రీంకోర్టు కొలీజియంకు చంద్రబాబు లేఖ రాయడాన్ని సీఎం వైఎస్ జగన్ ఎత్తిచూపనున్నారు. 2014–19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపకపోవడాన్ని ఎత్తిచూపుతూ.. ఈ మూడున్నరేళ్లలో రాష్ట్ర కోటాలో ఎనిమిది రాజ్యసభ స్థానాలు ఖాళీ అయితే.. అందులో నలుగురు బీసీలను తాము రాజ్యసభకు పంపడాన్ని గుర్తుచేయనున్నారు. టీడీపీ సర్కార్ హయాంలో బీసీల ఆత్మగౌరవాన్ని చంద్రబాబు దెబ్బతీస్తే.. తాము అన్నింటా సమున్నత గౌరవం వచ్చి బీసీలు సగర్వంగా తలెత్తుకునేలా పరిపాలిస్తున్న తీరును ముఖ్యమంత్రి వివరించనున్నారు.

టీడీపీకి సమాధి కట్టేది బీసీలే

- టీడీపీలో బీసీలను జెండా మోసేవారిగానే చూశారు
- బీసీలకు ఆత్మగౌరవం కల్పించిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్
- పార్టీ, ప్రభుత్వ పదవుల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు
- మూడున్నరేళ్లలోనే రూ.90,415 కోట్లు ఖర్చు చేశారు
- బీసీల సంక్షేమంపై టీడీపీ నేతలవి పచ్చి అబద్ధాలు
- జయహో బీసీ సభ సునామీలో టీడీపీ కొట్టుకుపోతుంది
- వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి/పటమట (విజయవాడ తూర్పు): వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో డిసెంబర్ 7న బుధవారం నిర్వహించనున్న జయహో బీసీ సభతో టీడీపీ అధినేత చంద్రబాబుకి వణుకు మొదలైందని వైఎస్సార్‌సీపీ నేతలు ఎద్దేవా చేశారు. అందుకే అయ్యన్న, అచ్చెన్నలాంటి టీడీపీ జాగిలాలను తమపైకి వదులుతున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లోనూ టీడీపీకి సమాధి కట్టేది బీసీలేనని స్పష్టం చేశారు. టీడీపీలో బీసీలను జెండా మోసేవారిగానే చూశారన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలోనే బీసీలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా మూడున్నరేళ్ల పాలనలోనే సీఎం జగన్ బడుగు, బలహీనవర్గాలకు రూ.90,415 కోట్లు డీబీటీ, నాన్ డీబీటీ విధానంలో అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఎవరేమన్నారంటే..

పెద్ద బీసీ.. సీఎం జగన్



శతాబ్దాల నుంచి బీసీలు వివక్ష అనుభవిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ బీసీలకు ఆత్మగౌరవంతోపాటు పాలనలో భాగస్వామ్యం కూడా కల్పించారు. పెద్ద బీసీ.. సీఎం జగన్ మాత్రమే. శతాబ్దాలుగా ఇనుప గజ్జెలతో మోతుబరి వ్యవస్థ మాపై నాట్యం చేస్తున్న తరుణంలో బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాస్ట్ కాదు.. దేశానికే బ్యాక్ బోన్ అని సీఎం జగన్ నిరూపించారు. పార్టీ, ప్రభుత్వ పదవుల్లో బీసీలకు పెద్దపీట వేశారు. గత ప్రభుత్వంలో బీసీలకు చంద్రబాబు కేవలం రూ.965 కోట్లు బడ్జెట్ మాత్రమే కేటాయించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా మూడేళ్లలోనే రూ.90,415 కోట్లు ఖర్చు చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జడ్పీపీలు, సహకార సంఘాల డైరెక్టర్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్‌లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, లోక్‌సభ, రాజ్యసభల్లో ఎంపీలుగా బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. గతంలో ఇంత పెద్ద మొత్తంలో పదవులు ఇచ్చిన దాఖలాలు లేవు. బీసీలు అధికంగా ఉండే విశాఖలో రాజధానిని ఏర్పాటు చేయడం బీసీల అభ్యున్నతికి చిహ్నం.

– తమ్మినేని సీతారాం, శాసనసభ స్పీకర్

బీసీల సంక్షేమంపై టీడీపీ నేతలవి పచ్చి అబద్ధాలు..



బీసీల సంక్షేమంపై టీడీపీ నేతల పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. 1995లో చంద్రబాబు టీడీపీని ఆక్రమించుకున్నాక ప్రతి సాధారణ ఎన్నికల్లో బీసీలకు 100 టికెట్లు ఇస్తామని చెప్పి ఆ మాట ఎందుకు నిలబెట్టుకోలేదు? దీన్ని ఎందుకు టీడీపీలోని బీసీ నాయకులు ప్రశ్నించలేకపోతున్నారు? బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుకున్నది టీడీపీకి చెందిన వ్యక్తి. ఇది వాస్తవం కాదా? కోర్టు ఆదేశాలు ఎలా ఉన్నా బీసీలకు మేలు చేయడానికి సీఎం జగన్ పార్టీ తరఫున రిజర్వేషన్లు అమలు చేశారు. బీసీలకు ఏటా రూ.10 వేల కోట్ల చొప్పున రూ. 50 వేల కోట్లు ఇస్తామని చెప్పి, కేవలం రూ.14,246 కోట్లు మాత్రమే బాబు ఖర్చు చేశారు. సీఎం జగన్ తొలి ఏడాదిలోనే రూ.15 వేల కోట్లు ఖర్చు చేశారు. 5 చట్టాలు, 56 కార్పొరేషన్లు, 9 నవరత్నాలు, 18 ప్రత్యేక పథకాలు, 14 శాఖల పథకాలు ప్రవేశపెట్టారు. అలాగే బీసీ జనగణన చేయాలని శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ సైతం పంపారు.

– యనమల నాగార్జున యాదవ్, అధికార ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ

టీడీపీలో వణుకు మొదలైంది..



ఈ మూడున్నరేళ్లలోనే బీసీల్లో ఎంతో పేరు సంపాదించిన సీఎం వైఎస్ జగన్‌ను చూసి టీడీపీ నేతలు తట్టుకోలేకపోతున్నారు. వైఎస్సార్‌సీపీ జయహో బీసీ సభ అనగానే టీడీపీలో వణుకు మొదలైంది. బీసీలే టీడీపీకి సమాధి కడతారు. బీసీలకు ఏం చేశామో.. ధైర్యంగా మేం చెప్పుకోగలం. చంద్రబాబుకు ఆ ధైర్యం ఉందా? బీసీలకు బాబు వెన్నుపోటు పొడిచారు. బీసీల గురించి మాట్లాడే అర్హత టీడీపీ నేతలకు లేదు. అయ్యన్నపాత్రుడు ఒక రోగ్. బీసీలను చంద్రబాబు ఓటింగ్ యంత్రాలుగానే చూశారు. ఒక్క బీసీకి కూడా రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇవ్వలేదు. సీఎం జగన్ ఏకంగా నలుగురు బీసీలను రాజ్యసభకు పంపించారు. బీసీల గుండెల్లో జగన్ ఉన్నారు. బాబు పునాదులు కదులుతున్నాయి. ఇదేం ఖర్మరా బాబూ అంటూ ప్రజలు విసుక్కుంటున్నారు.

–కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి

బీసీలే ఎజెండా రూపకర్తలు



జయహో బీసీ సభకు వచ్చే బీసీ సోదరుల సునామీలో చంద్రబాబు కొట్టుకుపోతారు. దీంతో టీడీపీకి చెందిన బీసీ జాగిలాలను మా మీద దాడికి వదిలారు. అయ్యన్నపాత్రుడు ఒక గంజాయి డాన్, స్మగ్లర్. ఈఎస్ఐలో మందులు మెక్కిన అచ్చెన్నాయుడు, కాల్‌మనీ సెక్స్ రాకెట్‌ల ద్వారా మహిళా జాతిని సర్వనాశనం చేసిన బుద్దా వెంకన్న ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు. బీసీలను చంద్రబాబు బానిసలుగా చూస్తే, అదే బీసీలకు రక్షగా సీఎం జగనన్న ఉన్నారు. టీడీపీలో బీసీలను జెండా మోసేవారిగానే చూశారు. అదే వైఎస్సార్‌సీపీలో బీసీలే ఎజెండా రూపకర్తలు. బీసీలు జడ్జీలుగా పనికిరారని చంద్రబాబు లేఖ రాసింది నిజమా? కాదా? కాదని లోకేష్ మీద ప్రమాణం చేయగలరా?

– కొండా రాజీవ్‌గాంధీ, అధికార ప్రతినిధి వైఎస్సార్‌సీపీ

జయహో బీసీ.. ఛలో విజయవాడ

- నేడు వైఎస్సార్‌సీపీ బీసీ మహాసభ
- పార్టీ మినీ ప్లీనరీ తరహాలో భారీ ఏర్పాట్లు
- 'వెనుకబడిన వర్గాలే వెన్నెముక' నినాదం
- భారీసంఖ్యలో వచ్చేవారికి అల్పాహారం, భోజన ఏర్పాట్లు
- విజయవాడ, గుంటూరు నగరాల్లో హోటళ్లు, కమ్యూనిటీ హాళ్లలో వసతి
- విజయవాడ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: వైఎస్సార్‌సీపీ బీసీ మహాసభకు విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం సిద్ధమైంది. 'వెనుకబడిన వర్గాలే వెన్నెముక' నినాదంతో బుధవారం నిర్వహిస్తున్న మహాసభకు భారీఏర్పాట్లు చేశారు. జయహో బీసీ.. అంటూ వెనుకబడిన కులాల ప్రతినిధులు ఛలో విజయవాడకు వస్తున్నారు. నగర పరిసర ప్రాంతాల్లో మహాసభకు వచ్చేవారికి స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున పోస్టర్లు ఏర్పాటు చేశారు. బీసీ మహాసభకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి మంగళవారమే బీసీల ర్యాలీలు బయలుదేరాయి. అనంతపురం జిల్లాతోపాటు పలు ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో బీసీ ప్రతినిధుల వాహనాలు విజయవాడకు పయనమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 82,432 మంది వెనుకబడిన తరగతులకు చెందిన ప్రతినిధులకు మహాసభకు ఆహ్వానం పంపించారు. వెనుకబడిన తరగతులకు చెందిన పంచాయతీ వార్డు మెంబర్, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ నుంచి జిల్లా, రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధులతోపాటు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారికి సైతం జయహో బీసీ మహాసభ ఆహ్వానాలు అందాయి. పార్టీ మినీప్లీనరీ తరహాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు వస్తున్న ఆహ్వానితుల సంఖ్యకు అనుగుణంగా సభ ప్రాంగణంతోపాటు అల్పాహారం, భోజన, వసతి ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోను రెండువేల బస్సులు ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా మరో రెండువేల భారీవాహనాల్లో బీసీ ప్రతినిధులు తరలిరానున్నారు. వాటితోపాటు సమీప ప్రాంతాల నుంచి సొంత కార్లు, బైక్‌లపైన కూడా పెద్దసంఖ్యలో విజయవాడకు వస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే బీసీ ప్రతినిధులకు విజయవాడ, గుంటూరు నగరాల్లో నాలుగువేలకుపైగా హోటల్ గదులు, 150 కమ్యూనిటీ హాళ్లు, కల్యాణమండపాల్లో వసతి ఏర్పాటు చేశారు. విజయవాడ నగరంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి తెచ్చారు. బందరు రోడ్డులో బెంజిసర్కిల్ నుంచి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ వరకు బీసీ సభకు వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తారు. విజయవాడ నగరం మీదుగా దూరప్రాంతాలకు వెళ్లే వాహనాలను నగర శివారు ప్రాంతాల నుంచే మళ్లిస్తున్నారు.

విజయవాడ నుంచి విజయదుందుభి

రాష్ట్రంలోని 139 వెనుకబడిన కులాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సామాజిక, ఆర్థిక, రాజకీయంగా బీసీలు మరింత అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ఈ సభను నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన మూడున్నరేళ్లలోనే బీసీలకు అందించిన లబ్ధిని జయహో బీసీ మహాసభలో వివరించనున్నారు. రానున్న కాలంలో బీసీలకు మరింత మేలుచేసేలా స్పష్టమైన సంకేతాలు ఇవ్వనున్నారు. క్షేత్రస్థాయిలో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ మహాసభ ద్వారా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుంది. విజయవాడ సభను విజయవంతంగా పూర్తిచేసుకున్న అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా జోనల్, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో ఇదే నినాదంతో సభలు నిర్వహించి విజయదుందుభి మోగించేందుకు నాంది పలకనున్నారు.

అల్పాహారంలో 9.. భోజనంలో 21 రకాల పదార్థాలు

జయహో బీసీ మహాసభకు సభా ప్రాంగణం, ఆహారం, నీరు, వసతి వంటి ఏర్పాట్ల బాధ్యతల్ని మంత్రుల నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులకు అప్పగించారు. వీరు నాలుగు రోజులుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సభకు వచ్చేవారికి 9 రకాల పదార్థాలతో అల్పాహారం, 21 రకాల పదార్థాలతో భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒకేసారి పదివేల మంది భోజనం చేసేలా రెండు ప్రదేశాల్లో భోజనశాలలు ఏర్పాటుచేశారు. అల్పాహారంలో ఇడ్లీ, గారె, మసాలా ఉప్మా, పొంగలి, సాంబారు, కొబ్బరి చట్నీ, టమోటా చట్నీ, స్వీట్, రవ్వకేసరి ఉన్నాయి. కాఫీ, టీ ఏర్పాటు చేశారు. మాంసాహారంలో మటన్ బిర్యానీ, చికెన్ ఫ్రై, చికెన్ కర్రీ, ఫిష్ ఫ్రై, రొయ్యలు కోడిగుడ్డు కర్రీ, చేపల పులుసు, కట్టా, ఉల్లి చట్నీ, అన్నం, పెరుగు, చక్కెర పొంగలి, శాఖాహారంలో వెజ్ బిర్యానీ (పనసకాయ ధమ్), పన్నీర్ గ్రీన్‌పీస్ కర్రీ, డబుల్ బీన్స్ జీడిపప్పు కర్రీ, ఉల్లి చట్నీ, టమాటాపప్పు, గోంగూర పచ్చడి, అన్నం, సాంబారు, పెరుగు, చక్కెర పొంగలి వడ్డిస్తారు.

12 గంటలకు సీఎం ప్రసంగం

జయహో బీసీ.. మహాసభ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుంది. వేదికపై బీసీ నాయకులు మాట్లాడతారు. 12 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి మధ్యాహ్నం 2 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరి 3.25 గంటలకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు రూరల్ మండలం కనపర్తిపాడుకు చేరుకుంటారు. 3.55 గంటల నుంచి 4.10 వరకు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం అక్కడినుంచి బయలుదేరి సాయంత్రం 6.20 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

నాడు అవమానం.. నేడు సమున్నతం..

సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక చేయూత.. రాజ్యాధికారంలో సింహభాగం వాటా.. బీసీ బిడ్డల చదువులకు అండగా నిలిచి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా బీసీ సామాజిక వర్గాలను సీఎం వైఎస్ జగన్ సమాజానికి వెన్నెముకలా నిలబెడుతున్నారని సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా మూడున్నరేళ్లలో పేదలకు రూ.1,77,585.51 కోట్లను పారదర్శకంగా అందించగా బీసీ వర్గాలకే రూ.85,915.06 కోట్ల మేర ప్రయోజనం చేకూరటాన్ని ప్రస్తావిస్తున్నారు. నగదు బదిలీ, నగదేతర బదిలీతో పేదలకు మొత్తం రూ.3,19,227.86 కోట్ల మేర లబ్ధి చేకూరగా బీసీ వర్గాలకే రూ.1,63,344.10 కోట్ల మేర మేలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టి అమ్మఒడి, విద్యాకానుక అందచేసి పిల్లలను చదువుకునేలా ప్రోత్సహించడంతోపాటు విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాల ద్వారా బీసీ బిడ్డలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు.

అధికారంగా వాటా..

ఎన్నికలకు ముందు 2019 ఫిబ్రవరి 17న వైఎస్సార్‌సీపీ ఏలూరులో బీసీ గర్జన సభను నిర్వహించింది. తాము అధికారంలోకి రాగానే బీసీలకు చేసే మేలును బీసీ డిక్లరేషన్ రూపంలో ఈ సభలో వైఎస్ జగన్ ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక అందులో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగా వారికి ప్రయోజనం చేకూర్చారు. అవి ఏమిటంటే...

- 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50% ఓట్లతో 151 అసెంబ్లీ సీట్లు, 22 లోక్‌సభ స్థానాలతో చారిత్రక విజయాన్ని సాధించింది. 2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. 2019 జూన్ 8న ఏర్పాటు చేసిన మంత్రి వర్గాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 11న పునర్వ్యవస్థీకరించారు. 25 మంది సభ్యులున్న తాజా కేబినెట్‌లో 11 మంది బీసీలకు స్థానం కల్పించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అంజాద్ బాషాతో పాటు బూడి ముత్యాలనాయుడును డిప్యూటీ సీఎంగా నియమించారు. విద్య, రెవెన్యూ, లాంటి కీలక శాఖలను ఆ వర్గాలకే అప్పగించారు.
- స్పీకర్‌గా బీసీ వ్యక్తి అయిన తమ్మినేనికు అవకాశం కల్పించారు. శాసన మండలిలో వైఎస్సార్‌సీపీకి 32 మంది సభ్యులుండగా అందులో బీసీలే అత్యధికం కావడం గమనార్హం.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 8 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగ్గా నలుగురు బీసీలను జగన్ రాజ్యసభకు పంపారు.

వైఎస్సార్‌సీపీ వెంటే బీసీలు..

జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపక్షంలో ఉన్నప్పుడే రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టింది. అధికారంలోకి వచ్చాక బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ చిత్తశుద్ధితో కృషిచేస్తుండటంతో ఆ వర్గాలు వైఎస్సార్‌సీపీ వెంటే నడుస్తున్నాయని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంట్ ఉభయ సభల్లో పోరాటం చేస్తూ బీసీల అభ్యున్నతి కోసం శాశ్వత కమిషన్‌ను సీఎం నియమించడంతో ఆయా వర్గాలు వైఎస్సార్‌సీపీకి వెన్నెముకలా నిలిచాయి. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాలు ఇందుకు నిదర్శనమని ప్రస్తావిస్తున్నారు. బీసీల జనాభా అధికంగా ఉండే కుప్పంలో టీడీపీ కోట కుప్ప కూలటానికి ఇదే కారణమంటున్నారు.

- స్థానిక సంస్థల్లో బీసీలకు 33% రిజర్వేషన్లు కల్పించడంపై హైకోర్టును ఆశ్రయించేలా టీడీపీ నేతలను చంద్రబాబు ఉసిగొల్పారు. హైకోర్టు తీర్పుతో బీసీల రిజర్వేషన్లు 24%కి తగ్గిపోయాయి. రిజర్వేషన్లు తగ్గినా అంతకంటే ఎక్కువగా బీసీలకు స్థానిక సంస్థల్లో అవకాశం కల్పిస్తానని సీఎం హామీ ఇచ్చి మాటను నిలబెట్టుకున్నారు.
- 13 జిల్లా పరిషత్‌ల్లో 9 జడ్పీ చైర్‌పర్సన్ పదవులను (70%) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే కేటాయించారు. ఇందులో బీసీలకే పెద్దపీట వేశారు.
- మండల పరిషత్ ఎన్నికల్లో 648 మండలాలకుగాను వైఎస్సార్‌సీపీ 635 మండల పరిషత్ అధ్యక్ష పదవులను దక్కించుకోగా అందులో 67 శాతం పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకే ఇచ్చారు. ఇందులో కూడా గరిష్టంగా బీసీలకే పదవులు దక్కాయి.
- 13 కార్పొరేషన్లనూ వైఎస్సార్ సీపీ క్లీన్‌స్వీప్ చేయగా ఏడు చోట్ల మేయర్ పదవులు బీసీలకు ఇచ్చారు. మొత్తంగా మేయర్ పదవుల్లో 92 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే దక్కాయి. ఇందులోనూ బీసీలకే అగ్రతాంబూలం కల్పించారు.
- 87 మున్సిపాలిటీల్లో 84 వైఎస్సార్‌సీపీ కైవశం చేసుకోగా చైర్‌పర్సన్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 73% ఇచ్చారు. ఇందులోనూ బీసీలదే అధిక శాతం వాటా ఉంది.

చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవులు..

- దేశ చరిత్రలో ఎక్కడాలేని రీతిలో నామినేటెడ్ పదవులు, పనుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 % రిజర్వేషన్ కల్పిస్తూ సీఎం చట్టం తెచ్చారు. 196 వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పదవుల్లో 76(39%) బీసీలకే ఇచ్చారు.
- వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో 137 చైర్మన్ పదవుల్లో 53 బీసీలకు కేటాయించారు. బీసీలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు.
- 137 కార్పొరేషన్లకు సంబంధించి మొత్తం 484 డైరెక్టర్ పదవుల్లో 201 బీసీలకు (42%) ఇచ్చారు.

పెద్దల సభకు ఒక్కరినీ పంపలేదు

బీసీలు లేనిదే టీడీపీ లేదంటూ తరచూ చెప్పే చంద్రబాబు ఆ వర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చాక వారికి వెన్నుపోటు పొడిచారు. 2014లో అధికార పగ్గాలు చేపట్టాక మంత్రివర్గంలో ఆరుగురు బీసీలకే బాబు అవకాశం కల్పించగా 11 మంది ఓసీలకు ఛాన్స్ ఇచ్చారు. 2014–19 మధ్య రాజ్యసభకు ఒక్క బీసీని కూడా బాబు పంపలేదు. నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానంటూ, మత్స్యకారులను తాట తీస్తానంటూ బెదిరించారు. అడుగడుగునా బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీశారు.

సివిల్స్ మెయిన్స్‌లో 2,529 మందికి అర్హత

- 1:2.5 నిష్పత్తిలో పర్సనాలిటీ పరీక్షకు ఎంపిక
- జనవరిలో ఇంటర్వ్యూలకు అవకాశం
- తెలుగు రాష్ట్రాల నుంచి వంద మంది

సాక్షి, హైదరాబాద్: సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష ఫలితాలను యూపీఎస్సీ మంగళవారం వెల్లడించింది. దేశవ్యాప్తంగా సెప్టెంబర్16 –25 తేదీల మధ్య ఈ పరీక్షలు జరిగాయి. ప్రిలిమ్స్ అర్హత సాధించిన దాదాపు 15 వేల మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి 700 మంది మెయిన్స్ రాశారు. పరీక్ష రాసిన వారిలో ఒక పోస్టుకు 2.5 మంది చొప్పున 2,529 మందిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. దీని ప్రకారం తెలుగు రాష్ట్రాల నుంచి 100 మంది ఇంటర్వ్యూకు వెళ్లగలుగుతున్నారు. దేశవ్యాప్తంగా 1,044 సివిల్ సర్వీస్ పోస్టులను భర్తీ చేయాలని యూపీపీఎస్సీ సంకల్పించింది. మెయిన్స్‌లో అర్హత పొందిన వారికి జనవరి రెండో వారంలో ఇంటర్వ్యూలు ఉండే అవకాశముంది. ఈ నెల 8 నుంచి 14 వరకు డిటైల్డ్ అప్లికేషన్ ఫాం–2ను అభ్యర్థులు పూర్తి చేయాలి. ఇంటర్వ్యూలో, మెయిన్స్‌లో వచ్చే మార్కులను కలిపి ఫైనల్ ర్యాంకు ప్రకటిస్తారు.

క్లుప్తంగా...

'ఈ-సంజీవని'లో ఏపీ టాప్

సాక్షి, న్యూఢిల్లీ: ఈ-సంజీవని (ఉచిత టెలిమెడిసిన్ సర్వీస్)ను ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 8 కోట్ల మంది వినియోగించుకోగా ఆంధ్రప్రదేశ్ 2,82,4,2880 కాలర్స్‌తో తొలి స్థానంలో ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. తర్వాత స్థానాల్లో పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, తెలంగాణ, గుజరాత్ ఉన్నాయని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

తపస్వి హత్య దారుణం

మహిళ కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



తపస్వి తల్లిదండ్రులను ఓదారుస్తున్న వాసిరెడ్డి పద్మ

గుంటూరు ఈస్ట్: మెడికో తపస్వి హత్య దారుణమని, సోషల్ మీడియా స్నేహాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. ప్రేమోన్మాది జ్ఞానేశ్వర్ చేతిలో హత్యకు గురైన తపస్వి మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్ మార్చురీలో మంగళవారం ఆమె సందర్శించారు. కన్నీరు మున్నీరవుతున్న తపస్వి తల్లిదండ్రులు పిన్నమనేని సీతారత్నం, మహేష్‌లను ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ.. జ్ఞానేశ్వర్ వేధిస్తున్న విషయాన్ని తపస్వి తల్లిదండ్రులకు చెప్పలేదని తెలిపారు. నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారని తెలిపారు. నిందితుడికి తక్షణమే శిక్ష పడితే భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరుగకుండా నివారించగలుగుతామన్నారు. సీఎం వైఎస్ జగన్ దిశ చట్టానికి ఎంతో కమిట్‌మెంట్‌తో రూపకల్పన చేశారని చెప్పారు. దిశ యాప్ వచ్చిన తర్వాత యువతులు, మహిళలను వేధించే ఘటనలు గణనీయంగా తగ్గాయన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు మోటార్ వాహనాల పంపిణీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు మోటార్ వాహనాల పంపిణీ ప్రక్రియ మొదలైంది. ఈ నెల 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాకినాడ, బాపట్ల, నెల్లూరు, ప్రకాశం, చిత్తూరులో 244 మోటార్ వాహనాలను విభిన్న ప్రతిభావంతులకు అందజేశారు. పలు జిల్లాల్లో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలో అర్హుల జాబితాలను ఖరారు చేస్తున్నారు. ఆ ప్రక్రియ పూర్తి కాగానే ఆయా జిల్లాల్లోను మోటార్ వాహనాల పంపిణీ చేపడతారు. ఈ నెలాఖరులోగా రాష్ట్రంలోని 1,750 మోటార్ వాహనాల పంపిణీని పూర్తి చేస్తామని ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ ఎండీ ఎంఏ కుమార్‌రాజా 'సాక్షి'కి తెలిపారు.

అంబేడ్కర్ ఆలోచనా విధానంతో జగన్ పాలన

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున
- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రులు నాగార్జున, చెల్లుబోయిన తదితరులు

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ నిర్మాత, 'భారతరత్న' డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి మంత్రులు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అంబేడ్కర్ ఆశయాలను విస్మరించాయని, కేవలం ఆయన వర్ధంతి, జయంతిలకు విగ్రహాలకు దండలు వేయడానికే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా... అని ప్రతిపక్ష నేత చంద్రబాబు వ్యాఖ్యానించి అంబేడ్కర్ ఆలోచనలకు తూట్లు పొడిచారని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారన్నారు. అంబేడ్కర్ ఆలోచించిన విధంగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతి కోసం సీఎం జగన్ పని చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, నాయకులు కనకారావు మాదిగ, ఎం.శేషగిరిరావు, నారాయణమూర్తి, చిల్లపల్లి మోహనరావు, కె.రాజశేఖర్, పానుగంటి చైతన్య, పలువురు పార్టీ నేతలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్ పరిచయమే ఆమె ప్రాణం తీసింది

పథకం ప్రకారమే మెడికోను హతమార్చిన దుండగుడు

- సర్జికల్ బ్లేడుతో గొంతు కోసి.. కత్తితో మూడుచోట్ల పొడిచి హత్య
- సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా ఆమె ఆచూకీ గుర్తించిన నిందితుడు



పిన్నమనేని తపస్వి (ఫైల్)



మన్నే జ్ఞానేశ్వర్

ఫోన్ లొకేషన్ ఆధారంగా తపస్వి రూమ్‌కెళ్లి..

తపస్వి వినియోగిస్తున్న ఐఫోన్‌ను టవర్ లొకేషన్ ఆధారంగా ఆమె ఉంటున్న రూమ్‌ను గుర్తించిన జ్ఞానేశ్వర్ హత్య చేయడానికి ముందు ఓ సారి తక్కెళ్లపాడు వచ్చాడు. తనను పెళ్లి చేసుకోవాలని కోరగా.. ఆమె అంగీకరించకపోవడంతో వెళ్లిపోయాడు. తనకు దక్కని ఆమె మరెవరికీ దక్కకూడదన్న కక్షతో పథకం ప్రకారం సర్జికల్ బ్లేడు, కత్తితో సోమవారం రాత్రి తక్కెళ్లపాడు వచ్చాడు. సర్జికల్ బ్లేడుతో పలుమార్లు తపస్వి గొంతు కోయడమే కాకుండా కత్తితో మూడుచోట్ల పొడిచాడు. నిందితుడు జ్ఞానేశ్వర్‌ను మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్టు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. తపస్వి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. మృతురాలి మేనత్త డాక్టర్ కొల్లి మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదకాకాని: గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో సోమవారం రాత్రి హత్యకు గురైన బీడీఎస్ విద్యార్థిని పిన్నమనేని తపస్వి కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇన్‌స్టాగ్రామ్ పరిచయమే ఆమె ప్రాణాలమీదకు తెచ్చింది. పోలీసులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన పిన్నమనేని తపస్వి గన్నవరం పిన్నమనేని సిద్ధార్థ కళాశాలలో బీడీఎస్ తృతీయ సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి పిన్నమనేని మహేష్‌కుమార్ మహారాష్ట్రలో ఓ కంపెనీకి సీఈవోగా పనిచేస్తుండగా.. తల్లి సీతారత్నం ముంబైలోని చైతన్య కళాశాల డీన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తపస్వి సోదరి ఆస్ట్రేలియాలో చదువుతోంది. కాగా, తపస్వికి రెండేళ్ల క్రితం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం మానికొండకు చెందిన మన్నె జ్ఞానేశ్వర్‌తో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. అతడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా.. వారి పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలోనే గడచిన ఆగస్ట్ నెల నుంచి మూడు నెలలపాటు ఇద్దరూ విజయవాడలో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని అక్కడే ఉన్నారు. అనంతరం ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో తపస్వి విభేదించి జ్ఞానేశ్వర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేయకుండా వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని కోరడంతో కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు ఆమెకు ఎప్పుడు ఫోన్ చేయవద్దని హెచ్చరించి పంపేశారు. అయినప్పటికీ జ్ఞానేశ్వర్ ఫోన్‌చేసి విసిగిస్తుండటంతో తక్కెళ్లపాడులోని కళాశాలలో బీడీఎస్ చదువుకుంటున్న చిన్ననాటి స్నేహితురాలి రూమ్‌కు నవంబర్ 20న వచ్చేసిన తపస్వి అక్కడే ఉంటోంది. తపస్వి గతంలో జ్ఞానేశ్వర్‌కు అనేకసార్లు ఖర్చులకు నగదు ఇవ్వడంతో పాటు బైక్ కూడా కొనిచ్చింది.

పాలిటెక్నిక్ విద్యార్థుల ముంగిటకే ఉద్యోగావకాశాలు

▶ మొదటి పేజీ తరువాయి

కోర్సులను కూడా ప్రారంభిస్తోంది. ఎక్కువమంది విద్యార్థులు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ వంటి కోర్సులకు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. మరోవైపు ఆఫీస్ ఆటోమేషన్, ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ, బ్యూటిఫికేషన్, ఫుడ్ ప్రాసెసింగ్, ఏసీ మెషిన్స్, ఫుట్‌వేర్ టెక్నాలజీ తదితర అంశాల్లో 6 నుంచి 18 నెలల కాలవ్యవధితో సర్టిఫికెట్ కోర్సులకు కూడా సాంకేతిక విద్యా శాఖ శ్రీకారం చుట్టింది.



ఉపాధి లభించే కోర్సులకు పెద్దపీట..

పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాలిటెక్నిక్‌ల్లో ప్రభుత్వం కోర్సులను ప్రవేశపెడుతోంది. ఉపాధి అవకాశాలు ఉన్న సిరామిక్స్ టెక్నాలజీ, టెక్స్‌టైల్స్ టెక్నాలజీ, మెటలర్జీ వంటి కోర్సుల్లో ఎక్కువమంది చేరుతుండడంతో వాటిలోనూ సీట్లు పెరిగాయి. అన్ని పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రభుత్వం వర్చువల్ డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటు చేసింది. అలాగే పారిశ్రామిక శిక్షణా కార్యక్రమాల కోసం విద్యాసంస్థలను పరిశ్రమలతో అనుసంధానిస్తున్నారు. అధ్యాపకులను కూడా దశలవారీగా గంగవరం పోర్టు, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు ప్రాంతాలకు, పరిశ్రమలకు శిక్షణ కోసం పంపుతున్నారు.

విద్యార్థులకు స్టైఫండ్‌తో ఇంటర్న్‌షిప్..

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆయా పరిశ్రమల్లో స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అందించడానికి చర్యలు చేపట్టారు. పాలిటెక్నిక్‌ల్లో మూడున్నరేళ్ల, మూడేళ్ల డిప్లొమా కోర్సులు ఉన్నాయి. మూడేళ్ల కోర్సు విద్యార్థులకు ఆరు నెలలు, ఇతర విద్యార్థులకు ఏడాది పాటు ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల ద్వారా 11,604 మంది, ప్రైవేట్ పాలిటెక్నిక్‌ల ద్వారా 24,669 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్ పొందుతున్నారు. దీనికోసం సాంకేతిక విద్యాశాఖ 566 పరిశ్రమలు, ఇతర సంస్థలతో చర్చించి ఏర్పాట్లు చేసింది. ఇంటర్న్‌షిప్‌లో విద్యార్థులకు పరిశ్రమలు నెలకు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు స్టైఫండ్ అందిస్తున్నాయి.

విద్యార్థులకు నైపుణ్యాల పెంపు

ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసినవారితోపాటు డిప్లొమా విద్యార్థుల వైపు కూడా కంపెనీలు దృష్టి సారిస్తున్నాయి. అందుకనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఫలితంగా 90 శాతం మంది విద్యార్థులు ఉద్యోగావకాశాలు దక్కించుకుంటున్నారు. డిప్లొమా విద్యార్థులకు ప్లేస్‌మెంట్లను పెంచేందుకు సాంకేతిక విద్యాశాఖ పరిశ్రమలతో ఎప్పటికప్పుడు చర్చిస్తోంది. కియా, అపాచీ, ఎఫ్‌ట్రానిక్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), శ్రీసిటీతో సహా కొన్ని కంపెనీలకు వెళ్లి సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి చర్చలు జరిపారు. ప్రతి కాలేజీలో ప్లేస్‌మెంట్ సెల్‌లను ఏర్పాటు చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా విద్యార్థులందరికీ ఉద్యోగావకాశాలను కల్పించడానికి క్లస్టర్ ఆధారిత ప్లేస్‌మెంట్ మోడల్‌ను అమలు చేస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు వివిధ ప్రాంతాల్లో క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు.

నైపుణ్యాల పెంపునకు పలు సంస్థలతో ఒప్పందాలు

పరిశ్రమ అవసరాలకనుగుణంగా విద్యార్థులను తయారు చేసేందుకు సిస్కో, ఏడబ్ల్యూఎస్, రెడ్-హెట్, పాలో-ఆల్టో, బ్లూప్రిజమ్ మాక్రో చిప్ వంటి ప్రముఖ సంస్థలతో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నారు. విద్యార్థులు తమ కోర్సులతోపాటు ఇతర ఆన్‌లైన్ కోర్సులను నేర్చుకోవడానికి వీలుగా 'స్పోకెన్ ట్యుటోరియల్' కోసం ఐఐటీ-బాంబేతో ఎంవోయూ చేసుకున్నారు. 17 స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేయగా మరో 17 హబ్‌లను సిద్ధం చేస్తున్నారు. పాలిటెక్నిక్ కాలేజీల్లో కంప్యూటర్లు, ఇతర ల్యాబ్ పరికరాలను ఆధునికీకరిస్తున్నారు. వీటితో పాటు కాలేజీలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కళ్యాణదుర్గ, కుప్పంలోని కాలేజీలకు ఈ గుర్తింపు ఉండగా మరో 49 కాలేజీలకు అక్రిడిటేషన్ వచ్చేలా చర్యలు చేపడుతున్నారు.

పాలిటెక్నిక్‌ల్లోనూ నాడు-నేడు

పాలిటెక్నిక్‌లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కావాల్సిన మేర నిధులను కేటాయిస్తోంది. నాబార్డ్-ఆర్ఐడీఎఫ్ ఆధ్వర్యంలో 70 సివిల్ పనులకు రూ.365.46 కోట్లు మంజూరు కాగా రూ.218.66 కోట్లతో 49 పనులు పూర్తయ్యాయి. వీటితోపాటు మరో 15 సివిల్ పనులకు రూ.82.84 కోట్లకు రాష్ట్ర ప్రణాళిక గ్రాంట్లు మంజూరయ్యాయి. ఇవి కాకుండా 16 ఎస్సీ హాస్టళ్లు, 27 మహిళా హాస్టళ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. నాడు-నేడు కింద పాలిటెక్నిక్‌లను కూడా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరాం. రూ.10 లక్షల ప్రైజ్‌మనీతో ఇటీవల డిప్లొమా విద్యార్థుల కోసం పాలీ టెక్‌ఫెస్ట్-2022ని కూడా నిర్వహించాం. ప్రాంతీయ స్థాయిలో 1,081 ప్రాజెక్టులు ప్రదర్శించగా.. రాష్ట్ర స్థాయికి 253 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఫెస్ట్‌లో వచ్చిన ఆలోచనలను ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సహకారంతో అభివృద్ధి చేస్తాం. పేటెంట్లు పొందడానికి దరఖాస్తులు కూడా పంపనున్నాం.

– చదలవాడ నాగరాణి,
కమిషనర్, సాంకేతిక విద్యా శాఖ

వైఎస్సార్‌సీపీ నేత దారుణ హత్య



బరాటం రామశేషు (ఫైల్)

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని శ్రీకూర్మం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వైస్ ఎంపీపీ బరాటం రామశేషు (45) మంగళవారం ఉదయం దారుణ హత్యకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామశేషు ఉదయం 6 గంటలకు శ్రీకూర్మంలోని తన ఇంటి నుంచి సుమారు అర కిలో మీటరు దూరంలో దువ్వుపేట సమీపాన ఉన్న తమ గ్యాస్ గోడౌన్‌కు బయలుదేరి వెళ్లారు. ఆయన ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచే ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అనుసరిస్తూ వెళ్లి గోడౌన్ సమీపంలోని అరటితోటలో మాటు వేశారు. రామశేషు గోడౌన్ వద్దకు చేరుకునే సమయానికి గ్యాస్ సిలిండర్‌ల డెలివరీ బండ్లు, పనివారు వెళ్లిపోయారు. మార్గమధ్యంలోనే పనివారి నుంచి ఆయన గోడౌన్ తాళాలను తీసుకున్నారు. గోడౌన్ వద్దకు రామశేషు చేరుకుని తన బైక్‌ను నిలుపుతుండగా, మాస్కులు ధరించిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి దాడి చేశారు. పదునైన వేటకత్తితో తలపై మూడుచోట్ల నరికారు. దీంతో రామశేషు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందారు. స్థానికులు గుర్తించి వెంటనే అతని కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామశేషు తండ్రి బరాటం నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు గార ఎస్ఐ ఎం.మధుసూదనరావు కేసు నమోదు చేశారు. రామశేషుపై 2017లోనూ హత్యాయత్నం జరిగింది. ఆ కేసు ఇంకా విచారణలో ఉంది. ఇప్పుడు ఆయన హత్య వెనుక రాజకీయ కక్షలు ఉన్నాయా... రియల్ ఎస్టేట్ గొడవలు ఉన్నాయా .. మరేమైన ఇతర కారణాలు ఉన్నాయా... అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'తానా' అంతర్జాతీయ కార్టూన్ పోటీల పోస్టర్ల ఆవిష్కరణ



కార్టూన్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాద్ తదితరులు

సాక్షి, అమరావతి: తెలుగు భాష, తెలుగు కార్టూన్ కీర్తిని విశ్వవ్యాప్తం చేసేందుకు అంతర్జాతీయ కార్టూన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకుడు ప్రసాద్ తోటకూర తెలిపారు. మంగళవారం విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయం ఆడిటోరియంలో కార్టూన్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొలిసారిగా తానా అంతర్జాతీయ తెలుగు కార్టూన్ పోటీలు-2023ను ఏర్పాటు చేసిందన్నారు. వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ, తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటేలా కార్టూన్లు పంపాలని తెలిపారు. పోటీల్లోని ఎంట్రీల నుంచి 12 అత్యుత్తమ కార్టూన్లను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.5,000, మరో 13 ఉత్తమ కార్టూన్లకు గాను ఒక్కొక్కరికీ రూ.3,000 చొప్పున మొత్తం 25 మందికి నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగు కార్టూనిస్టులు పోటీల్లో పాల్గొనవచ్చని, ఒక్కొక్కరి నుంచి మూడు కార్టూన్లను స్వీకరిస్తామని తెలిపారు. ఎంట్రీలను 300 రిజల్యూషన్ జేపీఈజీ ఫార్మేట్‌లో tanacartooncontest23@gmail.comకు ఈ నెల 26లోగా పంపాలన్నారు. ఫలితాలను జనవరి 15న సంక్రాంతి రోజు ప్రకటిస్తామని చెప్పారు. వివరాల కోసం 9154555675, 9885289995 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యనిర్వాహక సభ్యులు కళాసాగర్, కలిమిశ్రీ, జాకీర్ పాల్గొన్నారు.

'పీఎం కిసాన్' కోసం కేవైసీ చేయించుకోవాలి

సాక్షి, అమరావతి: పీఎం కిసాన్ లబ్ధిదారులైన రైతులు అందరూ 13వ విడత ఆర్థిక సాయం పొందడానికి తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ సూచించారు. ఆయన మంగళవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ ఈ-కేవైసీ చేయించుకోలేని రైతులు విధిగా ఓటీపీ లేదా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా నమోదు చేయించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. రబీ సీజన్‌కు ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని చెప్పారు. డిసెంబర్ 16న కడప, 20న ఒంగోలు, 28న విశాఖపట్నంలో గ్యాప్ సర్టిఫికేషన్‌పై జోనల్ స్థాయి శిక్షణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న డ్రోన్ పైలెట్ రెండో విడత శిక్షణకు రైతులను ఎంపిక చేయాలని సూచించారు.

టెన్త్ ప్రశ్నపత్రం లీకేజీ కేసులో..

నారాయణకు చుక్కెదురు

- టీడీపీ మాజీ మంత్రి నారాయణ వాదనను తోసిపుచ్చిన హైకోర్టు
- రిమాండ్ తిరస్కరించడంపై రివిజన్ దాఖలు చేయడం సరైందే
- సెషన్స్ కోర్టులో పోలీసులు దాఖలు చేసిన రివిజన్ విచారణార్హమైందే
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు తీర్పు
- కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి కేసు నాలుగు వారాల్లో తేల్చాలని సెషన్స్ కోర్టుకు ఆదేశం

సాక్షి, అమరావతి: పదవ తరగతి ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో తనకు బెయిల్ మంజూరు చేస్తూ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ సెషన్స్ కోర్టులో పోలీసులు దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌కు ఎలాంటి విచారణార్హత లేదంటూ నారాయణ విద్యా సంస్థల అధినేత, టీడీపీకి చెందిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. సెషన్స్ కోర్టు ముందు పోలీసులు రివిజన్ పిటిషన్ దాఖలు చేయడం సరైందేనని, ఆ పిటిషన్‌కు విచారణార్హత ఉందని హైకోర్టు స్పష్టంచేసింది. అయితే, నారాయణకు మేజిస్ట్రేట్ ఇచ్చిన బెయిల్‌ను రద్దుచేస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దుచేసింది. సెషన్స్ కోర్టు కేసు పూర్వాపరాల్లోకి వెళ్లకుండానే మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేసిందని తెలిపిన హైకోర్టు, తిరిగి కేసు పూర్వాపరాలన్నింటినీ విచారించి వాటి ఆధారంగా నిర్ణయం వెలువరించాలని సెషన్స్ కోర్టును ఆదేశించింది. ఇందుకు నాలుగు వారాల గడువు విధించింది. ఈ రివిజన్ తేలేంత వరకు నారాయణపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులకు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు మంగళవారం తీర్పు వెలువరించారు.

అసలు ఏం జరిగిందంటే..

పదవ తరగతి ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో నారాయణను అరెస్టుచేసిన పోలీసులు అతన్ని చిత్తూరు మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరిచారు. అయితే, నారాయణ రిమాండ్‌ను మేజిస్ట్రేట్ తిరస్కరిస్తూ ఉత్తర్వులిచ్చారు. తద్వారా నారాయణ బెయిల్‌పై విడుదలయ్యారు. దీనిపై పోలీసులు సెషన్స్ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సెషన్స్ కోర్టు.. నారాయణకు బెయిల్ ఉత్తర్వులను రద్దుచేసి ఆయన కోర్టులో లొంగిపోవాలని ఆదేశించింది. దీంతో చిత్తూరు సెషన్స్ కోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులను కొట్టేయాలని కోరుతూ నారాయణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు విచారణ జరిపారు.

అవి బెయిల్ ఉత్తర్వులు కాదు: అదనపు ఏజీ

నారాయణ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. బెయిల్‌ను రద్దుచేయాలని కోరుతూ సెషన్స్ కోర్టులో పోలీసులు దాఖలుచేసిన రివిజన్ పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులు రిమాండ్‌ను తిరస్కరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులే తప్ప బెయిల్ మంజూరు చేసిన ఉత్తర్వులు కాదన్నారు. అలాగే, రిమాండ్‌ను తిరస్కరిస్తూ మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులు తాత్కాలిక ఉత్తర్వులు కాదని, అందువల్ల ఆ ఉత్తర్వులపై దాఖలు చేసే రివిజన్ పిటిషన్‌కు విచారణార్హత ఉందన్నారు. నారాయణపై నమోదు చేసిన ఐపీసీ సెక్షన్-409 చెల్లదంటూ రిమాండ్ సమయంలోనే మేజిస్ట్రేట్ తేల్చేశారని, తద్వారా ఓ మినీ ట్రయల్ నిర్వహించారని అదనపు ఏజీ వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు మంగళవారం తన నిర్ణయాన్ని వెలువరించారు.

అదనపు ఏజీ వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి

మేజిస్ట్రేట్ రిమాండ్‌ను తిరస్కరించినప్పుడు దానిపై సెషన్స్ కోర్టులో రివిజన్ దాఖలు చేయవచ్చునని, దానికి విచారణార్హత ఉందన్న అదనపు ఏజీ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. అయితే, పోలీసులకు తమ వాదన వినిపించే అవకాశం మేజిస్ట్రేట్ కోర్టు ఇవ్వలేదని, అందువల్ల నారాయణ రిమాండ్‌ను తిరస్కరిస్తూ మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులను రద్దుచేస్తున్నట్లు సెషన్స్ జడ్జి తన ఉత్తర్వుల్లో పేర్కొనడాన్ని న్యాయమూర్తి తప్పుపట్టారు. కానీ, మేజిస్ట్రేట్ ముందు వాదనలు వినిపించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) నిరాకరించారని, దీంతో ప్రభుత్వం పీపీపై చర్యలకు ఉపక్రమించిందని న్యాయమూర్తి గుర్తుచేశారు. అంతేకాక.. మేజిస్ట్రేట్ తన ముందున్న ఆధారాలను బట్టే నారాయణ రిమాండ్‌ను తిరస్కరించారా? అన్న విషయాన్ని కూడా సెషన్స్ కోర్టు పరిశీలించలేదన్నారు. అందువల్ల నారాయణ రిమాండ్‌ను తిరస్కరిస్తూ మేజిస్ట్రేట్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేస్తూ సెషన్స్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేస్తున్నట్లు న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వుల తప్పొప్పులపై ఇరుపక్షాలు వాదనలు వినిపించాయని, అయితే.. ఆ విషయాన్ని తేల్చాల్సింది సెషన్స్ కోర్టే తప్ప హైకోర్టు కాదన్నారు. అందువల్ల సెషన్స్ కోర్టు తిరిగి ఈ కేసు పూర్వాపరాల్లోకి వెళ్లి మేజిస్ట్రేట్ ఉత్తర్వుల సంగతి తేల్చాలని స్పష్టంచేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

ఉద్యోగ సంఘాల నేతలతో సజ్జల, మంత్రులు బొత్స, ఆదిమూలపు సమావేశం



ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశమైన బొత్స సత్యనారాయణ, సురేష్, సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఉద్యోగుల పెండింగ్ అంశాలు, సీపీఎస్‌పై మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఉద్యోగ సంఘాల నాయకులతో మంత్రుల కమిటీ సమావేశమైంది. అనంతరం మంత్రి బొత్స మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. సీపీఎస్‌పై ప్రత్యేకంగా మరో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. సమాచారలోపం వల్ల సీపీఎస్‌పై సమావేశం అని ఆహ్వానం పంపారని తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీపీఎస్‌కు సంబంధించిన సమావేశం అని చెప్పడంతో హాజరవకూడదని నిర్ణయించామని తెలిపారు. కానీ తర్వాత ఉద్యోగుల అన్ని సమస్యలపై చర్చిద్దామని సమాచారం ఇవ్వడంతో హాజరైనట్లు చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై వచ్చే సమావేశంలో సీఎంతో చర్చించిన అనంతరం మాట్లాడతామని మంత్రులు చెప్పారని తెలిపారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీంపైనా చర్చించాలని కోరామన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్‌ఆర్), చిరంజీవి చౌదరి, ఆర్థిక శాఖ కార్యదర్శి గుల్జార్, సర్వీసెస్ అండ్ హెచ్‌ఆర్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్, ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.సూర్యనారాయణ, ఎస్టీయూ అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎం.గిరిప్రసాద్, యూటీఎఫ్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, ఏపీటీఎఫ్ అధ్యక్షుడు జి.హృదయరాజు ఇతర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌తో రైతుకు 'మద్దతు' ధర

పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: రైతులకు పూర్తి మద్దతు ధర కల్పించేందుకే ధాన్యం సేకరణలో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టినట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధాన్యం తరలింపులో భాగంగా దూరంగా ఉన్న మిల్లుకు కేటాయించినప్పటికీ రవాణా ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్బీకేల్లో విక్రయించాలనే నిబంధన లేదని, గిట్టుబాటు ధర లభిస్తే వ్యాపారులకు, మిల్లర్లకు అమ్ముకోవచ్చన్నారు. ఆ వివరాలను సమాచారం నిమిత్తం ఆర్బీకేలకు తెలపాల్సి ఉందని తెలిపారు. ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ 1902, 155251, ప్రధాన కార్యాలయ కంట్రోల్ రూమ్ 18004251903, కమిషనర్ కార్యాలయంలో 1800 425 0082/1967 నంబర్లను సంప్రదించాలని కోరారు.



దేనితోనైనా అనుబంధం పెంచుకోవడం
అనేది వేదనకు దారితీస్తుంది.
- బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, డిసెంబర్, 7

ఇది ముందడుగే కానీ...

మహిళా ఆరోగ్య రంగంలో ఒక శుభవార్త. మన దేశంలో ప్రసూతి మరణాల రేటు గతంతో పోలిస్తే తగ్గింది. భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్జీఐ) ప్రత్యేక బులెటిన్ ఈ మంచి వార్తను మోసుకొచ్చింది. ప్రసూతి మరణాల రేటును లక్షకు వంద లోపునకు తగ్గించాలంటూ జాతీయ ఆరోగ్య విధానం (ఎన్‌హెచ్‌పీ)లో పెట్టుకున్న లక్ష్యాన్ని భారత్ అందుకుంది. తాజా ఘనతలో కేరళ, తెలంగాణ, ఏపీ సహా పలు దక్షిణాది రాష్ట్రాలదే కీలక పాత్ర. 2014-16 మధ్య ప్రతి లక్ష జననాల్లో 130 మంది చనిపోయేవారు. అది 2018-20కి వచ్చేసరికి లక్షకు 97 ప్రసూతి మరణాలకు తగ్గింది. ఈ ధోరణి కొనసాగితే, రానున్న 2030 కల్లా లక్షకు కేవలం 70 లోపలే ఉండాలన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని (ఎస్డీజీ) భారత్ అందుకుంటుంది. కేంద్రం, రాష్ట్రాల ఆరోగ్య పథకాల సానుకూల ఫలితమే ఇది.

గర్భిణిగా ఉండగా కానీ, ప్రసవమైన 42 రోజుల లోపల కానీ తలెత్తిన ఆరోగ్య సమస్యల వల్ల 15-49 ఏళ్ళ మధ్యవయసు స్త్రీ మరణిస్తే దాన్ని 'ప్రసూతి మరణం' అంటారు. ఇక, ఒక నిర్ణీత కాల వ్యవధిలో ప్రతి లక్ష జననాలకూ ఎందరు ప్రసూతి మహిళలు మరణించారనే సంఖ్యను 'ప్రసూతి మరణాల రేటు/ నిష్పత్తి' (ఎంఎంఆర్) అని నిర్వచనం. శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్సార్‌ఎస్) నుంచి నిష్పాదించిన గణాంకాల్ని బట్టి మన దేశంలో ఎంఎంఆర్ నానాటికీ తగ్గుతోంది. ఆ క్రమాన్ని గమనిస్తే 2014-16లో 130 మరణాలు, 2015-17లో 122 మరణాలు, 2016-18లో 113 మరణాలు, 2017-19లో 103 మరణాలు, తాజాగా 2018-20లో 97 మరణాలే నమోదయ్యాయి. అంటే లక్షకు 70 లోపలే మరణాలుండాలనే ఐరాస లక్ష్యం దిశగా భారత్ అడుగులేస్తోందన్న మాట.

ఈ సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర గణనీయం. గతంలో 6 రాష్ట్రాలే ఎస్డీజీని సాధించగా, ఇప్పుడు వాటి సంఖ్య 8కి పెరిగింది. లక్షకు కేవలం 19 మరణాలతో కేరళ అగ్రస్థానంలో ఉండగా, ఆ తరువాత క్రమంగా మహారాష్ట్ర (33), తెలంగాణ (43), ఆంధ్రప్రదేశ్ (45), తమిళనాడు (54), జార్ఖండ్ (56), గుజరాత్ (57), కర్ణాటక (69) నిలిచి, లక్ష్య సాధనలో గణుతికెక్కాయి. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద నాణ్యమైన మాతా శిశు ఆరోగ్య సేవలను అందరికీ అందించాలనీ, తద్వారా నివారించదగ్గ ప్రసూతి మరణాలను వీలైనంత తగ్గించాలనీ మన దేశం చేసిన నిరంతర కృషి మెచ్చదగినది. ఆరోగ్య సేవలను సమకూర్చడంపై, ముఖ్యంగా ప్రసూతి ఆరోగ్యకార్యక్రమాల అమలుపై కేంద్రం, రాష్ట్రాల శ్రద్ధ ఈ ఫలితాలకు కారణం.

నిజానికి, ప్రసూతి ఆరోగ్యమనేది స్త్రీల స్వస్థత, పోషకాహారం, గర్భనిరోధకాల అందుబాటు సహా అనేక అనుబంధ రంగాల్లోని పురోగతిని తెలిపే కీలకమైన సూచిక. ఎంఎంఆర్ 100 లోపునకు తగ్గడమనేది దేశంలో ఇదే తొలిసారి. పైగా, 2014-16తో పోలిస్తే ఎంఎంఆర్ దాదాపు 25 శాతం తగ్గడం చెప్పుకోదగ్గ విషయం. అయితే, కేంద్ర ఆరోగ్యశాఖ విడుదల చేసిన ఈ డేటాను మరింత లోతుగా పరిశీలిస్తే, మెరుగుపడాల్సిన అనేక అంశాలు కనిపిస్తాయి. ఎంఎంఆర్ జాతీయ సగటు తగ్గినప్పటికీ, ఉత్తరాదిలోని అనేక రాష్ట్రాల్లో పలు పరస్పర వైరుద్ధ్యాలు చోటుచేసుకున్నాయి. కేరళలో ఎంఎంఆర్ ఏకంగా 19కి పడిపోతే, అస్సామ్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ లాంటి చోట్ల మాత్రం ప్రసూతి మరణాలు 160కి పైన ఉండడమే దీనికి నిదర్శనం. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడ్డ ప్రాంతాల్లోనే ఈ పరిస్థితి నెలకొంది. నిజానికి, దేశాభివృద్ధి ఈ ప్రాంతాలపైనే ఆధారపడ్డది.

అనేక ఇతర లోటుపాట్లూ లేకపోలేదు. వివిధ రాష్ట్రాల మధ్యనే కాక, వివిధ జిల్లాల్లో, అలాగే వివిధ జనాభా వర్గాల మధ్యనా అంతరాలున్నట్టు అర్థమవుతోంది. రాష్ట్ర సర్కార్ల శ్రమతో దక్షిణాది రాష్ట్రాల్లో కొన్నేళ్ళుగా ప్రసూతి మరణాలు తగ్గిన మాట వాస్తవమే. కానీ, ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో గర్భిణులపై హింసాఘటనలు అత్యధిక సంఖ్యలో నమోదు అవుతున్న చేదునిజాన్ని విస్మరించలేం. అంటే, దేశం మొత్తాన్నీ చూస్తే మన పురోగతి ఇప్పటికీ అతుకుల బొంతే. అసమానతలు అనేకం. ఆ మాటకొస్తే, ఈ ఏడాది జూలైలో ప్రసిద్ధ పీఎల్ఓఎస్ గ్లోబల్ పబ్లిక్ హెల్త్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం సైతం మన లెక్కల్లోని లోటుపాట్లను ప్రస్తావించింది. దేశంలోని 70 శాతం (640 జిల్లాల్లో 448) జిల్లాల్లో ఐరాస ఎస్డీజీకి భిన్నంగా ప్రసూతి మరణాలెక్కువని ఎత్తిచూపింది.

మునుపటితో పోలిస్తే కొంత మెరుగుపడ్డా, స్వాతంత్ర్య అమృతోత్సవ వేళలోనూ ఈశాన్య రాష్ట్రాల సహా అనేక జిల్లాల్లో ప్రసూతి మరణాల రేటు ఎందుకు ఎక్కువగా ఉందో పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. డబల్ ఇంజన్ సర్కార్ అని గొప్పలు చెబుతున్న రాష్ట్రాలే అధిక మరణాల అపకీర్తిలో ముందుండడం గమనార్హం. మార్పులతో 'జననీ శిశు సురక్షా కార్యక్రమ్', 'జననీ సురక్షా యోజన' లాంటి ప్రభుత్వ పథకాల స్థాయి పెంచడం బానే ఉంది. కానీ, స్త్రీల సమగ్ర ఆరోగ్య రక్షణను మెరుగుపరచడమెలాగో చూడాలి. గర్భిణుల్లో రక్తహీనత మునుపటికన్నా పెరిగింది. గర్భిణుల్లో వైద్య చెకప్‌లు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ అందనివారే నేటికీ అనేకం.

అందుకే, కీలక ఆరోగ్య డేటాను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. దేశం మొత్తం ఎస్డీజీని చేరేలా తక్షణచర్యలు చేపట్టాలి. వీటిని కేవలం అంకెలుగా భావిస్తే పొరపాటు. ఆ అంకెల వెనకున్నది తల్లులు, అప్పుడే పుట్టిన పిల్లలు, యావత్ కుటుంబాలనే స్పృహ అవసరం. ఆ వైఖరితో నిశితంగా వ్యవహరిస్తే మంచిది. అనేక ప్రాణాలు నిలుస్తాయి. ఆరోగ్య భారతావని గెలుస్తుంది. ఆ కృషిలో ప్రసూతి మరణాల రేటు పదిలోపే ఉండేలా చేసిన బెలారస్, పోలెండ్, బ్రిటన్‌లే మనకు ఆదర్శం.

తెలుగు నేలపై చైతన్య యాత్ర

సందర్భం



డాక్టర్ జి. లీలావరప్రసాదరావు

నవభారత నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు తెలుగు నేలతో ఎంతో అనుబంధం ఉంది. పలు సందర్భాల్లో తెలుగు ప్రాంతాల్లో పర్యటించి ఇక్కడి ప్రజలను చైతన్యపరిచారు. భారతదేశంలో అంబేడ్కర్ ఇష్టపడి, ఎన్నో సార్లు విడిది చేసిన అతికొద్ది నగరాల్లో హైదరాబాద్ ఒకటి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాల్లో కూడా ఆయన పర్యటించారు. దేశానికి స్వాతంత్ర్యంతో పాటు బహుజనులకు కూడా స్వాతంత్ర్యం కావాలని కాంక్షిస్తూ పలు చైతన్యయాత్రలు ఆంధ్రలో చేశారు.

అటువంటి పర్యటనల్లో 1944 సెప్టెంబరు 27వ తేదీ నుంచి అక్టోబరు 4వ తేదీ వరకూ జరిపిన పర్యటన చారిత్రాత్మకమైనది. అది రెండో ప్రపంచ యుద్ధ సమయం. అందుకే యుద్ధమనేది బ్రిటిష్ వారి సొంత వ్యవహారమనీ, యుద్ధం మన లక్ష్యం కాదనీ, సామాజిక స్వాతంత్ర్యం మన గమ్య మంటూ తన ప్రసంగాల ద్వారా ఇక్కడి ప్రజలను చైతన్యపరిచారు. విజయవాడ మొదలు కొని విశాఖ పట్నం వరకూ పర్యటించారు. తొలుత బెజవాడ రైల్వేస్టేషన్ లోనూ, గుడివాడ మెయిన్ రోడ్‌లోనూ ప్రజలనుద్దేశించి ఉపన్యసించారు.



తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురంలో...

బాలికల వసతి గృహానికి గుడివాడలో శంకుస్థాపన చేశారు. అనంతరం ఏలూరు సందర్శించారు. అక్కడ మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్‌ను అభిమానులు, పురపాలక సభ్యులు ఘన సన్మానం చేశారు. కొవ్వూరులో ఎస్సీ కాలనీని సందర్శించి. షెడ్యూలు కాస్ట్ ఫెడరేషన్ ఫ్లాగ్‌ను ఈ కార్యక్రమంలో ఆవిష్కరించారు. అందుకే 'జెండా పేట'గా ఆ కాలనీకి నామకరణం చేసుకున్నారు ప్రజలు. అనంతరం, తాడేపల్లిగూడెంలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, పాలకొల్లు, రామచంద్రాపురం వెళ్లారు. రాజమండ్రి వచ్చిన సందర్భంగా అక్కడి టౌన్ హాల్‌లో ఘనంగా పౌర సన్మానం జరిగింది. కాకినాడ పర్యటన అనంతరం పిఠాపురం వచ్చి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడి రాజా కళాశాల మైదానంలో జరిగిన బహి రంగ సభలో పాల్గొన్నారు.

తుని రైల్వేస్టేషన్ వద్ద ప్రసంగించిన అనంతరం అనకాపల్లి చేరుకోగా భారీ సంఖ్యలో ప్రజలు, అభిమానులు అంబేడ్కర్‌కు అక్కడి రైల్వేస్టేషన్ వద్ద స్వాగతం పలికారు. అక్కడి మున్సిపల్ స్కూల్లో జరిగిన సభలో ప్రసంగించిన అనంతరం, పట్టణ ప్రజలు, వైశ్య సంఘం అంబేడ్కర్‌కు ఘన సత్కారం చేశాయి. ఆనాటి అంబేడ్కర్ పర్యటనకు గుర్తుగా ఈ ప్రాంతం 'భీముని గుమ్మం' అని ప్రాచుర్యం పొందింది. అక్కడి ప్రభుత్వ పాఠశాలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును పెట్టి ఈ ప్రాంతీయులు నివాళి అర్పించారు.

పర్యటన చివరలో విశాఖ సిటీకి వచ్చి పోర్టులో కార్మికులను కలిశారు. తర్వాత కలెక్టరేట్ వద్ద జరిగిన సభలో మాట్లాడారు.

అంబేడ్కర్ ఆంధ్రలో పర్యటించినపుడు ఆయన ప్రసంగాలను నందనారు హరి, రావూరి ఏకాంబరం, కుసుమ వెంకటరామయ్య, పాము రామమూర్తి, జొన్నల మోహనరావు తదితరులు పలుచోట్ల తెలుగులోకి అనువదించేవారు. మొత్తం మీద అంబేడ్కర్ పర్యటన తెలుగు నేలను చైతన్యపరచింది.

వ్యాసకర్త అసిస్టెంట్ ప్రొఫెసర్, బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం

ప్రాజెక్టుల నడుగుదాం... నీళ్లెవరిచ్చారో?

- సీమలో కొత్తగా ఐదు మెడికల్ కాలేజీలు, రెండు క్యాన్సర్ ఆసుపత్రులు
- కొత్త పరిశ్రమలే కాదు... పారిశ్రామిక క్లస్టర్లకూ నడుంకట్టిన జగన్
- సమగ్రాభివృద్ధిలో భాగంగానే 'న్యాయ' రాజధానిని చేయాలని యోచన
- ఈ వాస్తవాలకు పాతరేసి ఎల్లో రాతలతో 'ఈనాడు' విషం

విశాఖలో రాజధాని కోసం స్థానికులంతా గర్జిస్తే... అప్పుడు రామోజీరావుకు విశాఖలో భూ కుంభకోణాలు కనిపించాయి. రాయలసీమ వాసులంతా ఏకమై మాకు 'న్యాయ' రాజధాని కావాలని ఇప్పుడు నినదిస్తే... రామోజీకి సడెన్‌గా రాయలసీమ వెనకబాటుతనం గుర్తుకొచ్చింది. పూర్తికాని ప్రాజెక్టులు మాత్రమే కనిపించాయి.

కానీ... చరిత్రలో ఎన్నడూ లేనట్టుగా బ్రహ్మంసాగర్ రిజర్వాయర్లో పూర్తి సామర్థ్యానికి తగ్గట్టు 17.85 టీఎంసీల నీళ్లు నిండటం 'ఈనాడు'కు కనిపించలేదు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో పూర్తి సామర్థ్యానికి తగ్గట్టు 10 టీఎంసీలను నిల్వచేయటం ప్రస్తావించనే లేదు. ఇక గండికోట రిజర్వాయర్లో గరిష్ఠ సామర్థ్యానికి తగ్గట్టు 26.85 టీఎంసీల నీరు నిల్వ చేయటం కూడా రామోజీకి పట్టదు. ఎందుకంటే... ఇవన్నీ చంద్రబాబు నాయుడు తన ఐదేళ్ల పాలనలో చెయ్యలేని పనులు. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ మూడున్నరేళ్లలోనే సాధించిన విజయాలు. లీకేజీలకు అడ్డుకట్ట వేస్తే బ్రహ్మం సాగర్ బాగుపడుతుందని, పునరావాసం కల్పిస్తే గండికోటలో గానీ, చిత్రావతిలో గానీ గరిష్ఠంగా నీటిని నిల్వ చేయొచ్చని చంద్రబాబు నాయుడికి తెలియదా? మరెందుకు చేయలేదు? అప్పుడెందుకు రామోజీరావు ఇలాంటి కథనాలు రాయలేదు? ఇప్పుడు పనిచేస్తున్న ప్రభుత్వంపై కూడా పనిగట్టుకుని ఎందుకు విమర్శలు చేస్తున్నారు? దీనికి సమాధానం ఒక్కటే. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేసి... 'న్యాయ' రాజధానిగా చేస్తానని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చెప్పటం చంద్రబాబుకు సుతరామూ ఇష్టం లేదు. బాబుకు ఇష్టం లేనిదేదైనా... రామోజీకీ నచ్చదు కదా!!. 'సీమ'ంతైనా మేలు చేశారా... అంటూ వండివార్చిన కథనంలో నిజమెంత? ఏది నిజం? చూద్దాం...



ఒక్క నీరే కాదు. పరిశ్రమలు, వైద్య కళాశాలలు... ఇలా రాయలసీమ సమగ్రాభివృద్ధికి అడుగులు వేస్తున్నారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి. సాగునీటి సౌకర్యాలను మెరుగుపర్చడంతో పాటు ఐదు వైద్య కళాశాలలు, రెండు క్యాన్సర్ ఆసుపత్రులను కొత్తగా ఏర్పాటు చేస్తుండటం ద్వారా వైద్య సౌకర్యాలను మెరుగుపరిచేందుకు నడుంకట్టారు. ఒకటీ అరా పరిశ్రమలు కాదు... ఏకంగా పారిశ్రామిక క్లస్టర్లతోనే సీమ సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. దుర్భిక్ష రాయలసీమ సస్యశ్యామలమైతే.. అక్కడ రాజకీయంగా తమకు నూకలు చెల్లినట్లేనన్నది టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆందోళన. అప్పుడు తమ డీపీటీకి (దోచుకో..పంచుకో..తినుకో) శాశ్వతంగా తెర పడుతుందనే రామోజీరావు బాధ. అందుకే వికృత రాతలకు ప్రాణంపోస్తూ.. ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు.

నిజానికిపుడు రాయలసీమలో బ్రహ్మంసాగర్, గండికోట, సీబీఆర్, వెలుగోడు.. నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు ఇలా ఏ ప్రాజెక్టును చూసినా ఇపుడు నిండుకుండను తలపిస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఆయకట్టుకు నీళ్లందుతున్నాయి. కానీ చంద్రబాబు హయాంలో ఈ ప్రాజెక్టుల్లో నాలుగో వంతు కూడా నిండని పరిస్థితి. కొన్నిటికి లీకేజీలు... మరికొన్నిటికి నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవటం... ఇలా అన్నీ సమస్యలే. వాటికి నిధులు ఖర్చుచేసి ప్రాజెక్టుల్ని పూర్తిస్థాయి సామర్థ్యంతో నింపాల్సిన ప్రభుత్వం ఆ ఊసే గాలికొదిలేసింది. 'సీమ'ంతైనా న్యాయం చేయలేకపోయింది. కాకపోతే చంద్రబాబు ఏం చేసినా కరెక్టేనని చెప్పటమే తమ బాధ్యతగా భావించే 'ఈనాడు', దాని తోక పత్రిక, ఇతర ఛానెళ్లు ఈ వాస్తవాలను ఎన్నడూ చెప్పలేదు. ఇపుడు మాత్రం అకస్మాత్తుగా వాటికి రాయలసీమ గుర్తుకొచ్చింది. అమ్మో... సీమ అన్యాయమైపోతోందంటూ గుండెలు బాదుకుంటున్నాయి.

- బ్రహ్మంసాగర్ రిజర్వాయరు గరిష్ఠ సామర్థ్యం 17.85 టీఎంసీలు. కానీ మట్టికట్టలో నిర్మాణ లోపాల వల్ల లీకేజీలు ఉండటంతో నిల్వ సామర్థ్యం నాలుగైదు టీఎంసీలకు పడిపోయింది. 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న చంద్రబాబు... ఎన్నడూ లీకేజీలకు అడ్డుకట్ట వేసి గరిష్ఠ సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేద్దామనే ప్రయత్నాలు చేయలేదు. రాయలసీమను సస్యశ్యామలం చేద్దామనే ఆలోచనే చంద్రబాబుకు రాలేదు. ఆ నాలుగైదు టీఎంసీల నిల్వతోనే నెట్టుకొచ్చేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక... యుద్ధప్రాతిపదికన బ్రహ్మంసాగర్ మట్టికట్టలో లీకేజీలున్న చోట రూ.వంద కోట్లతో డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారు. లీకేజీలకు అడ్డుకట్ట వేసి ఏకంగా 17.85 టీఎంసీలను నిల్వ చేసి... ఆయకట్టు చివరి భూములక్కూడా నీళ్లిచ్చారు. ఖరీఫ్ పూర్తయినా ఇప్పటికీ బ్రహ్మంసాగర్‌లో 15.11 టీఎంసీల నీరు నిల్వ ఉందనే విషయం రామోజీకి తెలియదా? ఎందుకు రాయరు?



- గండికోట రిజర్వాయర్ గరిష్ఠ సామర్థ్యం 26.85 టీఎంసీలు. కానీ 2014 నుంచి 2019 మధ్య నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడంతో ఐదారు టీఎంసీలు కూడా నిల్వ చేయలేని దుస్థితి ఉండేది. పునరావాసం కల్పించే ఆలోచన కూడా చంద్రబాబు చేయలేదు. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టాక రూ.వెయ్యి కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పించారు. గత రెండేళ్లుగా గరిష్ఠంగా నీటిని నిల్వ చేస్తున్నారు. ఇప్పుడు కూడా రిజర్వాయర్‌లో 26.85 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇలాంటి వాస్తవాలను రాస్తే రాయలసీమకు చేస్తున్న మేలు బయటపడుతుందని... అబద్ధాలు రాయటానికే అలవాటు పడ్డారు రామోజీరావు!!.
- చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ది (సీబీఆర్) కూడా గండికోట లాంటి కథే. దీని గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 10 టీఎంసీలు. కానీ 2014 నుంచి 2019 మధ్య చంద్రబాబు నిర్వాసితులకు పునరావాసం కల్పించలేదు. ఫలితంగా నాలుగైదు టీఎంసీలను కూడా నిల్వ చేయలేని పరిస్థితి. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక రూ.600 కోట్లతో నిర్వాసితులకు పునరావాసం కల్పించారు. రెండేళ్లుగా సీబీఆర్‌లో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం సీబీఆర్‌లో 9.61 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ఇదీ వాస్తవం.
- గాలేరు-నగరి వరద కాలువలో అంతర్భాగమైన అవుకు వద్ద పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో రెండు సొరంగాలను తవ్వాలి. ఇందులో ఒకటి మహానేత వైఎస్సార్ హయాంలోనే పూర్తయింది. రెండో సొరంగంలో మిగిలిన 162 మీటర్ల పనులను ఐదేళ్లలో చంద్రబాబు పూర్తి చేయలేక చేతులెత్తేశారు. ఫాల్ట్ జోన్‌లోని ఆ సొరంగం పనులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ పూర్తి చేయిస్తున్నారు. మరో రెండు నెలల్లో ఈ సొరంగం పూర్తి కాబోతున్నది కూడా. అప్పుడు గాలేరు-నగరి ద్వారా ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులు తరలించడానికి మార్గం సుగమం అవుతుంది. రాయలసీమ కరవు నివారణ పథకంలో భాగంగా గాలేరు-నగరి కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు పెంచడంలో భాగంగా అవుకు వద్ద పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో మరో సొరంగాన్ని కూడా సీఎం వైఎస్ జగన్ చేపట్టారు.

తాకట్టు పెట్టిన బాబే గొప్పా..?

రాయలసీమ తాగు, సాగునీటికి శ్రీశైలం ప్రాజెక్టే ఆధారం. శ్రీశైలంలో 800 అడుగుల కంటే దిగువ నుంచి అక్రమంగా నీటిని తరలించడానికి 2015లో తెలంగాణ సర్కార్ పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలను చేపడితే నాటి సీఎం చంద్రబాబు అడ్డుకోలేకపోయారు. ఓటుకు కోట్లు కేసులో తెలంగాణ సర్కార్‌కు అడ్డంగా దొరికిపోయిన బాబు.. ఆ కేసు నుంచి తప్పించుకోవడానికి కృష్ణా జలాలపై రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టు పెట్టేశారు. పాలమూరు-రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి, ఎడమ గట్టు కేంద్రం ద్వారా తెలంగాణ సర్కార్ ఎడాపెడా నీటిని తోడేస్తే.. శ్రీశైలంలో నీటి మట్టం తగ్గిపోతుంది. శ్రీశైలంలో నీటిమట్టం 854 అడుగుల కంటే దిగువన ఉంటే కృష్ణా బోర్డు కేటాయింపులున్నా సరే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు నీటిని సరఫరా చేయడానికి అవకాశం ఉండదు. ఈ నేపథ్యంలో 854 అడుగులకు దిగువన ఉన్నా శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీర్చడానికి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి, రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షణకు నడుం బిగించారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్. దీనిపై తెలంగాణ సర్కార్ ఎన్జీటీని ఆశ్రయించింది. పర్యావరణ అనుమతులు తెచ్చుకున్నాకనే రాయలసీమ ఎత్తిపోతల పనులు కొనసాగించాలని ఎన్జీటీ ఆదేశించడంతో.. ఆ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతి కోసం ఇప్పటికే కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు దరఖాస్తు చేసిన ప్రభుత్వం.. ఆ అనుమతిని తెచ్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోంది. కాకపోతే కబోదిలా మారిన రామోజీకి ఇవేవీ కనిపించవు. రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టాలనే ఆలోచన కూడా చేయని చంద్రబాబే రామోజీకి ఆదర్శ నాయకుడు. ఎందుకంటే.. తన అక్రమాలకు రక్షకుడు కాబట్టి. శ్రీశైలానికి వరద వచ్చే 30 నుంచి 40 రోజుల్లోనే రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాజెక్టులను నింపేలా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, కాలువలు, ఎత్తిపోతల సామర్థ్యం పెంచే పనులను రాయలసీమ కరవు నివారణ పథకంలో భాగంగా రూ.43,336 కోట్ల వ్యయంతో చేపట్టారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్. అదీ... సీమకు చేతల్లో చేస్తున్న న్యాయం.

వైద్యంతో పాటు 'న్యాయం'...

వైద్య సౌకర్యాలలోనూ రాయలసీమ ముందుండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఏకంగా ఐదు మెడికల్ కాలేజీలను, రెండు క్యాన్సర్ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో వైద్య విద్య సీట్లు పెరగటమే కాదు... మెరుగైన వైద్యమూ అందుబాటులోకి రానుంది. ఇక శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో రాష్ట్ర హైకోర్టు ఏర్పాటు చేయాలన్నది ముఖ్యమంత్రి నిర్ణయం. ఇప్పటికే ఈ నిర్ణయంలో భాగంగా లోకాయుక్త, వినియోగదారుల కోర్టుతో సహా కొన్ని న్యాయాధికార ప్రాంగణాలు అక్కడ కొలువుదీరాయి. హైకోర్టు రావాలంటూ యావత్తు రాయలసీమ ఉద్యమిస్తోంది కూడా. కాకపోతే రామోజీరావుకు ఈ వాస్తవాలతో పనిలేదు. అందుకే అసలు రాయలసీమ వాసులెవ్వరికీ అక్కడ న్యాయస్థానం రావాలని లేదని, అందరూ అమరావతికే కట్టుబడి ఉన్నారనే ప్రచారాన్ని చంద్రబాబు మొదలెట్టారు. తాను కర్నూలు వెళ్లి అడిగానని, అక్కడి వారంతా అమరావతి రాజధానిగా ఉండటానికే అంగీకరించారని చెప్పటం ఆరంభించారు. దానికి కొనసాగింపుగానే... రామోజీ ఈ వంకర రాతలు మొదలెట్టారు. ఇదీ.. గురుశిష్యుల గూడుపుఠాణీ.

సీమలో శరవేగంగా పారిశ్రామికాభివృద్ధి...

వెనుకబడిన రాయలసీమను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంపైనా సీఎం జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. మహానేత వైఎస్ హయాంలో శ్రీ సిటీ రాకతో రాయలసీమ రూపు రేఖలు మారగా...... సీఎం జగన్ వైఎస్ఆర్ జిల్లా కొప్పర్తి వద్ద, కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద రెండు భారీ పారిశ్రామిక పార్కులకు శ్రీకారం చుట్టారు. వాటిని పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ మూడున్నరేళ్లలో వివిధ రంగాలకు చెందిన 29 భారీ ప్రాజెక్టులకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. ఈ 29 ప్రాజెక్టుల ద్వారా రూ.88,333.66 కోట్ల విలువైన పెట్టుబడులు రావడమే కాకుండా 76,992 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. వీటిలో తిరుపతి జిల్లా ఇనగలూరు వద్ద హిల్‌టాప్ (అపాచీ) సెజ్ భారీ పాదరక్షల తయారీ, పులివెందులలో సుమీత్ ఫుట్ వేర్, కొప్పర్తి వద్ద నీల్‌కమల్, పిట్టి లామినేషన్స్, నాయుడుపేట వద్ద గ్రీన్‌టెక్ ఎనర్జీ, చిత్తూరు జిల్లా ఎలకటూరు వద్ద అమ్మపూర్ టెక్స్‌టైల్, తిరుపతి జిల్లా తమ్మినపట్నం వద్ద జిందాల్ స్టీల్, పులివెందుల వద్ద ఆదిత్య బిర్లా ఫ్యాషన్స్, బద్వేల్ వద్ద సెంచురీ ప్యానల్స్, కొప్పర్తి వద్ద కాసిస్ ఎలక్ట్రిక్ బస్సులు తయారీ వంటి పలు ప్రాజెక్టులు ఉన్నాయి. కేవలం పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడమే కాకుండా అక్కడ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు ముఖ్యమంత్రి జగన్. కర్నూల్ జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కుకు రూ.428 కోట్లతో 74 ఎంఎల్‌డీ నీటి సరఫరా, కొప్పర్తికి రూ.150 కోట్లతో 46 ఎంఎల్‌డీ నీటి సరఫరా ప్రాజెక్టులను ఏపీఐఐసీ చేపట్టింది. ఎండాకాలంలో నీటి ఎద్దటి లేకుండా కొప్పర్తి వద్ద రూ.38 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణాన్ని చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ నిక్‌డిక్ట్ సహకారంతో ఓర్వకల్లు వద్ద 4,742 ఎకరాలు, కొప్పర్తి వద్ద 2,595 ఎకరాల్లో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తోంది. ఇది కాకుండా రూ.750 కోట్లతో కొప్పర్తి వద్ద వైఎస్ఆర్ ఈఎంసీని ఏర్పాటు చేసింది. ఇప్పటికే వైఎస్ఆర్ ఈఎంసీలో డిక్సన్ యూనిట్లను ఏర్పాటు చేసింది. సెంచురీ ప్లై యూనిట్‌కు నీటి సరఫరా కోసం గోపవరం వద్ద రూ.45 కోట్లతో నీటి తరలింపు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది. పీఎం గతిశక్తి కింద రూ.31 కోట్లతో కృష్ణపట్నం నుంచి కొప్పర్తికి రైల్వేలైన్ నిర్మాణం చేపట్టింది.

'జయహో బీసీ'కి జయహో!

సందర్భం



దవులూరి దొరబాబు

విజయవాడలో నేడు జరుగుతున్న 'జయహో బీసీ' మహాసభతో వైఎస్సార్‌సీపీ నాయకత్వంలో సాధించిన సాధికారతకు మరింత భరోసా కలగనుంది. స్వాతంత్ర్యానికి ముందు నుంచీ మెజారిటీగా ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉంది. అయితే ఈ అన్యాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరమగీతం పాడారు. 2019 ఎన్నికలకు ముందు ఏలూరులో వైసీపీ బీసీ గర్జన నిర్వహించి నప్పుడు అధికారంలోకి వస్తే బీసీలకు చేసే మేలును తెలుపుతూ 'బీసీ డిక్లరేషన్' విడుదల చేశారు. ఆ రోజు చేసిన వాగ్దానాలను అధికారం లోకి వచ్చిన తరువాత నెరవేర్చారు.

సంక్షేమ పథకాల ద్వారా పేదల ఖాతాల్లో ఎటువంటి దళారులు లేకుండా నేరుగా రూ. 1.77 లక్షల కోట్ల నగదు జమ చేస్తే... ఇందులో బీసీలకు లభించింది రూ. రూ. 85.915 వేల కోట్లు. భారత దేశ చరిత్రలోనే బీసీలకు ఇంత మొత్తం కేటాయించి వారి బతుకుల్లో వెలుగు నింపిన ఘనత సీఎం జగన్‌దే. 25 మంది సభ్యులు ఉన్న మంత్రివర్గంలో 10 మంది బీసీలకు మంత్రి పదవులు వచ్చాయి. పరిషత్ ఎన్నికల్లో వైసీపీ 13 జిల్లా పరిషత్‌లను గెలుచుకుంటే ఇందులో 9 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులను అంటే 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే కేటాయించారు. మండల పరిషత్ ఎన్నికల్లో 648 మండ లాలకు 635 మండల అధ్యక్ష పదవులను వైసీపీ గెలుచుకుంటే ఇందులో 67% బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఇచ్చారు. 13 కార్పొరేషన్లలో వైసీపీ క్లీన్ స్వీప్ చేస్తే 7 చోట్ల మేయర్ పదవులు బీసీలకు ఇచ్చారు. ఈ రకంగా పరిపాలనలో సింహ భాగం బీసీలకు భాగస్వామ్యం ఇచ్చిన ప్రజా నాయకుడు దేశంలోనే లేడు. ఇవన్నీ గ్రామాల్లో మారుమూల ఉన్న బీసీలకు కూడా తెలిసిన విషయాలే. అయితే బీసీల హక్కుల కోసం, వారు ఎవరి దయా దాక్షిణ్యాలపైనా ఆధారపడకుండా వైసీపీ చేస్తున్న కృషి ఇంకా ఉంది.

2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో శాశ్వత ప్రాతి పదికన బీసీ కమిషన్ ఏర్పాటుకు చట్టం చేసి బిల్లును ఆమోదించారు. అంతకుముందు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ప్రవేశపెట్టిన ఓబీసీ ప్రైవేటు బిల్లుకు పది రాజకీయ పార్టీలు మద్దతిచ్చినా పార్ల మెంట్ యథాప్రకారం మూజువాణి ఓటుతో తిరస్కరించింది. పార్ల మెంట్‌లో బీసీల ప్రాతినిధ్యం ఎన్నడూ కూడా ఇరవై శాతానికి మించ లేదు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ఎన్నో ఏళ్ల నుంచి బీసీలు కోరుతున్నారు. బీసీ కులాల వారు జనాభాలో 52 శాతం ఉన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉపాధి రంగాలలో బీసీలకు అగ్రకులాల వారితో పోటీపడే సత్తా లేదు. అందుకే 8 రాజ్యసభ స్థానాల్లో నాలుగు బీసీలకు జగన్ కేటాయించారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వే షన్‌ల వల్ల విద్య, ఉపాధి రంగాల్లో, చట్టసభల్లో ప్రవేశం పొందిన పద్ధతి లోనే బీసీలు కూడా రిజర్వేషన్‌లు కోరుకుంటున్నారు. ఓబీసీ బిల్లు పార్ల మెంట్‌లో ఇంకా ఆమోదం పొందలేదు. వైసీపీ పార్ల మెంటులో ప్రవేశ పెట్టిన మొదటి బిల్లు వీగిపోయింది. దానిని కూడా గెలిపించుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదించిన కీలకమైన అయిదు బిల్లుల్లో నాలుగు బీసీలకు సంబంధించినవే. అవి... రాష్ట్రంలో శాశ్వత ప్రాతిపది కన బీసీ కమిషన్ ఏర్పాటు; బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పన నామినేషన్‌పై ఇచ్చే పనుల్లో 50 శాతం రిజ ర్వేషన్ ఇవ్వడం; నామినేటెడ్ పోస్టుల్లో, నామినేషన్‌లపై ఇచ్చే పనుల్లో మహిళలకు 50 శాతం కోటా కేటాయించడం. ఈ బిల్లుల వల్ల బీసీలకు లబ్ధి చేకూరుతుంది.

2014లో బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 2014-19 మధ్య ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదు. చంద్రబాబు బీసీల వెన్నెముక విరగ గొట్టడం వల్లనే బీసీలు అత్యధికంగా ఉన్న కుప్పంలో ఆయనను తరిమికొట్టేందుకు ప్రజలు సన్నద్ధం అయ్యారు. బీసీలు అందరికీ నిజమైన సంక్షేమం అందించిన జగన్ చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవులు ఇవ్వడంతో వైసీపీకి బీసీలు వెన్నెముకగా మారారు. జగన్ అన్న చూపిన వెలుగుబాటలో పయనిస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయ కులు, ప్రతినిధులు 84 వేలమందితో పాటు... వేలాదిమంది ప్రజలు హాజరు అయ్యే 'జయహో బీసీ' సంరంభం వెనుకబడిన వర్గాల కర్త వ్యాన్ని నిర్దేశించే విధంగా ఉంటుందని చెప్పవచ్చు.

వ్యాసకర్త చైర్మన్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్
(నేడు విజయవాడలో 'జయహో బీసీ' సందర్భంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.7.10 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** కృత్తిక ఉ.10.20 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** రా.3.20 నుండి 5.04 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.28 నుండి 12.14 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.46 నుండి 9.29 వరకు : **రాహుకాలం** : ప.12.00 నుండి 1.30 వరకు : **యమగండం** : ఉ.7.30 నుండి 9.00 వరకు : **సూర్యోదయం** 6.21 : **సూర్యాస్తమయం** 5.21.



నంద్యాల జిల్లా నాగలూటి చెంచుగూడెంలో పథకాలను వివరిస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



కాకినాడ జిల్లా ఎస్ అన్నవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాడిశెట్టి రాజా

మన ప్రభుత్వం



నెల్లూరు నగరంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



పశ్చిమగోదావరి జిల్లా పాతపాడులో పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ప్రసాదరాజు

మహిళను చంపి డ్రమ్ములో కుక్కేశాడు

- ఏడాదిన్నరగా ప్లాస్టిక్ డ్రమ్ములోనే మృతదేహం
- విస్తుపోయే విషయాలు వెలుగులోకి..
- నిందితుణ్ణి అరెస్ట్ చేసిన పోలీసులు

అల్లిపురం (విశాఖ దక్షిణ): విశాఖపట్నం మధురవాడలోని వికలాంగుల కాలనీలో ప్లాస్టిక్ డ్రమ్ములో పుర్రె, అస్తిపంజరం బయటపడిన కేసులో చిక్కుముడి వీడింది. పోలీసుల విచారణలో మృతురాలు శ్రీకాకుళం జిల్లా మోదంటి వీధికి చెందిన బమ్మిడి ధనలక్ష్మి(24)గా గుర్తించారు. నిందితుడు శ్రీకాకుళం జిల్లా మందస గ్రామానికి చెందిన దండు రిషివర్ధన్ అలియాస్ కొప్పిశెట్టి రిషివర్ధన్ అలియాస్ రిషిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మాదిలో వెల్డింగ్ దుకాణం నడుపుతున్న నండూరి రమేష్‌కు వికలాంగుల కాలనీలో ఓ ఇల్లు ఉంది. ఆ ఇంటిని తన వద్ద పనిచేస్తున్న రిషికి 2020 సెప్టెంబర్‌లో అద్దెకు ఇవ్వగా.. అతడు కొంతకాలంగా అద్దె చెల్లించడం లేదు. ఆ ఇంటికి సంబంధించిన కరెంటు బిల్లును మే 2021 నుంచి చెల్లించకపోవడం, బిల్లు ఎక్కువగా వస్తుండటంతో రమేష్ ఆ ఇంటిని చూసేందుకు ఈ నెల 4వ తేదీన వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండగా.. ఇంట్లో లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఫ్యాన్లు తిరుగుతున్నాయి. ఇంటి వెనుక తలుపు తీసి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా.. ఓ పక్కన ప్లాస్టిక్ డ్రమ్ము పీవీసీ టేప్‌తో సీల్ చేసి ఉండటం, దుర్వాసన రావటంతో పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి డ్రమ్ము తెరిచిచూడగా.. పుర్రె, అస్థి పంజరం, జుట్టు కనిపించాయి.



వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ (ఇన్ సెట్) నిందితుడు రిషి

చున్నీ బిగించి.. డ్రమ్ములో దాచేశాడు

నిందితుడు రిషివర్ధన్ తన భార్యతో కలిసి రమేష్ ఇంట్లో అద్దెకు ఉండేవాడు. భార్య గర్భవతి కావటంతో 2021 జనవరిలో తన అత్తగారి ఊరైన శ్రీకాకుళం బల్లిగూడకు కాన్పు నిమిత్తం పంపించాడు. ఆ తరువాత తరచూ భార్యను చూసేందుకు వెళ్లి వస్తుండేవాడు. ఈ క్రమంలో 2021 మే 29న శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు కోసం వేచి ఉండగా.. బమ్మిడి ధనలక్ష్మి (24) అనే మహిళ పరిచయమైంది. ఇద్దరూ ఫోన్ నంబర్లు ఇచ్చి పుచ్చుకున్నారు. అక్కడి నుంచి ఇద్దరు కలసి ఆటోలో నాతవరం వరకు ప్రయాణించారు. అదే నెల 30న రిషికి ధనలక్ష్మి పలుమార్లు ఫోన్ చేసింది. తన భార్య ఇంటివద్ద లేదని రిషి చెప్పటంతో ధనలక్ష్మి ఆ రోజు రాత్రి అతడి ఇంటికెళ్లింది. వేకువజామున 4.30 గంటల సమయంలో ధనలక్ష్మి రూ.2 వేలు కావాలని డిమాండ్ చేసింది. తన వద్ద 100 రూపాయలే ఉన్నాయని రిషి చెప్పగా.. అతడి భార్య దుస్తులు, టీవీ ఇమ్మని అడిగింది. అందుకు తిరస్కరించగా.. తాను అడిగినవి ఇవ్వకపోతే బయటకు వెళ్లి గొడవ చేస్తానని హెచ్చరించడంతో రిషి కోపంతో ఆమె మెడకు చున్నీ బిగించటంతో ప్రాణం విడిచింది. మృతదేహాన్ని బ్లాంకెట్ ప్లాస్టిక్ జిప్ కవర్‌లో ప్యాక్ చేసి.. ఇంట్లోని ప్లాస్టిక్ డ్రమ్‌లో దించి మూతను సెల్లో టేప్‌తో మూసివేశాడు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయి తన సెల్‌ఫోన్‌ను 13 రోజులు స్విచ్ఛాఫ్ చేసి ఉంచాడు. ఆ తరువాత ఇంటిని ఖాళీ చేసిన రిషి వెల్డింగ్ షాపులో పని కూడా మానేసి తన అత్తగారింటికి వెళ్లిపోయాడు.

ఇలా దొరికాడు

ఘటనా స్థలంలో మృతురాలు ధనలక్ష్మికి చెందిన బ్యాగ్ లభించగా.. అందులో రిషి ఫోన్ నంబర్ రాసి ఉన్న ఓ స్లిప్ దొరికింది. కాల్ లిస్ట్ ఆధారంగా ఘటన జరగడానికి ముందు మృతురాలి నంబర్ నుంచి అతడి నంబర్‌కు ఫోన్లు రావడాన్ని గుర్తించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టి మృతురాలి వివరాలతోపాటు నిందితుడిని గుర్తించారు. ధనలక్ష్మికి తల్లిదండ్రులు, తోడబుట్టిన వారు ఎవరూ లేకపోవటంతో ఆమె కనిపించడం లేదని ఎక్కడా మిస్సింగ్ కేసు కూడా నమోదు కాలేదు. నిందితుడి ఫోన్ నంబర్‌ను ట్రేస్ చేయగా.. అతడు 6 నెలలుగా కొమ్మాదిలోని ఒక హాస్టల్‌లో అసిస్టెంట్ కుక్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే కేసు ఛేదించినట్లు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.

బాణాసంచా పేలుడు ఘటనలో ఒకరి మృతి

- టీడీపీ నేత కుమారుని వివాహ వేడుకలో ఘటన



పిచ్చిలి వెంకటరెడ్డి (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఓ వివాహ వేడుక సందర్భంగా ఆదివారం రాత్రి బాణాసంచా పేల్చిన ఘటనలో ఎనిమిది మంది గాయపడగా.. కర్ణాటక నాగేపల్లికి చెందిన పిచ్చిలి వెంకటరెడ్డి (54) చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. తక్కిన వారిలో మరో ముగ్గురు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. వీరిలో లెక్కల గౌతమ్‌కుమార్ అనే బాలుడి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. పుట్టపర్తికి చెందిన టీడీపీ నాయకుడు, గాయత్రి మిల్క్ డెయిరీ యజమాని నారాయణస్వామి చిన్నకుమారుడు సాయిమనోజ్ కుమార్ నాయుడు, భవానీ వివాహం ఆదివారం స్థానిక సాయిఆరామంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వరుని ఇంటి సమీపంలో పేల్చిన బాణాసంచా నిప్పు రవ్వలు వారి సొంత మిల్క్ డెయిరీలో ఉంచిన టపాసులపై పడి అవి కూడా భారీఎత్తున పేలాయి. ఘటనలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. వీరిలో పిచ్చిలి వెంకటరెడ్డి రెండు రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం తుది శ్వాస విడిచాడు. వైఎస్సార్‌సీపీ నాయకుడైన పిచ్చిలి వెంకటరెడ్డి బోర్‌వెల్ నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య కళావతి, కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. కాగా, జనావాసాల మధ్య భారీఎత్తున బాణాసంచా పేల్చుతున్నా అధికారులు ఏమాత్రమూ పట్టించుకోకపోవడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు.

అరుణాచలేశ్వరాలయంపై కార్తీక మహా దీపం

- 45 లక్షల మందికిపైగా తరలివచ్చిన భక్తులు



కార్తీక మహాదీపాన్ని వెలిగిస్తున్న శివాచార్యులు

తిరువణ్ణామలై (వేలూరు), (తమిళనాడు): తమిళనాడులో అత్యంత పవిత్రమైన, ప్రసిద్ధి చెందిన అగ్ని స్థలంగా గుర్తింపు పొందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. 10వ రోజైన మంగళవారం సాయంత్రం కార్తీక మహా దీపోత్సవం జరిగింది. అరుణాచలేశ్వరాలయం వెనుక వైపునున్న 2,668 అడుగుల ఎత్తుగల కొండపై సాయంత్రం 6 గంటలకు శివాచార్యుల వేద మంత్రాల నడుమ హరోం...హరా... నామ స్మరణ మధ్య దీపాన్ని వెలిగించారు. ఉదయం 4 గంటలకే ఆలయంలోని పంచముఖ స్థలంలో భరణి దీపాన్ని వెలిగించారు. సాయంత్రం 3,500 కిలోల నెయ్యి, వెయ్యి మీటర్ల గాడా గుడ్డను ఉపయోగించారు. రాగి రాక్షస కొప్పరిలో వీటిని ఉంచి హరోం...హరా... నామస్మరణాల మధ్య మహా దీపాన్ని వెలిగించారు. ఈ మహా దీపాన్ని తిలకించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 45 లక్షల మంది భక్తులు తిరువణ్ణామలైకు చేరుకున్నారు. అయితే శివుడి అగ్నితత్వంగా భావించే ఈ మహా కొండపైకి ముందస్తుగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న 2,500 మంది భక్తులను మాత్రమే అనుమతించారు.

జనావాసాల్లోకి ఏనుగుల గుంపు

గంగవరం: అటవీ ప్రాంతం నుంచి పదుల సంఖ్యలో ఏనుగుల గుంపు జనావాసాల్లోకి చొరబడటం కలకలం రేపుతోంది. మంగళవారం ఉదయం పలమనేరు రూరల్ మండలంలోని మొసలిమడుగు గ్రామ సమీపం గుడియాత్తం రోడ్డు పక్కనున్న అడవిలో ఏనుగులు గుంపు ప్రజలను భయాందోళనకు గురిచేసింది. అటవీ సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్‌ను దాటలేక అక్కడక్కడే తిరుగుతున్నాయి. ఏనుగుల గుంపు బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల అటవీ ప్రాంతం నుంచి పందేరుపల్లి, వడ్దూరు, కరిడిమడుగు, నూనెవారిపల్లి పరిసర ప్రాంతాల్లో పంట పొలాలు, మామిడి చెట్లను నాశనం చేసుకుంటూ వేకువజామున మొసలిమడుగు ఏటిగడ్డ గ్రామానికి చేరుకున్నట్టు ఆ ప్రాంతాల వాసులు చెబుతున్నారు. ఏనుగులు ధాటికి గంటల తరబడి వాహనాల రాకపోకలు స్తంభించాయి.

తోమాల దర్శన టికెట్లు ఫోర్జరీ

- బ్రేక్ దర్శన టికెట్లు అధిక ధరలకు విక్రయం
- ముగ్గురు దళారీలపై పోలీసుల కేసు నమోదు

తిరుమల: శ్రీవారి తోమాల దర్శన టికెట్లను ఫోర్జరీ చేసి భక్తులను మోసగించి భారీగా నగదు వసూలు చేసిన ఒక దళారీపై, బ్రేక్ దర్శనాలను అధిక ధరలకు విక్రయించిన మరో ఇద్దరు దళారీలపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుమల టూటౌన్ ఎస్ఐలు రమేష్, మంజుల తెలిపిన వివరాల మేరకు..తమిళనాడులోని తిరుప్పూర్‌కు చెందిన రాజేష్ కుమార్, పొన్నుస్వామి శ్రీవారి తోమాల సేవా టికెట్లు ఇప్పించాలని ఏపీ లోని భీమవరం, పాలకొల్లుకు చెందిన పంజ రమణప్రసాద్‌ను కోరారు. దీంతో దళారీ 21 మందికి 4 తోమాల సేవాటికెట్లు, గదుల కోసం భక్తుడి నుంచి రూ.62,500 తన ఫోన్‌లో ఈ నెల 2న వేయించుకున్నాడు. అనంతరం పాత తోమాల సేవా టికెట్ల నమూనాను ఫోర్జరీ చేసి నకిలీ తోమాల సేవా టికెట్లను తయారు చేసి భక్తుడి సెల్‌ఫోన్‌కు పంపాడు. ఈ నెల 5న తిరుమలకు చేరుకున్న ఆ భక్తుడు ఏటీసీ కూడలి నుంచి దర్శనానికి వెళ్లాడు. ఆ సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కౌంటర్ సిబ్బంది టికెట్లను స్కానింగ్ చేయగా నకిలీవిగా గుర్తించారు. విజిలెన్స్ సహకారంతో తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు రమణప్రసాద్ శ్రీవారి దర్శన టికెట్లను విక్రయిస్తూ అనేక పర్యాయాలు జైలుకు సైతం వెళ్లాడు. మరో కేసులో తెలంగాణలోని మల్కాజిగిరికి చెందిన చెక్కల రామనాథ్ శ్రీవారి బ్రేక్ దర్శనం ఇప్పించాలని హైదరాబాద్‌కు చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి సాయిని కోరాడు. అతను తన స్నేహితుడి ద్వారా గుంటూరు ఎమ్మెల్సీ జంగాకృష్ణమూర్తి సిఫారసు లేఖను తిరుపతిలో ఇప్పించారు. సదరు టికెట్లను జేఈవో కార్యాలయంలో అప్పగించాలని సాయంత్రం మొబైల్‌కు ఎస్ఎంఎస్ వచ్చిన తరువాత బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేయాలని సూచించారు. అంతకుముందే ఈ నెల 1న 12 బ్రేక్ దర్శన టికెట్లకుగాను రూ.18,000 ను తన అకౌంట్‌లో సాయి వేయించుకున్నాడు. ఆ టికెట్లతో దర్శనానికి వెళ్లిన భక్తుడు తనకు టికెట్లను అధిక ధరలకు విక్రయించినట్లు విజిలెన్స్ అధికారులకు తెలిపాడు. ఈ మేరకు అధికారులు భక్తుడి ద్వారా తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. సాయితోపాటు మరో దళారీని గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు.

చేనేతరంగ సమస్యలను పరిష్కరించాలి

- చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకులవాసు



మాట్లాడుతున్న ఆకుల వాసు

మదనపల్లె : రాష్ట్రంలో చేనేతరంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, చేనేతల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకులవాసు కోరారు. ఏపీ చేనేత కార్మిక యూనియన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జింకా వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్రరెడ్డి అధ్యక్షతన మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం, ఆత్మీయకలయిక జరిగింది. ఈ సందర్భంగా ఆకులవాసు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్‌హెచ్‌డీసీ సిల్క్ సబ్సిడీ పథకం అమలులో చేనేత, జౌళిశాఖ అధికారులు నిర్లక్ష్యం కనబరుస్తున్నారన్నారు. ముడిసరుకు ధరలు విపరీతంగా పెరగడంతో ఉత్పత్తుల ధర గణనీయంగా పెరిగిందని తెలిపారు. సిల్క్ ఉత్పత్తులకు ఆశించినస్థాయిలో మార్కెట్ లేదన్నారు. అన్నమయ్య జిల్లాలో చేనేత, జౌళిశాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. నేతన్ననేస్తం నిజమైన కార్మికులకు వర్తించేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ చేనేత కార్మిక యూనియన్ గౌరవాధ్యక్షుడు కుప్పయ్యశెట్టి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముష్టూరు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ ఉద్యోగిపై టీడీపీ మద్దతుదారుల దాడి

- రిజర్వ్ ఫారెస్ట్‌లో తెలుగు తమ్ముళ్ల ఇసుక అక్రమ తవ్వకాలు
- ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న అటవీ ఉద్యోగిపై దాడి
- పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న ట్రాక్టర్ తీసుకువెళ్లిన దుండగులు
- మదనపల్లె మండలంలో ఘటన



సీఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేస్తున్న బీట్ ఆఫీసర్ సుబ్బలక్ష్మి, (ఇన్ సెట్) గాయపడిన రాజారెడ్డి

మదనపల్లె : రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా ఇసుకను తవ్వి తరలిస్తుండగా, ట్రాక్టర్‌ను పట్టుకున్న అటవీ శాఖ ఉద్యోగిపై టీడీపీ మద్దతుదారులు దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మదనపల్లె రేంజ్ వాల్మీకిపురం సెక్షన్, తరిగొండ బీట్‌లోని అటవీ ప్రాంతంలో సీటీఎం పంచాయతి చిన్నాయనచెరువుకు చెందిన కొందరు వ్యక్తులు కొంతకాలంగా అక్రమంగా ఇసుక తవ్వుతున్నట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుబ్బలక్ష్మి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ రాజారెడ్డికి సమాచారం అందింది. ఆ మార్గంలో సోమవారం రాత్రి నుంచి వారు నిఘా పెట్టగా, మంగళవారం వేకువజామున మూడు గంటల సమయంలో ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్ వచ్చింది. అటవీప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలించడం నేరమని ట్రాక్టర్‌ను నిలిపివేశారు. ట్రాక్టర్‌ను పట్టుకున్న సమాచారాన్ని సుబ్బలక్ష్మి తమ ఉన్నతాధికారులకు తెలియజేసి, రాజారెడ్డిని ట్రాక్టర్‌ను తీసుకుని మదనపల్లె రూరల్ పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించి, ఆమె తన తన ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్లారు. రాజారెడ్డి ట్రాక్టర్‌ను తీసుకుని మదనపల్లె వైపు వస్తుండగా, మార్గమధ్యంలో సీటీఎం చెరువు వద్ద చిన్నాయనచెరువుకు చెందిన టీడీపీ మద్దతుదారులు శివకుమార్, అతని తండ్రి మెంబర్ అప్పల్ల, జి.రెడ్డిప్రసాద్ వచ్చి అడ్డుకున్నారు. స్టేషన్‌కు తరలించకుండా ట్రాక్టర్‌ను తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో ట్రాక్టర్‌లో ఉన్న రాజారెడ్డి నిలువరించేందుకు ప్రయత్నించగా, ఆయనపై ముగ్గురూ దాడిచేశారు. ఆయన చేతిలోని టార్చ్ లైట్, సెల్‌ఫోన్ లాక్కుని ట్రాక్టర్‌ను తీసుకుని వెళ్లిపోయారు. గాయపడిన రాజారెడ్డి వేకువజామున తిరుపతి ప్రధాన రహదారిపై నానా ఇబ్బందులు పడి ఫారెస్ట్ కార్యాలయానికి చేరుకుని తనపై దాడి గురించి వివరించారు. అనంతరం సుబ్బలక్ష్మితో కలిసి రాజారెడ్డి మదనపల్లె రూరల్ స్టేషన్‌కు వెళ్లి శివకుమార్, మెంబర్ అప్పల్ల, జి.రెడ్డిప్రసాద్‌పై ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దిరెడ్డి ఎదుగుదలను ఓర్వలేక దుష్ప్రచారం

పచ్చరాతలను ఖండించిన అన్నమయ్య జిల్లా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్

రాయచోటి: రాజకీయాల్లో అజాతశత్రువుగా పేరొందిన రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేకనే టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నమయ్య జిల్లా పరిధిలోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్ విమర్శించారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, పీలేరు, రాజంపేట, మదనపల్లి, తంబళ్లపల్లి ఎమ్మెల్యేలు సి.రామచంద్రారెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, నవాజ్‌బాషా, ద్వారకానాథరెడ్డి, ఉమ్మడి కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు కంటే మంత్రి పెద్దిరెడ్డికి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అన్ని స్థాయిల్లో ప్రజాభిమానం మెండుగా ఉందన్న అసూయాద్వేషాలు, అక్కసుతో ప్రణాళిక ప్రకారం ఆయనపై కొన్ని పచ్చపత్రికలు రాస్తున్న ఇలాంటి రాతలను జిల్లాలోనే కాదు.. రాష్ట్రంలోను ఎవరూ నమ్మరని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి తోడుగా ఉన్నారన్న ఆక్రోశంతోనే ఈ విషపురాతలు రాస్తున్నారని తెలిపారు. హెరిటేజ్ వ్యాపారం తగ్గిందన్న బాధతోనే శివశక్తి పాల డెయిరీపై కూడా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రామచంద్రయాదవ్‌పై జరిగిన దాడిని మొదటగా ఖండించింది పెద్దిరెడ్డి కుటుంబమేనని గుర్తుచేశారు. పెద్దిరెడ్డి కుటుంబం కక్షపూరిత రాజకీయాలు చేయదనేది అందరికీ తెలుసని పేర్కొన్నారు. మరోసారి ఇలాంటి రాతలు రాస్తే పరువునష్టం దావా వేయడంతోపాటు గట్టిగా బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు.

పోరాడి హక్కులు సాధిస్తాం

- 800వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాడికొండ: భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా పోరాడి.. వికేంద్రీకరణ, బహుజన హక్కులు సాధించి తీరతామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 800వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుడుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని మాట్లాడిన చంద్రబాబు అంబేద్కర్‌కు దండలు వేయడానికి అనర్హుడన్నారు. ఓ వైపు దళితులను హేళనగా మాట్లాడుతూ మరో వైపు ఓట్ల కోసం కపట ప్రేమను ప్రదర్శిస్తూ అంబేద్కర్‌కు దండలు వేసి ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్న బాబును ఎప్పటికీ బహుజనులు నమ్మరనే సత్యాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. బాబును అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, పల్లె బాబు, కారుమూరి పుష్పరాజ్, ఇందుపల్లి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

శ్రీవారి దర్శనానికి 20 గంటలు



ఆలయం వెలుపల భక్తుల రద్దీ

తిరుమల: తిరుమలలో 20 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండాయి. సర్వ దర్శన టోకెన్లు లేని వారికి 20 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటలు పడుతోంది. సోమవారం అర్ధరాత్రి వరకు 66,020 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.37 కోట్లు సమర్పించారు.

పౌల్ట్రీ రంగాన్ని ఆదుకోవాలి

- ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్



మధుసూదనరెడ్డిని కలిసిన పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర నేతలు

మండపేట: పౌల్ట్రీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ కర్రి వెంకట ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి తెలిపారు. వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ సెక్రటరీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మధుసూదనరెడ్డిని మంగళవారం అమరావతిలో కలిసి కోళ్ల పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కోనసీమ జిల్లా అర్తమూరులో మీడియాతో మాట్లాడుతూ.. పౌల్ట్రీ పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్రంలో లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని, కొన్నేళ్లుగా పరిశ్రమ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, మేత ధరలు పెరిగిపోవడంతో పౌల్ట్రీల నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్సిడీపై కోళ్ల మేతలు అందజేయాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరి విద్యుత్ సబ్సిడీ, ఇతర ప్రయోజనాలు కల్పించి కోళ్ల రైతులను ఆదుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ముకుందరెడ్డి, సుబ్బారెడ్డి తెలిపారు. ఫెడరేషన్ ట్రెజరర్ డాక్టర్ కె.సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108లో ఒకే కాన్పులో ముగ్గురు జననం



హుకుంపేట: అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ పెదగరువుకి చెందిన గర్భిణికిల్లో విజయకుమారి 108లో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. మంగళవారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు ఆమెను 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ముగ్గురు ఆడ శిశువులను ఆమె ప్రసవించింది. 108 సిబ్బంది ఆమెకు ప్రథమ చికిత్స అందించి పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ చంద్రశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో 15 మంది విద్యార్థులకు గాయాలు



స్కూలు బస్సులో రోదిస్తున్న విద్యార్థులు

పెద్దపంజాణి: లారీ, స్కూలు బస్సు ఢీకొన్న ఘటనలో 15 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఈ ఘటన చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలంలోని పుంగనూరు–పలమనేరు రహదారిలోని బెరపల్లి సమీపంలో మంగళవారం జరిగింది. మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పలమనేరులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. 20 మంది విద్యార్థులు ఆ పాఠశాలకు చెందిన బస్సులోనే రాకపోకలు సాగిస్తున్నారు. మంగళవారం 15 మంది విద్యార్థులతో బయలుదేరిన బస్సు బెరపల్లి సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఘటనలో పెద్దపంజాణికి చెందిన తేజశ్రీ, హేమంత్, వరుణ్‌తేజ్, దర్శన్, వర్షతో పాటు మరో 10 మంది స్వల్పంగా గాయపడ్డారు. వీరంతా 5వ తరగతి లోపు విద్యార్థులే. వీరందరినీ 108లో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఇళ్లకు పంపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వర్ణ తేజ తెలిపారు.

క్లుప్తంగా...

5 కోట్లకు పెండింగ్ కేసులు!

న్యూఢిల్లీ: దేశంలో పెండింగ్ కేసుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో మరో రెండు నెలల్లో పెండింగ్ కేసుల సంఖ్య 5 కోట్ల మార్కును దాటనుందని చెప్పారు. సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో ఇలాంటి కేసులు కొంత తగ్గుముఖం పడుతున్నప్పటికీ కింది కోర్టుల్లో మాత్రం పరిస్థితి సవాలుగానే మారిందని పేర్కొన్నారు. ఢిల్లీ హైకోర్టులో మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో కిరణ్ రిజిజు మాట్లాడారు. కింది కోర్టులను మౌలిక వసతుల కొరత వేధిస్తోందని, అందుకే పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయని అభిప్రాయపడ్డారు. పరిష్కారం కాని కేసులు కొన్ని నెలల క్రితం వరకు 4.83 కోట్లు ఉండేవన్నారు. ఇలాంటి కేసులపై ఎవరైనా తనను ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం చాలా కష్టమని వ్యాఖ్యానించారు.

రష్యా వైమానిక స్థావరంపై డ్రోన్ దాడి

కీవ్: ఉక్రెయిన్‌పై తరచూ డ్రోన్లతో దాడికి దిగే రష్యాకు డ్రోన్‌రూపంలో ఎదురుదాడి ఎదురైంది. ఉక్రెయిన్–రష్యా సరిహద్దు నుంచి 500 కిలోమీటర్ల దూరంలోని కుర్స్క్ వైమానిక స్థావరంపై అనుమానాస్పద డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడి ఉక్రెయిన్ పనేనని రష్యా ఆరోపించింది. స్థావరంలోని చమురు నిల్వ కేంద్రంపై దాడి జరగడంతో చెలరేగిన మంటలను అక్కడి అగ్నిమాపక సిబ్బంది ఆర్పేశారు. సరిహద్దుకు 300 మైళ్ల దూరంలోని రష్యా ప్రాంతాలపైనా దాడులు జరగడంతో తొమ్మిది నెలలుగా కొనసాగుతున్న ఉక్రెయిన్–రష్యా యుద్ధం మరింతగా ముదరనుందనే వార్తలొచ్చాయి. కుర్స్క్ వైమానిక స్థావరంలో నిలిపిన యుద్ధవిమానాలు కొన్నింటికి అణ్వస్త్రాలను సైతం మోసుకెళ్లే సామర్థ్యముంది. రష్యా అత్యంత వ్యూహాత్మక వైమానిక స్థావరమైన కుర్స్క్ ఎయిర్‌ఫీల్డ్‌పై దాడి నేపథ్యంలో రష్యా గగనతల రక్షణ వ్యవస్థ సమర్థతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

గుజరాత్ ఎన్నికల్లో తగ్గిన ఓటింగ్

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 64.33 శాతం ఓటింగ్ నమోదయ్యింది. 2017 నాటి ఎన్నికలతో పోలిస్తే 4.08 శాతం తగ్గింది. రాష్ట్రంలో 2017 ఎన్నికల్లో 68.41 శాతం ఓటింగ్ రికార్డయ్యింది. గుజరాత్‌లో మొత్తం 182 అసెంబ్లీ స్థానాలుండగా, ఈ నెల 1న 89 స్థానాలకు జరిగిన తొలి దశ ఎన్నికల్లో 63.31 శాతం, 4న 93 స్థానాలకు జరిగిన రెండో దశ ఎన్నికల్లో 65.30 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. రాష్ట్రంలో 4.91 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఈ ఎన్నికల్లో 3.16 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని పేర్కొంది. ఈ ఎన్నికల్లో అత్యధికంగా నర్మదా జిల్లాలో 78.42 శాతం, అతి తక్కువగా బోటాడ్ జిల్లాలో 57.59 శాతం ఓటింగ్ నమోదయ్యింది. తాపీ జిల్లాలో 77.04 శాతం, బనస్‌కాంతా జిల్లాలో 72.49 శాతం, సబర్‌కాంతా జిల్లాలో 71.43 శాతం, నవసారి జిల్లాలో 71.06 శాతం, మోర్బీ జిల్లాలో 69.95 శాతం ఓటింగ్ నమోదైనట్లు తేలింది. ఈ నెల 8న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

ఉగ్రవాదులకు ఆర్థిక మద్దతు అందరాదు

న్యూఢిల్లీ: సీమాంతర ఉగ్రవాదం, ఉగ్రవాదం వ్యాప్తి, ఉగ్ర ముఠాలకు ఆర్థిక మద్దతు వంటి వాటిని కలిసికట్టుగా ఎదుర్కోవాలని భారత్, మధ్య ఆసియా దేశాల జాతీయ భద్రతా సలహాదారు(ఎన్‌ఎస్‌ఏ)లు పిలుపునిచ్చారు. అఫ్గానిస్తాన్ ఉగ్రవాద కార్యకలాపాలకు వేదికగా మారనీయరాదని స్పష్టం చేశారు. జాతీయ భద్రతా సలహాదారు(ఎన్‌ఎస్‌ఏ) అజిత్ దోవల్ అధ్యక్షతన మంగళవారం మధ్య ఆసియా దేశాల ఎన్‌ఎస్‌ఏల భేటీ జరిగింది. ఇందులో కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్, తజికిస్తాన్‌ల ఎన్‌ఎస్‌ఏలతోపాటు తుర్క్‌మెనిస్తాన్ తరఫున ఢిల్లీలోని ఆ దేశ రాయబారి పాల్గొన్నారు. ఉగ్ర బెడద తొలగాలంటే, ముందుగా ఉగ్ర మూకలకు జీవనాధారమైన ఆర్థిక మూలాలను దెబ్బ తీయడంపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా దోవల్ అన్నారు. మధ్య ఆసియా దేశాల మధ్య కనెక్టివిటీ పెంచాల్సిన బాధ్యత భారత్‌కు ఉందని చెప్పారు. ఈ విషయంలో సహకారానికి, పెట్టుబడులకు, అనుసంధానత ఏర్పాటుకు సిద్ధంగా ఉందని అన్నారు.

విదేశీయుడని ఎన్నాళ్లు కస్టడీలో ఉంచుతారు ?

న్యూఢిల్లీ: అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో మధ్యవర్తిగా వ్యవహరించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రిస్టియన్ మైఖేల్ జేమ్స్‌ను విదేశీయుడన్న కారణంతో ఎన్ని రోజులు పోలీసు కస్టడీలో ఉంచుతారని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అతను భారతీయుడు కాకపోవడంతో నాలుగేళ్లకు పైగా కస్టడీలో ఉంచడం సమర్థనీయమా అని ప్రశ్నించింది. ఇది అతని స్వేచ్ఛను పూర్తిగా అణిచివేయడమేనని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పిఎస్.నరసింహలతో కూడిన బెంచ్ అభిప్రాయపడింది. బ్రిటన్ జాతీయుడైన మైఖేల్‌ను దుబాయ్ 2018లో భారత్‌కు అప్పగించింది. అప్పట్నుంచి అతను పోలీసు కస్టడీలోనే ఉన్నాడు. తనకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుని మైఖేల్ సుప్రీంలో సవాల్ చేశాడు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీం .. విదేశీయుడైనందుకు అతను అలాగే కస్టడీలో మగ్గిపోవాలా ? అని వ్యాఖ్యానించింది. మైఖేల్ జేమ్స్ అప్పగింత సమయంలో జరిగిన ఒప్పందం వివరాలన్నింటినీ కోర్టుకు సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను 2023 జనవరి రెండో వారానికి వాయిదా వేసింది.

ఆహార సంక్షోభం దిశగా బ్రిటన్

'గుడ్లు' తేలేస్తున్న జనం

- ధరాభారంతో కుదేలైన రైతన్నలు
- నిత్యావసరాల కొనుగోలుకు పరిమితులు రాబోతున్నాయా ?



గుడ్లు, మాంసానికి కటకట ఏర్పడింది. పాల ఉత్పత్తుల సరఫరా భారీగా పడిపోయింది. కూరగాయలు, పండ్ల సంగతి వేరేగా చెప్పనక్కర్లేదు. దుంపలు పండడమే లేదు. డిమాండ్‌కు సరిపడా పంటల ఉత్పత్తిలేక బ్రిటన్‌లో ఆహార సంక్షోభం ముంచుకొస్తోంది. ధరాభారంతో రైతులు, సామాన్యులు కుదేలైపోతున్నారు. కొన్ని సూపర్ మార్కెట్లలో గుడ్లకి రేషన్ పెట్టేశారు. ఇదే పరిమితి ఇతర ఆహార పదార్థాలపై విధించే పరిస్థితులొస్తాయన్న ఆందోళన ఎక్కువ అవుతోంది.

బ్రిటన్ ఆహార సంక్షోభం దిశగా అడుగులు వేస్తోంది. బ్రెగ్జిట్ నుంచి దేశానికి మొదలైన ఆర్థిక కష్టాల పరంపర కొనసాగుతోంది. కోవిడ్, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, వాతావరణ మార్పులు వంటివి పంట దిగుబడులు, నిత్యావసర వస్తువుల ధరలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. తాజాగా దేశాన్ని ఊపేసిన ఏవియాన్ ఫ్లూతో గుడ్లకు తీవ్ర కొరత ఏర్పడింది. కొన్ని సూపర్ మార్కెట్లలో గుడ్ల అమ్మకంపై పరిమితులు విధించారు. బంగాళదుంపలు దొరకడం లేదు. టమాట దిగుబడులు కనీవినీ ఎరుగని రీతిలో పడిపోయాయి. బ్రాసిల్, యాపిల్స్, దోసకాయలు, ఇతర కూరగాయల దిగుబడి భారీగా తగ్గిపోయాయి. గత 45 ఏళ్లలో ఈ స్థాయిలో పంట దిగుబడులు తగ్గిపోవడం ఈ ఏడాదే జరిగింది.

27% పెరిగిపోయిన పంట ఉత్పత్తి వ్యయం

ఏడాది వ్యవధిలో పంటల ఉత్పత్తికయ్యే ఖర్చు 27 శాతం పెరిగింది. చమురు, ఎరువులు, పశుపోషణ, కోళ్ల పెంపకం వంటి ఖర్చులు తడిసిమోపెడు కావడంతో రైతన్నలు పంటల్ని పండించే పరిస్థితులు లేవని చేతులెత్తేస్తున్నారు. డీజిల్ ధరలు 2019తో పోలిస్తే 75 శాతం పెరిగిపోవడం రైతన్నలపై పెనుభారం మోపింది. ప్రభుత్వం జోక్యం కలిగించుకొని రైతులను ఆదుకోకపోతే బ్రిటన్‌లో కనీవినీ ఎరుగని ఆహార సంక్షోభం ఏర్పడుతుందని జాతీయ రైతు యూనియన్ (ఎన్‌ఎఫ్‌యూ) హెచ్చరించింది. 2019తో పోల్చి చూస్తే రిజిస్టర్డ్ వ్యవసాయ కంపెనీల సంఖ్య 7 వేలు తగ్గిపోయిందని వెల్లడించింది. పనివాళ్ల కొరత సైతం రైతులపై ఒత్తిడి పెంచుతున్నాయి. మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తుల పరిశ్రమలు కుదేలైపోయాయి. ఎన్నో సూపర్ మార్కెట్లలో ర్యాక్‌లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బ్రిటన్‌లో పాలు, వెన్న సరఫరా చేసే అతి పెద్ద సంస్థ ఆర్లా ఫుడ్స్ డిమాండ్‌కు సరిపడా సరఫరా ఇక చేయడం కష్టమని తేల్చి చెప్పింది. పశుపోషణకయ్యే వ్యయం భారీగా పెరగడంతో రైతులు పాలు సరఫరా చేయడం లేదని తెలిపింది. వాతావరణ మార్పుల ప్రభావం పంటలపై పడుతోంది. బంగాళదుంపలు, ఇతర దుంప కూరలు సరిగా పండడం లేదని జేమ్స్ హట్టన్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ లెస్లీ వెల్లడించారు. బంగాళదుంపల ధరలు రెట్టింపయ్యే రోజు ఎంతో దూరంలో లేదని ఆయన అంచనా వేశారు. వాతావరణ మార్పులు, ఇంధనం ధరల ప్రభావంతో ఈ ఏడాది ఆహార ఉత్పత్తులు 11% శాతం మేరకు తగ్గిపోయాయని ఇంధన, పర్యావరణ నిఘా విభాగం నివేదిక వెల్లడించింది.

కళ తప్పిన క్రిస్మస్

క్రిస్మస్ పండుగ దగ్గరకొస్తుంటే సామాన్యుల్లో ఈ సారి ఆ హుషారు కనిపించడం లేదు. సాధారణంగా క్రిస్మస్‌కు నెల రోజుల ముందు నుంచే మార్కెట్లు జనంతో కళకళలాడుతుంటాయి. కానీ ఈ సారి మార్కెట్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. విద్యుత్ బిల్లుల భారం భరించలేక ఎందరో చిరు వ్యాపారులు గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. ధరలు ఆకాశాన్నంటడం, కావల్సిన వస్తువులకి కొరత ఏర్పడడంతో ప్రజలు ఉన్నంతలో బతుకుని నెట్టుకొస్తున్నారు. ఒక కుటుంబంపై నెలవారి నిత్యావసరాల ధరల భారం 34 పౌండ్లు. అంటే 3,400 రూపాయల వరకు పడుతోంది. దీంతో సామాన్య ప్రజల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది.

బ్రిటిష్ రిటైల్ కన్సోర్టియమ్‌లో ఫుడ్ అండ్ సస్టయినబిలిటీ డైరెక్టర్ ఆండ్రూ ఒపె రిటైల్ మార్కెట్లు నిత్యావసరల కొరతతో కళ తప్పినప్పటికీ సంక్షోభం వచ్చే పరిస్థితులు వచ్చే అవకాశం లేదని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రిటన్ ప్రభుత్వం రైతులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పరిస్థితుల్ని అంచనా వేస్తోందని, ఆహార భద్రతకు రిషి సునాక్ సర్కార్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. నవంబర్‌లో ద్రవ్యోల్బణం అత్యధికంగా 14.6 శాతానికి చేరుకున్నప్పటికీ అక్టోబర్‌తో పోలిస్తే 0.1 శాతం తగ్గిందని, గత రెండేళ్లలో ధరలు తగ్గడం ఇదే తొలిసారని ఆయన వివరించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

సహజీవనం నేరమే

- వివాహేతర సంబంధాలు, ఇతర లైంగిక చర్యలపై శిక్షలు ఖరారు
- నేర శిక్షాస్మృతి సవరణ బిల్లుకు ఇండోనేసియా పార్లమెంట్ ఆమోదం

జకార్తా: సహజీవనం, వివాహేతర సంబంధాలు వంటి వాటిని ఇకపై నేరంగా పేర్కొంటూ శిక్షలు ఖరారుచేస్తూ ఇండోనేసియా ప్రభుత్వం చట్టంలో మార్పులు చేసింది. ఆ మేరకు నవంబర్‌లో తుదిరూపునిచ్చిన వివాదాస్పద నేర శిక్షాస్మృతి సవరణ బిల్లును మంగళవారం ఆ దేశ పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సవరించిన నేర శిక్షాస్మృతి ప్రకారం వివాహేతర సంబంధం నెరిపితే నేరంగా భావించి ఏడాది జైలు శిక్ష విధిస్తారు. సహజీవనం చేస్తే ఆరునెలల శిక్ష వేస్తారు. వేరొకరితో లైంగిక సంబంధం పెట్టుకున్నట్లు జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు, సంతానం వీరిలో ఎవరైనా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తేనే ఆ వ్యక్తిపై కేసు నమోదుచేస్తారు. పర్యాటకంలో భాగంగా ఇండోనేసియాకు వచ్చే విదేశీయులకూ ఇదే చట్టం వర్తిస్తుంది. అబార్షన్, దైవ దూషణలను ఇకపై నేరంగా పరిగణిస్తారు. దేశాధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కేంద్ర ప్రభుత్వ సంస్థలను విమర్శించడాన్ని నిషేధించారు. తనపై విమర్శలను నేరుగా దేశాధ్యక్షుడే ఫిర్యాదుచేస్తే నిందితులపై మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు. కమ్యూనిజాన్ని వ్యాప్తిచేస్తే నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తారు. కాగా, భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాసేలా కొన్ని నిబంధలను తెచ్చారని మానవహక్కుల కార్యకర్తలు ఆరోపణలు గుప్పించారు.

నేటి నుంచి పార్లమెంట్

- 17 రోజుల పాటు శీతాకాల సమావేశాలు
- చైనా సరిహద్దు వివాదం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి కీలక సమస్యల్ని చర్చించాలని అఖిలపక్ష భేటీలో ప్రతిపక్షాల పట్టు
- సమస్యలపై నిబంధన ప్రకారం చర్చిస్తామన్న ప్రభుత్వం



అఖిలపక్ష భేటీలో మంత్రులు రాజ్‌నాథ్, ప్రహ్లాద్ జోషి, ఇతర పార్టీల నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా నిరుద్యోగం, చైనాతో సరిహద్దు వివాదం, ఎగసిన ధరలు, పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత వంటి ప్రధాన సమస్యలపై ప్రభుత్వాన్ని పార్లమెంట్ సాక్షిగా నిలదీసేందుకు ప్రతిపక్షాలు సంసిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నేటి నుంచి ఆరంభం కానున్నాయి. 29వ తేదీ వరకు అంటే 23 రోజుల్లో 17 సిట్టింగ్‌లలో ఈసారి సెషన్ కొనసాగనుంది. ఈసారి సమావేశాల్లో 16 బిల్లులను ప్రవేశ పెట్టాలని కేంద్రం యోచిస్తోంది. పార్లమెంట్ సమావేశాలు మొదలైన మరుసటి రోజే గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడుతుండటంతో ఆ ఫలితాల ప్రభావం ఈ సమావేశాలపై పడనుంది.

నిలదీసే లక్ష్యంతో కాంగ్రెస్

చైనా సరిహద్దు వెంట పరిస్థితులు, కేంద్ర ఎన్నికల సంఘంలో ఆకస్మిక నియామకాలు, ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్, పైపైకి పోతున్న ధరలు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి కీలక సమస్యలపై పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తోంది. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్, టీఎంసీ, ఎన్సీపీ, ఆప్, టీఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్, బీజేడీ, జేడీయూసహా దాదాపు 30కిపైగా రాజకీయ పార్టీల ముఖ్యనేతలతో ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. మంగళవారం ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ప్రభుత్వం తరపున పార్లమెంట్ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, రాజ్యసభ పక్ష నేత గోయెల్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాల్గొన్నారు. దేశార్థిక పరిస్థితి, రాజ్యాంగ సంస్థల బలహీనత అంశాలపై పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ జరగలేదని, వీటిపై చర్చించాలని భేటీలో కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత అధిర్ రంజన్ చౌదరీ డిమాండ్ చేశారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, పన్నుల్లో రాష్ట్రాలకు కేటాయింపులు తగ్గిస్తూ రాష్ట్రాలను ఆర్థికంగా దిగ్బంధించడంపై చర్చించాలని తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు సుదీప్ బంధోపాధ్యాయ్ పట్టుబట్టారు. సమస్యలపై సభ నిబంధనల ప్రకారం చర్చిస్తామని ప్రభుత్వం తెలిపింది.

ఈసారి 16 బిల్లులు

బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే ఇటీవల మరణించిన సమాజ్‌వాదీ పార్టీ అగ్రనేత ములాయం సింగ్, నటుడు ఘట్టమనేని కృష్ణ, మాజీ కేంద్ర మంత్రి కృష్ణంరాజు తదితరులకు ఉభయ సభలు సంతాపం తెలపనున్నాయి. ఈ సమావేశాల్లో 16 బిల్లులను ప్రవేశ పెట్టాలని కేంద్రం భావిస్తోంది.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై..

లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్‌చేయాలంటూ రూపొందించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై పార్టీల మధ్య ఏకాభిప్రాయం కోసం అఖిలపక్ష భేటీ నిర్వహించాలని బంధోపాధ్యాయ్ కోరారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో జరిగిన భేటీలో బంధోపాధ్యాయ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు.

లఖీంపూర్ కేసులో అభియోగాలు

లఖీంపూర్ ఖేరి: నలుగురు రైతులు సహా మొత్తం 8 మంది మృతికి కారణమైన లఖీంపూర్ ఖేరి సంఘటనలో నిందితులపై కోర్టులో విచారణకు రంగం సిద్ధమయ్యింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాతోపాటు మరో 12 మంది నిందితులపై జిల్లా కోర్టు అభియోగాలు నమోదు చేసింది. హత్య, నేరపూరిత కుట్ర, సంబంధిత సెక్షన్ల కింద అభియాగాలు మోపింది. నిందితులపై ఐపీసీ సెక్షన్లు 147, 148(అల్లర్లు), 149(చట్టవిరుద్ధంగా గుమికూడడం), 302(హత్య), 307(హత్యాయత్నం), 326(ఆయుధాలతో గాయపర్చడం), 427, 120బీతోపాటు మోటార్ వాహన చట్టంలోని 177 కింద అదనపు జిల్లా జడ్జి సునీల్ కుమార్ వర్మ అభియోగాలు నమోదు చేశారు. తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేశారు. 13 మంది నిందితులు ప్రస్తుతం జైలులో ఉన్నారు. బెయిల్‌పై బయట ఉన్న 14వ నిందితుడు వీరేంద్ర శుక్లాపై ఐపీసీ సెక్షన్ 201 అభియోగాలు నమోదయ్యాయి. ఆశిష్ మిశ్రాతోపాటు కొందరు నిందితులపై ఆయుధాల చట్టంలోని పలు సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. 2021 అక్టోబర్ 3న ఉత్తరప్రదేశ్‌లోని లఖీంపూర్ ఖేరిలో రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులపైకి వాహనం దూసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నలుగురు రైతులు మరణించారు. అనంతరం రైతుల దాడిలో ఒక డ్రైవర్, ఇద్దరు బీజేపీ కార్యకర్తలు, ఒక జర్నలిస్టు మరణించారు. రైతులపైకి దూసుకెళ్లిన వాహనంలో ఆశిష్ మిశ్రా ఉన్నాడని ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు.

చిరుధాన్యాల సంవత్సరం ప్రారంభం

రోమ్: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం –2023 మంగళవారం అధికారికంగా ప్రారంభమైంది. ఇటలీలోని రోమ్‌లో ఐరాస ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎఫ్ఏవో ప్రధాన కార్యదర్శి క్యూ డోంగ్యు, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభతో పాటు ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ జాక్వలిన్ హ్యూగ్స్ పాల్గొని ప్రత్యేక చిహ్నాన్ని ఆవిష్కరించారు. భారత్ ప్రతిపాదన మేరకు ఐరాస సర్వసభ్య సమావేశం 2023ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన విషయం తెలిసిందే. వాతావరణ మార్పుల్ని దీటుగా ఎదుర్కొని పౌష్టికాహార, ఆరోగ్య భద్రతను కలిగించే శక్తి చిరుధాన్యాలకు ఉందని.. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో వినియోగదారులు, రైతులు, పాలకులను చైతన్యపరిచి కార్యోన్ముఖుల్ని చేయటమే తమ లక్ష్యమని ఎఫ్ఏవో ప్రధాన కార్యదర్శి క్యూ డోంగ్యు ఈ సందర్భంగా అన్నారు. చిరుధాన్యాలు తరతరాలుగా భారతీయ సమాజానికి ఆహార భద్రతను కల్పిస్తున్నాయని మోదీ తన సందేశంలో పేర్కొన్నారు. మోదీ సందేశాన్ని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభ చదివి వినిపించారు.



బస్సును మింగిన బురద ప్రవాహం..34 మంది మృతి

బొగొటా: దక్షిణ అమెరికా దేశం కొలంబియాలో కుండపోత వర్షాలకు మొదలైన బురద ప్రవాహం ఒక బస్సును కబళించింది. అందులోని 8 మంది చిన్నారులు సహా 34 మందిని సజీవ సమాధి చేసింది. ఆ వెనుకే వస్తున్న ఆరుగురు ప్రయాణికులతో కూడిన కారును, ఇద్దరు వ్యక్తులు వెళుతున్న బైక్‌ను కూడా బురద వరద కమ్మేసింది. కొలంబియాలోని రిసరాల్డా జిల్లా పాబ్లో రికో సమీపంలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బురద ప్రవాహం హైవేపైకి ఒక్కసారిగా దూసుకువచ్చిందని, ప్రయాణికులతో వెళ్తున్న బస్సులో రెండు మీటర్ల మేర మట్టి, బురద పేరుకుపోయాయని అధికారులు తెలిపారు. పర్వతమయమైన కొలంబియాలో భారీ వర్షాలు, వరదల్లో కొండచరియలు విరిగిపడటం, బురదప్రవాహం సర్వసాధారణం.

పని ప్రదేశాల్లో వేధింపులు ఎక్కువే

ఐక్యరాజ్యసమితి సర్వేలో వెల్లడి



ఐక్యరాజ్యసమితి: పని ప్రదేశాల్లో దిగువస్థాయి సిబ్బందికిపై హింస, వేధింపులు ప్రపంచవ్యాప్తంగా సర్వసాధారణంగా మారాయని ఓ సర్వేలో తేలింది. యువత, వలసదారులు, రోజువారీ వేతన జీవులు, ముఖ్యంగా మహిళలే ఇందుకు బాధితులుగా మారుతున్నారని వెల్లడైంది. ఈ అంశంపై ఐక్యరాజ్యసమితి చేపట్టిన మొట్టమొదటి సర్వే ఇది. ఐరాస అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌వో), లాయిడ్స్ రిజిస్టర్ ఫౌండేషన్, గాల్లప్ సంస్థ కలిసి గత ఏడాది చేపట్టిన ఈ సర్వే ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా 121 దేశాల్లోని 75 వేల మంది సిబ్బందిపై జరపగా 22% మందికి పైగా ఏదో ఒక రకమైన వేధింపులు, హింసకు గురవుతున్నట్లు తెలిపారని సర్వే పేర్కొంది. సర్వేలో పాల్గొన్న ప్రతి ముగ్గురిలో ఒకరు పని ప్రదేశంలో ఏదో ఒకవిధమైన వేధింపులకు గురవుతున్నట్లు తెలపగా, 6.3% మంది భౌతిక, మానసిక, లైంగిక హింసను, వేధింపుల బారినపడ్డారు. 17.9% మంది మాత్రం ఉద్యోగం చేసుకునే చోట ఏదో ఒక రూపంలో వేధింపులను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఉపాధి పొందే చోట భౌతికంగా హింస, వేధింపులను ఎదుర్కొంటున్నట్లు 8.5% మంది పేర్కొనగా వీరిలో మహిళల కంటే పురుషులే ఎక్కువ మంది ఉన్నారు. 'పని ప్రదేశాల్లో వేధింపులు ప్రమాదకరమైన అంశం. దీనివల్ల వ్యక్తుల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు ఆదాయ నష్టం వాటిల్లి, వారి కెరీర్ దెబ్బతింటోంది'అని సర్వే అభిప్రాయపడింది. ప్రభావవంతమైన చట్టాలు, విధానాలను రూపొందించి ఈ సమస్యను పరిష్కరించవచ్చునని పేర్కొంది.

పీటీఐ చీఫ్‌గా ఇమ్రాన్ ఔట్!



ఇస్లామాబాద్: పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ అధ్యక్ష పదవి నుంచి మాజీ ప్రధాని, మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్‌ను తొలగించే ప్రక్రియను పాకిస్తాన్ ఎన్నికల సంఘం ప్రారంభించింది. తోషఖానా కేసులో ఇమ్రాన్‌పై ఇప్పటికే అనర్హత వేటు పడింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్ష పదవి నుంచి ఆయనను పక్కనపెట్టేందుకు ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇమ్రాన్‌కు మంగళవారం నోటీసు జారీ చేసింది. ఈ నెల 13న ఆయన వివరణను ఎన్నికల సంఘం తెలుసుకోనుంది. ఇమ్రాన్ ఖాన్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో దేశ విదేశాల్లో స్వీకరించిన ఖరీదైన వస్తువులను, కానుకలను నిబంధనల ప్రకారం తోషఖానాకు తరలించారు. అవే వస్తువులను తోషఖానా నుంచి తక్కువ ధరకు కొనేసి, ఎక్కువ ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నట్లు ఇమ్రాన్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది.

ఐసీఎంఆర్ సైట్ హ్యాక్‌కు 6 వేల సార్లు విఫలయత్నం

న్యూఢిల్లీ: ప్రఖ్యాత ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ప్రధాన సర్వర్‌ను హ్యాక్ చేసి ఆన్‌లైన్ సేవలను కుప్పకూల్చిన హ్యాకర్లు ఈసారి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)పై దాడికి తెగబడ్డారు. దాదాపు 24 గంటల వ్యవధిలో ఏకంగా ఆరువేల సార్లు ఆ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసేందుకు నిరాటంకంగా ప్రయత్నించి విఫలమయ్యారు. అత్యంత కట్టుదిట్టమైన సైబర్ భద్రత నేపథ్యంలో హాంకాంగ్ హ్యాకర్ల కుట్ర ఫలించలేదని ప్రభుత్వ అధికారులు మంగళవారం వెల్లడించారు. హ్యాకింగ్ దాడి ఘటన గత 30వ తేదీన జరిగింది. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) వారి ఫైర్‌వాల్, ఇతర సెక్యూరిటీ ఫీచర్లు ఈ దాడి నుంచి ఐసీఎంఆర్ వెబ్‌సైట్‌ను కాపాడాయి. దీంతో ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ సంబంధిత సైబర్ మౌలిక సదుపాయాలు, సెక్యూరిటీ చర్యలపై డిసెంబర్ రెండున సమీక్ష నిర్వహించారు. ఢిల్లీ ఎయిమ్స్ సర్వర్లను హ్యాక్ చేసిన హ్యాకర్లు రూ.200 కోట్ల విలువైన క్రిప్టో కరెన్సీని ఇవ్వాలని డిమాండ్ చేసిన విషయం విదితమే.

మళ్లీ సరిహద్దు రగడ

మహారాష్ట్ర, కర్ణాటక మధ్య ఉద్రిక్తత

- బెళగావిలో పోటాపోటీగా నిరసనలు
- వాహనాలపై పరస్పరం దాడులు
- సరిహద్దులను కాపాడుకుంటామన్న సీఎం బొమ్మై
- తమ సహనాన్ని పరీక్షించవద్దని శరద్ పవార్ హెచ్చరిక

బెంగళూరు/ముంబై/బెళగావి: మహారాష్ట్ర, కర్ణాటక మధ్య సరిహద్దు వివాదం మరోసారి ఉద్రిక్తంగా మారుతోంది. బెళగావి నగరంలో మంగళవారం ఇరు రాష్ట్రాల అనుకూలవాదులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. వాహనాలపై పరస్పరం దాడులకు దిగారు. ఇరువర్గాలను పోలీసులు అదుపులోకితీసుకున్నారు. మహారాష్ట్ర మంత్రులు, నేతలు తలపెట్టిన బెళగావి పర్యటనను నిరసిస్తూ కన్నడ సంఘాల సభ్యులు రోడ్లపైకి వచ్చారు. ప్లకార్డులు, బ్యానర్లు, పోస్టర్లు, కన్నడ జెండాలను ప్రదర్శిస్తూ మహారాష్ట్రకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బెళగావిలో మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ నెంబర్‌తో తిరుగుతున్న వాహనాలను అడ్డుకున్నారు. వాటి నెంబర్ ప్లేట్లపై నల్లరంగు పూశారు. కన్నడ సంఘాల నిరసనల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని 'కర్ణాటక రక్షణ వేదిక' ప్రకటించింది. మహారాష్ట్ర మంత్రులు చంద్రకాంత్ పాటిల్, శంభూరాజ్ దేశాయ్ మంగళవారం బెళగావిలో పర్యటించి, మహారాష్ట్ర ఏకీకరణ సమితి సభ్యులకు మద్దతు పలకాలని నిర్ణయించుకున్నారు. కొన్ని కారణాలతో వారి పర్యటన వాయిదా పడింది. శివసేన నాయకులు కూడా బెళగావి పర్యటించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. బెళగావి జిల్లా కలెక్టర్ నగరంలో ఇప్పటికే 144 సెక్షన్ విధించారు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలోని పుణేలో ఉద్ధవ్ ఠాక్రే వర్గం శివసేన కార్యకర్తలు కర్ణాటక వాహనాలపై రంగు చల్లారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

కన్నడిగుల ప్రయోజనాలు కాపాడుతాం: సీఎం బొమ్మై

మహారాష్ట్ర, కర్ణాటక ప్రజల మధ్య ఉన్న సామరస్యాన్ని విచ్ఛిన్నం చేయొద్దని కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై కోరారు. కన్నడిగులు ఎక్కడున్నా సరే వారి ప్రయోజాలను రక్షించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. సరిహద్దు వివాదం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉందని, న్యాయ పోరాటంలో తామే నెగ్గుతామని ధీమా వ్యక్తం చేశారు.

24 గంటల్లోగా దాడులు ఆపాలి: పవార్

సరిహద్దుల్లో ఉద్రిక్తతలకు కర్ణాటక సీఎం బసవరాజ బొమ్మై కారణమని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు, మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్ ఆరోపించారు. మహారాష్ట్ర సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటకలోకి ప్రవేశించే వాహనాలపై దాడులను 24 గంటల్లోగా ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో శాంతిభద్రతలు దిగజారాయని, ఇందుకు కేంద్రం, కర్ణాటక ప్రభుత్వం బాధ్యత వహించాలని తేల్చిచెప్పారు. తమ ఓపికకు కూడా ఓ హద్దు ఉంటుందని వ్యాఖ్యానించారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్నా కేంద్రం, మహారాష్ట్ర సర్కారు నోరుమెదపడం లేదని పవార్ మండిపడ్డారు. బెళగావిలో మహారాష్ట్ర ఏకీకరణ సమితి కార్యకర్తలను పోలీసులు వేధిస్తున్నారని ఆక్షేపించారు. మహారాష్ట్ర, కర్ణాటకలో శాంతి భద్రతలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, బసవరాజ బొమ్మై నిర్ణయించుకున్నారు. ఇరువురు నేతలు మంగళవారం రాత్రి ఫోన్‌ద్వారా మాట్లాడుకున్నారు. సరిహద్దుల్లో నెలకొన్న తాజా పరిస్థితులపై చర్చించుకున్నారు.

ఏమిటీ వివాదం?

రెండు రాష్ట్రాల నడుమ సరిహద్దు వివాదం 1957 నుంచి కొనసాగుతోంది. ప్రస్తుతం కర్ణాటకలో ఉన్న బెళగావితోపాటు మరాఠా భాష మాట్లాడే ప్రజలు అధికంగా ఉన్న 814 గ్రామాలు స్వాతంత్య్రం కంటే ముందు అప్పటి బాంబే ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేవి. బెళగావి నగరాన్ని, 814 గ్రామాలను కర్ణాటకలో 1957లో విలీనం చేశారు. కానీ, అవి తమవేనని మహారాష్ట్ర వాదిస్తోంది. వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. బెళగావి తమ రాష్ట్రంలో అంతర్భాగమని కర్ణాటక వాదిస్తోంది. అంతేకాదు అక్కడ బెంగళూరులోని విధాన సౌధను పోలిన సువర్ణ విధాన సౌధను నిర్మించింది. ఏడాదికోసారి అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తోంది.

సాక్షి
విజయనగరం
బుధవారం ı 7 ı డిసెంబర్ ı 2022



ఎరక్కపోయి ఇరుక్కుపోయింది...

ఓ ప్లాస్టిక్ డబ్బాలో ఉన్నది తినేయాలన్న ఆత్రుతలో ఓ కుక్క మూతిపెట్టింది. తీరా తలను బయటకు తీయలేక, డబ్బా వీడకపోవడంతో పరుగు తీసింది. గజపతినగరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం కనిపించిన ఈ దృశ్యాన్ని స్థానికులు ఆశ్చర్యంగా తిలకించారు. – గజపతినగరం

పేదింటి చిన్నారికి పెద్ద కష్టం



చూడడానికి బాలభీముడిలా ఉంటాడు. మాయదారి రోగం వల్ల స్థూలకాయం ఏర్పడినట్లు తర్వాత తెలిసింది. పుట్టినప్పటి నుంచి ఒక కిడ్నీ కూడా లేకపోవడంతో కుమారుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని తల్లిదండ్రులు కలత చెందుతున్నారు.

- 8లో

నేడు త్రోబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

శృంగవరపుకోట: జిల్లాస్థాయి అండర్ 14, 17 బాల, బాలికల త్రోబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం నిర్వహిస్తామని సెలక్షన్ కమిటీ సభ్యుడు లక్ష్మణరావు తెలిపారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులందరూ హాజరు కావాలని కోరారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామని చెప్పారు.

న్యూస్‌రీల్

విరివిగా హెచ్‌ఐవీ పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ

విజయనగరం ఫోర్ట్: విరివిగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ వైద్యులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఆర్‌టీ మందులు హెచ్‌ఐవీ రోగులు వాడేలా చూడాలన్నారు. హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీటీసీ సెంటర్ల జిల్లా సూపర్ వైజర్ సాక్షి గోపాల్‌రావు, డాక్టర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: లింగ నిర్ధారణ వెల్లడిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం గర్భస్థ పిండ పక్రియ చట్టం-1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయి, ఉప జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించాల్సిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆడపిల్లల తక్కువగా ఉన్న మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్లను తరుచూ పర్యవేక్షించాలని కోరారు. కార్యక్రమంలో డీఐఓ ఎం.నారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజయసాధనకు వైకల్యం అడ్డుకాదు

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్



బధిర క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న ఈశ్వర్‌కౌశిక్

విజయనగరం టౌన్: విజయసాధనకు వైకల్యమనేది అడ్డుకాదని, కృషి, పట్టుదల ఉంటే ఎంతటి విజయాన్ని అయినా అందుకోవచ్చని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్ అన్నారు. ఈ నెల 8 నుంచి 10 వరకు పశ్చిమగోదావరి జిల్లాలో జరిగే బధిరుల సీనియర్, జూనియర్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ క్రీడా పోటీలకు వెళ్తున్న 21 మంది బధిర విద్యార్థులకు ఈశ్వర్ కౌశిక్, శ్రావణి దంపతులు తమ సొంత నిధులు రూ.25 వేలతో కొనుగోలుచేసిన క్రీడా దుస్తులను మంగళవారం అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, అసోసియేషన్ సహాయ కార్యదర్శి కనకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వశిక్ష ఏపీసీ, సిబ్బంది తీరుపై ఆర్‌జేడీ విచారణ

విజయనగరం అర్బన్: జిల్లాలోని సర్వశిక్ష ఏపీసీ, దిగువ స్థాయి సిబ్బందిపై ఉన్నతాధికారులకు అందిన ఆరోపణలపై విద్యాశాఖ ఆర్‌జేడీ జ్యోతికుమారి మంగళవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో విచారణ జరిపారు. ఫిర్యాదుదారు నుంచి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆర్‌జేడీ తెలిపారు.

జయహో బీసీ



- విజయవాడలో బీసీ మహాసభకు వెళ్లిన బీసీలు
- బీసీల జిల్లాగా పేరొందిన ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి అధిక ప్రాతినిధ్యం
- ఎమ్మెల్యేల సమన్వయంతో ముందుకు కదిలిన బస్సులు
- బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను మూడున్నరేళ్లలోనే అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



బీసీ గర్జనకు వెళ్తున్న నేతలకు సంఘీభావం తెలిపిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

పరిపాలన, నాయకత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న బీసీల ఐక్యత చాటి చెప్పేందుకు విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో బుధవారం నిర్వహించే జయహో బీసీ మహాసభకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. విజయనగరం జిల్లా నుంచి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరల ఆధ్వర్యంలో రెండు జిల్లాల నుంచి బస్సులు, కార్లు, ఇతర వాహనాలతో వేలాది మంది మంగళవారం పయనమయ్యారు. మరికొంత మంది తటస్తులు రైళ్లలో బీసీ సదస్సును చూసేందుకు వెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు ఇచ్చిన హామీలను ఈ మూడున్నరేళ్లలోనే అమలు చేశారు. ఇప్పుడు మళ్లీ నిర్వహించనున్న ఈ సదస్సును విజయవంతం చేసేందుకు స్వచ్ఛందంగా తరలివెళ్లారు.

- చలో విజయవాడ బీసీ గర్జనకు విజయనగరం నియోజకవర్గం నుంచి వెళ్తున్న బీసీ నేతలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సంఘీభావం తెలిపారు. విజయనగరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు ఆశపువేణు, నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి రాజేష్‌లు విజయనగరం నియోజకవర్గం నుంచి బయలుదేరిన బీసీ నేతల కారుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ బీసీ గర్జనకు బయలుదేరిన వారిలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఈసరపు రేవతీదేవి, బీసీ సంఘం నేతలు ముద్దాడ మధు, ఇసరపు రామకృష్ణ, రెడ్డి గురుమూర్తి, కాళ్ల సూరిబాబు, రవిచంద్ర, కార్పొరేటర్లు గుజ్జల నారాయణరావు, మారోజు శ్రీనివాసరావు, జి.వి.రంగారావు, ఎన్ని లక్ష్మణరావు, పతివాడ గణపతిలతో పాటు పార్టీ నాయకులు కనకల కృష్ణ, ఎడ్ల రాజేష్, కొసర నారాయణరావుతో పాటు ఆయా డివిజన్లు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బీసీ సంఘం నేతలు రోడ్డు మార్గం గుండా విజయవాడకు పయనమయ్యారు.



పాచిపెంట నుంచి వెళ్తున్న బీసీ ప్రజాప్రతినిధులు, నాయకులతో డిప్యూటీసీఎం రాజన్నదొర

- గజపతినగరం నియోజకవర్గం బొండపల్లి మండలంలో బీసీ గర్జనకు బయలు దేరిన బస్సులను ఎంపీపీ చల్లంనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అలాగే ఆయా మండలాల్లో ముఖ్య నాయకులు బయలు దేరి వెళ్లారు.
- బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి వెళ్లే బస్సులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో జరిగే జయహో బీసీ మహాసభ బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి 12 బస్సులలో 600 మందికిపైగా నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. వీరు కాకుండా మరో 200 మంది వరకు వ్యక్తిగత వాహనాలు, రైళ్లలో గర్జన సభకు ఉత్సాహంగా తరలివెళ్లారు.
- శృంగవరపుకోట నియోజకవర్గంలో జయహో బీసీ నినాదంతో జరిగే బీసీ మహాసభకు శృంగవరపుకోట నియోజకవర్గంలోని బీసీ నాయకులు అంతా తరలి వెళ్లారు. ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొత్తవలస మండలం ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో పాటు 5 మండలాల నాయకులు, కార్యకర్తలు మంగళవారం 20 బస్సులు, 50 కార్లలో తరలి వెళ్లారు. వాటిని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు జెండాఊపి ప్రారంభించారు.
- రాజాం నియోజకవర్గం నుంచి రాజాం పట్టణం, మండలంలో మూడు బస్సులు బీసీ గర్జనకు బయలుదేరాయి. వీటికి జెండా ఊపి ఎమ్మెల్యే కంబాల జోగులు బీసీ గర్జనకు బయలు దేరించారు. రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో రెండేసి బస్సులతో బీసీలు బయలు దేరారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో..

- సాలూరు నియోజకవర్గం నుంచి సాలూరు పట్టణం, మండలంలో బీసీ గర్జనకు బయలు దేరుతున్న బస్సులకు డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర జెండా ఊపి ప్రారంభించారు. సాలూరు నియోజకవర్గం నుంచి 12 బస్సుల్లో నాయకులు తరలి వెళ్లారు.
- పాలకొండ నియోజకవర్గం నుంచి బీసీ గర్జన కార్యక్రమానికి పెద్ద ఎత్తున బీసీ సంఘాలకు చెందిన నాయకులు, బీసీ కులాలకు చెందిన వారు నియోజకవర్గ కేంద్రం పాలకొండ నుంచి విజయవాడ పయనమయ్యారు. వీరికి సంబంధించి ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. ఈ బస్సులను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, పాలవలస రాజశేఖరంలు జెండా ఊపి ప్రారంభించారు.
- పార్వతీపురం నియోజకవర్గంలోని మూడు మండలాలు పార్వతీపురం మున్సిపాల్టీల నుండి బీసీ గర్జనకు వెనుకబడిన కులాలకు చెందిన నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, బసుసల్లో పయనమయ్యారు. బీసీలకు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందిన కార్యకర్తలందరూ పాల్గొన్నారు.



పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గం నుంచి బస్సులను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



ఆదర్శనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న్యాయమూర్తులు

విజయనగరం లీగల్: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణచక్రవర్తి అన్నారు. అంబేడ్కర్ 66వ వర్ధంతి సందర్భంగా జిల్లా కోర్టులో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రప్రథమ న్యాయశాఖమంత్రిగా అంబేడ్కర్ విశిష్ట సేవలందించారని కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా మహాపరినిర్వాన్ దివస్‌గా పరిగణిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు బండారు సంజీవరావు, సీనియర్ న్యాయవాది, రాష్ట్ర బార్‌కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కోలగట్ల తమ్మన్న శెట్టి, సంఘ ప్రతినిధులు వై.హరికృష్ణ, కోన చినఅప్పారావు, మౌళి, ఇతర న్యాయమూర్తులు పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయ అభివృద్ధికి శ్రీకారం



ఖాదీవస్త్రాలయం యజమానికి నష్టపరిహారం చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు త్వరలో శ్రీకారం చుడతామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. అమ్మవారిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారి ఆలయ విస్తరణకు అడ్డంకులు తొలిగిపోయాయన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల వారు అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వచ్చారన్నారు. ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం వారికి పరిహారాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఖాదీ వస్త్రాలయం యజమానికి నష్టపరిహారం చెక్కును అందజేశారు. త్వరలోనే మంత్రి బొత్స సత్యనారాయణ సూచనలతో అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఇటీవల జరిగిన పైడితల్లి సిరిమానోత్సవంలో వీఐపీ దర్శనాలు రద్దు చేయడంతో సామాన్య భక్తులకు త్వరగా అమ్మవారి దర్శన భాగ్యం కలిగిందన్నారు. మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు దీనిపై పదేపదే విమర్శలు చేయడంలో అర్థంలేదన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కిశోర్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు సత్తి అచ్చిరెడ్డి, పతివాడ వెంకటరావు, వెత్స శ్రీనివాసరావు, చిల్ల పుష్ప, గంధం లావణ్య, బలివాడ పార్వతి, రామ్‌సింగ్ సూరమ్మ, పార్టీ నాయకులు బలివాడ కాశి, గంధం హరిబాబు, చిట్టిల రాంబాబు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

పోలీసులతో సమానంగా హోంగార్డుల సేవలు

- 60వ హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలో ఎస్పీ ఎం.దీపిక



హోంగార్డుల నుంచి గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ



హోంగార్డులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీస్ వ్యవస్థలో పోలీసులతో సమానంగా హోంగార్డులు సేవలందిస్తున్నారని ఎస్పీ ఎం.దీపిక పేర్కొన్నారు. 60వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. ముగ్గురు హోంగార్డులకు అతి ఉత్కృష్ట, 13 మందికి ఉత్కృష్ట పతకాలు అందించామన్నారు. నీతి, నిజాయితీ, అంకితభావంతో పనిచేసి జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అంతరం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఆర్అండ్‌బీ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఎం.ఎం.సోల్మన్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీఎస్పీలు ఆర్.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

11 నుంచి జగనన్న ప్రీమియర్ లీగ్



జేపీఎల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, విక్రమ్, భావన దంపతులు

విజయనగరం రూరల్:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు జగనన్న ప్రీమియర్ (జేపీఎల్) లీగ్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అవనాపు విక్రమ్, డీసీఎంఎస్ చైర్ పర్సన్ డాక్టర్ భావన దంపతులు తెలిపారు. జేపీఎల్ క్రికెట్ టోర్నీని పురస్కరించుకుని ముద్రించిన పోస్టర్లను విజయవాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త, ఎంపీ విజయసాయిరెడ్డి, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఉన్న 50 డివిజన్ల నుంచి 50 జట్లు జగనన్న ప్రీమియర్ లీగ్ టోర్నీలో పాల్గొంటాయని తెలిపారు. టోర్నీ విజేత జట్టుకు రూ.50 వేలు, రన్నరప్ జట్టుకు రూ.25 వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు.

ప్రవేశం ఉచితం

టోర్నీలో ప్రవేశం పొందే జట్లకు ఎటువంటి ఎంట్రీ ఫీజు వసూలు చేయడం లేదని విక్రమ్ దంపతులు తెలిపారు. నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. 10 ఓవర్ల ప్రాతిపదికన హార్డ్ టెన్నిస్ బాల్‌తో మ్యాచ్‌లు సాగుతాయన్నారు. ప్రతీ మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ దమ్యాచ్ అవార్డు అందజేస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎంఆర్ కళాశాల మైదానం (అయోధ్య మైదానం)లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మ్యాచ్‌లు జరుగుతాయని వివరించారు. టోర్నీలో పాల్గొనే జట్లు ఈ నెల 10వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్:85559 69745, 96666 69975, 92908 98089 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఓటు నమోదులో బీఎల్‌ఓల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఓటర్ల జాబితా పరిశీలకుడు అహ్మద్ బాబు

- పరిజ్ఞానం, అర్హత ఉన్న వారే బాధ్యతలను నిర్వర్తించాలి
- ప్రజాప్రతినిధులు, అధికారులతో ఓటర్ల జాబితా పరిశీలకుడు ఎ.బాబు

విజయనగరం అర్బన్:

ఓటు నమోదు ప్రక్రియలో బీఎల్‌ఓల పాత్రే కీలకమని, కనీస పరిజ్ఞానం కలిగిన వారికే బాధ్యతలు అప్పగించాలని ఓటర్ల జాబితా పరిశీలకుడు అహ్మద్ బాబు జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఓటు నమోదు, ఓటర్ల జాబితా నిర్వహణ తదితర అంశాలపై మాట్లాడారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బీఎల్‌ఓలపై ఉందన్నారు. ప్రతి కార్యాలయంలోనూ బీఎల్‌ఓల విధులు, వివరాలు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. యువ ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని, కళాశాలలకు వెళ్లి విద్యార్థుల్లో చైతన్యం నింపాలని ఆదేశించారు. పండగల సమయంలో స్వస్థలాలకు వచ్చే యువతకు ఓటు హక్కు కల్పించాలని సూచించారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

ఓటు నమోదు ప్రక్రియలోనూ, జాబితా రూపొందించడంలో అలసత్వం ప్రదర్శించినా, నిర్లక్ష్యం వహించిన బీఎల్‌ఓలపై కఠిన చర్యలు తప్పవని ఎన్నికల పరిశీలకుడు హెచ్చరించారు. సంబంధిత ఏఈఆర్‌ఓలు బాధ్యత తీసుకొని ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం విధివిధానాలు అనుసరించాలని పేర్కొన్నారు. ఎవరికైనా సందేహాలుంటే తన ఫోన్ నంబర్ 94414 12121ను గానీ 'ఏబీఏబీయూ.ఐఏఎస్.ఎన్ఐసీ.ఐఎన్' మెయిల్‌కు పంపించాలన్నారు. జిల్లాలో జరుగుతున్న ఓటు నమోదు ప్రక్రియపై ఓటర్ల జాబితా పరిశీలకులతోపాటు ప్రజాప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో సాగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను కలెక్టర్ ఎ.సూర్యకుమారి వివరించారు. సమావేశంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, రాజకీయ పార్టీల తరపున రొంగలి పోతన, రెడ్డి పావని, దయానంద్, మోహనరావు, రాజేష్, వీఆర్వోలు, ఏఈఆర్‌ఓ, తదితరులు పాల్గొన్నారు.



హాజరయిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు

ఉచిత వైద్య సేవలు భేష్



యూనిట్‌ను ప్రారంభిస్తున్న తోట విద్యాసాగర్

కొత్తవలస రూరల్:

ఉచిత వైద్య సేవలు అందించడం హర్షించదగ్గ విషయమని ఎస్‌బీడీబీఐ డీజీఎం (హైదరాబాద్) తోట విద్యాసాగర్ అన్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురుదేవా హాస్పిటల్‌లో ఎస్‌బీడీబీఐ ఆర్థిక సహకారంతో కొత్తగా ఏర్పాటుచేసిన డిజిటల్‌ఎక్స్‌రే, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్, ఎనస్తీసియా వర్క్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. 30 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, 100 మంది వృద్ధులకు రేషన్ సరుకులు పంపిణీ చేశారు.

పేదలకు సహాయం అందించేందుకు తమవంతు సహకరిస్తామని విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు, మరియు హాస్పిటల్ చైర్మన్ రావర్తి జగదీష్‌బాబు, హాస్పిటల్ సీఈఓ డాక్టర్ అచ్యుత్‌రామయ్య, డాక్టర్ రాఘవేంద్ర, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి జూడో పోటీలలో పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, హెచ్ఎం

రామభద్రపురం: కాకినాడలో ఈ నెల 3,4,5 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో పోటీల్లో కొట్టక్కి ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న సామిరెడ్డి రామలక్ష్మి 44 కేజీల విభాగం, ముత్యాల వినీత 57 కేజీల విభాగం, బోడిగింజల జ్యోత్స్న 48 కేజీల విభాగంలో కాంస్య పతకాలు సాధించగా తూముల యశోద 70 కేజీల విభాగంలో రజత పతకాన్ని సాధించినట్లు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి బొత్స రత్నకిశోర్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పాఠశాల హెచ్ఎం రావాడ భాస్కరరావులు అభినందించారు.జాతీయ స్థాయిలో పతకాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉత్సాహంగా అండర్-14 జిల్లా క్రికెట్ ఎంపిక పోటీలు



ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విజయనగరం రూరల్: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 జిల్లా క్రికెట్ ఎంపిక పోటీలు మంగళవారం ఉత్సాహభరితంగా సాగాయి. స్థానిక విజ్జీ మైదానంలో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 54 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. సెలెక్టర్లు వర్మ, సర్వరాజ్, బంగార్రాజు, నానాజీ ఆధ్వర్యంలో జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. నైపుణ్యం కలిగిన 20 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని వీడీసీఏ కార్యదర్శి, ట్రెజరర్‌లు ఎంఎల్ఎన్ రాజు, పి.సీతారామరాజులు తెలిపారు. కోచ్‌లు రమేష్, చంద్రశేఖర్, యమున, పాల్గొన్నారు.

84 మద్యం బాటిల్స్ స్వాధీనం

బొండపల్లి (దత్తిరాజేరు): మండలంలోని కె.కృష్ణాపురం గ్రామానికి చెందిన దనాన అజయ్ కుమార్ ఇంట్లో అమ్మకానికి ఉంచిన 84 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.బూర్జివలస ఎస్సై రాజేష్ తెలిపారు. గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ డొంకినవలసలోని మద్యం దుకాణం నుంచి మంగళవారం 84 బాటిల్స్ అక్రమంగా తెచ్చి విక్రయించడానికి సిద్ధంగా ఉంచినట్లు అందిన సమాచారం మేరకు సోదా నిర్వహించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 545.00
విజయనగరం	రూ. 549.00
శ్రీకాకుళం	రూ. 549.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	53,780-00
బంగారం(22సి. 10గ్రా.)	49,300-00
వెండి (కిలో)	70,800-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

క్రీడలకు ప్రోత్సాహం

- ఎమ్మెల్సీ సురేష్‌బాబు
- ఉత్సాహంగా సీఎం స్పోర్ట్స్ ప్రైజ్‌మనీ కప్ జోనల్‌స్థాయి టోర్నీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించడానికి, గ్రామీణ ప్రాంత యువతలో నైపుణ్యాలను వెలికితీయడానికి తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారని ఎమ్మెల్సీ సురేష్ బాబు పేర్కొన్నారు. స్థానిక విజ్జీ స్టేడియంలో ఏపీ సీఎం స్పోర్ట్స్ ప్రైజ్‌మనీ కప్ జోనల్ స్థాయి క్రికెట్ టోర్నీని ఎమ్మెల్సీ సురేష్‌బాబు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిలు జ్యోతి ప్రజ్వలన చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్తమ క్రీడాకారులు తయారయ్యేలా రూ.50 లక్షల ప్రైజ్‌మనీతో సీఎం కప్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో అంతర్జాతీయంగా ఆదరణ పొందుతున్న క్రికెట్ క్రీడను చేర్చి పోటీలను నిర్వహిసున్నారని తెలిపారు. ఈ పోటీల ద్వారా నైపుణ్యమున్న క్రీడాకారులు వెలుగులోకి వస్తారని ఆశాభావం వెలిబుచ్చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువత ఇటువంటి క్రీడాంశాల్లో పాల్గొని వారి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు.

ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలి

కార్యక్రమంలో పాల్గొన్న జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ విజ్జీ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ పోటీలు జరిగాయని, వాటిలో పాల్గొన్న క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ ఉత్తమ క్రీడాకారులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తున్నారని, ఈ పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఎల్.ఎన్.రాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించేలా అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. అనంతరం పోటీలకు ఆరంభ సూచికగా కపోతాలను ఎగురవేశారు. పోటీల్లో పాల్గొన్న విజయనగరం, విశాఖ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అనకాపల్లి, పాడేరు జట్ల క్రీడాకారులను ముఖ్యఅతిథులకు డీఎస్ఏ ముఖ్య శిక్షకుడు పి.అప్పలనాయుడు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, మేయర్, జేసీలు బ్యాటింగ్ చేసి పోటీలను ఆరంభించారు.



కపోతాలను ఎగురవేస్తున్న అతిథులు

ఫైనల్స్‌కు విజయనగరం



ఫైనల్స్‌కు చేరిన విజయనగరం జిల్లా క్రికెట్ జట్టు విజయకేతనం

జిల్లా కేంద్రంలోని విజ్జీ క్రికెట్ మైదానంలో ఏపీ సీఎం ప్రైజ్‌మనీ కప్ క్రికెట్ టోర్నీ జోనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా జరుగుతున్నాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, శ్రీకాకుళం, అనకాపల్లి, పాడేరు జిల్లా జట్లు జోనల్ లెవెల్‌కు చేరుకోగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల జట్ల మధ్య తొలి మ్యాచ్ జరిగింది. ముందుగా బ్యాటింగ్ ప్రారంభించిన పార్వతీపురం మన్యం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో కేవలం 35 పరుగులే చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విజయనగరం జట్టు రెండు వికెట్ల నష్టానికి 36 పరుగులు చేసి సెమీఫైనల్స్‌కు చేరుకుంది. విశాఖపట్నం, పాడేరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో విశాఖ జట్టు విజయం సాధించి సెమీఫైనల్లో అడుగుపెట్టింది. మధ్యాహ్నం నిర్వహించిన తొలి సెమీఫైనల్లో విజయనగరం, శ్రీకాకుళం జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 76 పరుగులు సాధించా 77 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు రెండు బంతులు మిగిలి ఉండగా లక్ష్యాన్ని చేరుకుంది. దీంతో ఫైనల్స్ చేరిన తొలి జట్టుగా విజయనగరం జిల్లా నమోదైంది. బుధవారం ఉదయం విశాఖపట్నం, అనకాపల్లి జట్ల మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు ఫైనల్లో విజయనగరం జట్టుతో తలపడనుంది.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- గుంకలాం జగనన్న కాలనీ సందర్శన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం రూరల్: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడానికి కృషి చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. మండలంలోని గుంకలాం లేఅవుట్‌లో గల జగనన్న కాలనీని కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల ప్రగతిని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టుకు ఇచ్చిన ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతుండడంపై సంబంధిత ప్రాజెక్టు మేనేజర్‌పై అసహనం వెళ్లగక్కారు. మేస్త్రీలను, పనివారిని ఎక్కువమందిని వినియోగించి ఇళ్ల నిర్మానం వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇటుకల తయారీ యూనిట్‌లో నాణ్యత తగ్గకుండా ఉత్పత్తిని పెంచాలని సూచించారు. కాలనీలో పునాదుల స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లపై, గృహ నిర్మాణ శాఖాధికారులను ప్రశ్నించారు. వాటి నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. వార్డు వలంటీర్ల సేవలు వినియోగించుకుని లబ్ధిదారులను చైతన్యపరచాలని సూచించారు. ఈ పర్యటనలో హౌసింగ్ అధికారులు ఎస్వీ రమణమూర్తి, రంగారావు, శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజర్ శ్రావణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గంట్యాడ మండల సమాఖ్యకు జాతీయ పురస్కారం



మండల సమాఖ్య కార్యాలయం

గంట్యాడ: గంట్యాడ మండల సమాఖ్య జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైంది. ఈ పురస్కారాలకు దేశవ్యాప్తంగా ఉన్న 320 మండల సమాఖ్యలు నామినేషన్స్ వేయగా పరిశీలించిన పురస్కారాల కమిటీ గంట్యాడ మండల సమాఖ్యను తృతీయ స్థానానికి ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో ఈనెల 17న జరిగే నాబార్డ్ వర్క్‌షాప్‌లో మండల సమాఖ్యకు అవార్డును అందజేయనున్నారు. మండల సమాఖ్య ప్రాంత పరిధిలో ఉన్న స్వయం సంఘాల సభ్యులకు ఉత్తమమైన సేవలు అందించడం, స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇచ్చిన రుణాలు సకాలంలో రికవరీ చేయడం, పరిపాలన దక్షత తదితర అంశాల్లో అందించిన సేవలకు గాను ఈ పురస్కారం అందించనున్నారు. పురస్కారం కింద మండల సమాఖ్యకు రూ.50 వేలు నగదు అందజేయనున్నారు.

మిస్టర్ ఆంధ్రాకు అభినందనలు



కిశోర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో ఈ నెల 4వ తేదీన జరిగిన 9వ మిస్టర్ ఆంధ్రా శరీర సౌష్టవ పోటీల్లో జిల్లా కేంద్రంలోని మేదర వీధికి చెందిన ఎస్. కిశోర్ ప్రథమ స్థానం సాధించడంతో ఎమ్మెల్యే జోగారావుతో పాటు పలువురు అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విజేతను అభినందించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఎవరైనా శరీర సౌష్టవ పోటీలతో పాటు ఇతర క్రీడల్లో రాణించాలని, అందుకు తన వంతు సహాయసహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కిశోర్ రాణించాలని ఆకాంక్షించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వే అడ్డుకున్న రైతులు



సర్వే అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

కొత్తవలస రూరల్: విశాఖపట్నం నుంచి రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా చేస్తున్న 110 ఎకరాల భూ సేకరణ సర్వేను మండలంలోని ఉత్తరాపల్లి, చిన్నిపాలెం, రాయపురాజుపేట, అప్పన్నపాలెం గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం అడ్డగించారు. తమకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని లేదంటే తమ భూములకు అవలనున్న ప్రభుత్వ భూమిని భూమికి భూమి పరిహారంగా చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు రిలే నిరాహారదీక్షలు చేస్తున్న శిబిరాన్ని తొలగించాలని జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బలగాలు నిరాహారదీక్ష చేస్తున్న శిబిరానికి మంగళవారం చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులతో సీఐ బాలసూర్యారావు మాట్లాడుతూ శిబిరాన్ని ఖాళీ చేయాలని కోరగా ఈ భూములపై కోర్టుకు వెళ్లామని రైతులు తెలిపారు. కోర్టు నుంచి తమకు ఎటువంటి ఆదేశాలు లేవని సర్వే పనులు అడ్డుకోవద్దని తహసీల్దార్ ప్రసాదరావు రైతులను కోరారు. అయితే తమకు న్యాయం జరగకుండా సర్వే నిర్వహిస్తే ఆత్మహత్యకు పాల్పడతానని ఓ రైతు రాయితో ఆత్మహత్యాయత్నం చేయడంతో అధికారులు వెనక్కి తగ్గారు. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్దల ఎదుట సమావేశం నిర్వహించి తమకు న్యాయం చేయాలని పోలీసులను రైతులు అభ్యర్థించడంతో సమావేశం నిర్వహించి పరిష్కారం చూపుతామని అధికారులు హామీ ఇచ్చారు.

బైక్ ఢీకొని విద్యార్థినికి గాయాలు



గాయాల పాలైన విద్యార్థిని శిరి

బలిజిపేట: లంచ్ విరామసమయంలో పాఠశాల ఆవరణ దాటి వచ్చిన 7వ తరగతి విద్యార్థిని శిరి బైక్ ఢీకొనడంతో గాయాల పాలైంది. లంచ్ సమయంలో పాఠశాల గేట్లు పూర్తిగా తీసివేయడంతో విద్యార్థులు సమీపంలో ఉన్న బస్టాండ్ వద్దకు వచ్చి తినుబండారాలు కొనుగోలు చేసుకుంటున్నారు. అదే సమయంలో ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై స్పీడుగా వస్తూ అటుగా వస్తున్న విద్యార్థిని శిరిని ఢీకొట్టడంతో తలకు గాయమయింది. ఆమెను సమీపంలోని హాస్పిటల్‌కు తీసుకువెళ్లి వైద్యసేవలు అందించారు. దీనిపై ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి మాట్లాడుతూ గాయాల పాలైన శిరికి ఎటువంటి ఇబ్బంది లేదని, కుట్లు వేయించి ఇంటికి పంపించినట్లు చెప్పారు.

ముగిసిన కళాఉత్సవ్-2022

- అలరించిన విద్యార్థుల ఏక పాత్రాభినయం ప్రదర్శనలు



విజేతలతో ప్రిన్సిపాల్ తదితరులు





విద్యార్థుల ఏక పాత్రాభినయం

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి కళాఉత్సవ్-2022 పోటీలు మంగళవారం ముగిశాయి. రెండో రోజు ఏకపాత్రాభినయం, విజువల్ ఆర్ట్స్(2డి, 3డి) బొమ్మల తయారీ, ఆటల అంశాల్లో పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం ప్రదర్శనలు అందరినీ అలరించాయి. పలువురు రూపొందించిన మట్టిబొమ్మలు ఆకట్టుకున్నాయి. ఒక్కో అంశం నుంచి ఇద్దరేసి చొప్పున విజేతలను ప్రకటించారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడితో పాటు డిప్యూటీ డీఈఓ వాసుదేవరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణారావు, నిర్వాహకులు ఈశ్వరరావు, రవికుమార్, చంద్రశేఖరరావు, రామకృష్ణ, సూర్యారావు అభినందించారు. ఇక్కడి విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

విజేతలు వీరే..

డైట్ కళాశాలలో నిర్వహించిన కళా ఉత్సవ్ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా ప్రథమస్థానంలో నిలిచారు. వారిలో క్లాసికల్ సాంగ్స్ విజేతలుగా ఎంఎస్ దీక్షితార్, ఎస్.మానిక, ఫోక్ సాంగ్స్ విజేతగా సీహెచ్ హేమశ్రీ, క్లాసికల్ డ్యాన్స్ విజేతగా పి.గౌరి, ఫోక్ డ్యాన్స్ విజేతలుగా పి.దిలీప్ కుమార్, ఆర్ నందిని, ఇనుస్ట్రుమెంట్ మ్యూజిక్ విజేతలుగా ఎస్ అభిషేక్, టి.సాహితి ప్రియ నిలిచారు. ఏకపాత్రాభినయం విజేతలుగా వై.భరత్, సీహెచ్ ఝాన్సీ, 2డి డ్రాయింగ్ విజేతలుగా టి.భవాని, కె చిన్నమ్మి, 3డి డ్రాయింగ్ విజేతలుగా కె.తులసి రాజ రాజేష్, షేక్ షేరున్నీషా, బొమ్మల తయారీలో పి మణి దీపిక, వి.జ్ఞానేశ్వరరావు ఉన్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ: యువకుడి మృతి

- గాయాలపాలైన మరో యువకుడు



కోన సత్తిబాబు మృతదేహం



గాయాలపాలైన గొంప రాజు

వేపాడ: మండలంలో రాయుడుపేట వెళ్లే జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బక్కునాయుడుపేట గ్రామానికి చెందిన కోన సత్తిబాబు(25), గొంప రాజు (21) ద్విచక్రవాహనంపై వేపాడ వెళ్తున్నారు. వీలుపర్తి నుంచి పిక్కలోడుతో రాయుడుపేట వైపు వెళ్తున్న ట్రాక్టర్ రాయుడుపేట జంక్షన్ వద్ద ఒకదానినొకటి ఢీకొన్నాయి. దీంతో ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న సత్తిబాబు, రాజులకు కింద పడడంతో తీవ్రగాయాలపాయ్యారు. ఆ సమయంలో దేవరాపల్లికి చెందిన 108 వాహనం అదే రహదారిలో వస్తుండడంతో స్థానికులు ఆపి గాయాలపాలైన ఇద్దరిని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో సత్తిబాబు మృతిచెందాడు. మరో యువకుడు గొంప రాజుకు ఎస్.కోట సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతిచెందిన సత్తిబాబుకు తండ్రి చెల్లయ్య, దేముడమ్మ అక్క సత్యవతి, చెల్లి సన్యాసమ్మ ఉన్నారు. గాయాలపాలైన గొంపరాజుకు తండ్రి అప్పారావు, తల్లి రమణమ్మ ఉన్నారు. మృతుడి తండ్రిచెల్లయ్య ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదింటి చిన్నారికి పెద్ద కష్టం

- కిడ్నీ, థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్న బాలుడు
- ఖరీదైన వైద్యం చేయించే స్థోమతలేని పేదకుటుంబం
- దీనావస్థలో నిరుపేద తల్లిదండ్రులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



కొడుకు పరిస్థితితో దిగులుగా ఉన్న తల్లిదండ్రులు

వీరఘట్టం: చూడడానికి బాలభీముడిలా ఉంటాడు. అయితే మాయదారి రోగాల వల్ల స్థూలకాయం ఏర్పడినట్లు తర్వాత తెలిసింది అలాగే పుట్టినప్పటి నుంచి ఒక కిడ్నీ కూడా లేక పోవడంతో కుమారుడి పరిస్థితి తెలుసుకుని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వీరఘట్టం మండలం నడుకూరు గ్రామానికి చెందిన అరసాడ ప్రదీప్, సరోజిని దంపతులకు కుమారుడు సుశాంక్ (9) ఉన్నాడు. పుట్టినప్పటి నుంచి బొద్దుగా బలంగా ఉండడంతో చూసిన వారంతా మురిసిపోయారు. అయితే తర్వాత తెలిసింది అది బలం కాదు..శరీరంలో ఏర్పడిన మాయదారి రోగం వల్ల వచ్చిన స్థూలకాయమని, తొమ్మిదేళ్ల వయస్సులో 70 కిలోల బరువు ఉండడంతో నడవలేని స్థితిలో బాలుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. అంతేకాక ఒక కిడ్నీ కూడా శరీరంలో లేదని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు హతాశులయ్యారు.

పలు ఆసుపత్రుల్లో చికిత్స..

కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు తమ కుమారుడిని తొలుత శ్రీకాకుళంలోని రిమ్స్‌లో చూపించారు.అక్కడ కిడ్నీ సమస్య ఉన్నట్లు నిర్ధారణ కావడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు. తర్వాత విశాఖ కేజీహెచ్‌లో బాలుడికి పరీక్షలు చేసి పూర్తిగా ఒక కిడ్నీ లేదని నిర్ధారించారు. అంతేకాకుండా థైరాయిడ్ వల్ల ఊబకాయం వచ్చిందని తెలియజేశారు. ఖరీదైన వైద్యం చేస్తే బాలుడు కోలుకుంటాడని వైద్యులు తెలపడంతో ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రులు కుమారుడి పరిస్థితి చూసి బిక్కుబిక్కుమంటున్నారు. ప్రతి నెలా విశాఖపట్నం కేజీహెచ్‌కు వెళ్లి మందులు వాడుతున్నారు. ఈ మందుల వల్ల వ్యాధి నయం కాదని డాక్టర్లు చెబుతున్నారు. దాతలు ముందుకు వచ్చి తమ కుమారుడిని ఆదుకోవాలని ఆ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. సహాయం చేయదలచిన దాతలు ఫోన్ 6303241807 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ పరిధిలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పి.అప్పలస్వామినాయుడు మంగళవారం తెలిపారు. బెటాలియన్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపేస్తామని తెలిపారు. రఘుమండ, బొడ్డవలస, జొన్నాడ, డి.తాళ్లవలస, గుండాలపేట, ఏపీఎస్పీ బెటాలియన్, చింతలవలస ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

సకాలంలో వైద్య సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు పేర్కొన్నారు. స్థానిక తిరుమల ఆస్పత్రిలో ఉమ్మడి జిల్లాలకు చెందిన ఆరోగ్య మిత్రాలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు వచ్చిన రోగులకు ఆరోగ్యశ్రీలో ముందుగా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ప్రతి రోజు వార్డులను పరిశీలించి అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకోవాలన్నారు. ఏదైనా సమస్య రోగులు చెబితే వెంటనే తన దృష్టికి తీసుకోవాలన్నారు. ఆపరేషన్‌లు కోసం చేరిన వారికి సకాలంలో శస్త్రచికిత్సలు జరిగేలా చూడాలని చెప్పారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీమ్ లీడర్లు భాను, ఉమ, దేవి పాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

విజయనగరం రూరల్: ఆశా డే పురస్కరించుకుని మండలంలోని రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మహిళా భద్రతపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు శ్రావణి మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు, నివారణకు ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మాణిక్యం, ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, ఈఓ వీవీఆర్‌ఎం రాజు, పీహెచ్ ఎన్ రాముడమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానమని విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఇల్లామాష్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి మాత్రమే రక్తం ఇచ్చి ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడని అన్నారు. నిరంతరం రక్తదానం చేయడం ద్వారా రక్తకొరత అనేది లేకుండా చేయవచ్చునని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఏడాదికి నాలుగు పర్యాయాలు రక్తదానం చేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, శరత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపకరణాల ఎంపిక శిబిరం

కొత్తవలస: ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల కోసం స్థానిక భవిత కేంద్రంలో ఎంపికల శిబిరం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ జి.శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యులు పిల్లలకు పరీక్షలు చేసి అవసరమైన ఉపకరణాలు ఉచితంగా అందించేందుకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. శిబిరానికి వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాల పిల్లలు హాజరు కావాలని కోరారు. అలాగే మూడేళ్ల కాల పరిమితి గల బస్సు పాస్‌లను అందిస్తామని తెలిపారు.

మహనీయుడు అంబేడ్కర్


విజయనగరం రూరల్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

భారతదేశ ఖ్యాతిని అంతర్జాతీయంగా నిలబెట్టిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విజయనగరంలోని బాలాజీ కూడలిని అంబేడ్కర్ కూడలిగా నామకరణం చేయనున్నట్టు, అక్కడ 12 అడుగుల ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు. విజయనగరంలోని బొగ్గులదిబ్బలో అంబేడ్కర్ చిత్రపటానికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి రాకోటి ఆనంద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి యూనివర్సిటీలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్


నెల్లిమర్ల: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తదితరులు


విజయనగరం ఫోర్ట్: అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం దళిత చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు మురళీమోహన్


విజయనగరం అర్బన్: నివాళులర్పిస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

దివ్యాంగులను భాగస్వాములను చేయాలి


చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు, పాల్గొన్న అధికారులు

నెల్లిమర్ల: దివ్యాంగులను ఆదరించడంతో పాటు అన్ని కార్యక్రమాల్లోనూ వారిని భాగస్వాములను చేయాలని తహసీల్దార్ కెవి.రమణరాజు, ఎంపీడీఓ జి.గిరిబాల అన్నారు. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నెల్లిమర్ల, గుర్ల, విజయనగరం మండలాలకు చెందిన దివ్యాంగ చిన్నారులకు అవసరమైన ఉపకరణాల గుర్తింపు శిబిరం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. మూడు మండలాలకు చెందిన 106 మంది చిన్నారులకు వైద్యులు రామకృష్ణ, తేజ్‌కుమార్ పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన ఉపకరణాలను గుర్తించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీఓ మాట్లాడుతూ అవయవ లోపాలున్న పిల్లలను సైతం సాధారణ పిల్లలతో సమానంగానే చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య సమన్వయాధికారి ఎస్.సూర్యారావు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేకావసరాలు గల పిల్లలకు అవసరమైన సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అంతేగాకుండా అవసరమైన వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, కాలిపర్స్ తదితర ఉపకరణాలను సైతం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సహిత విద్య సహాయ సమన్వయకర్త ఎం.భారతి, ఈఓపీఆర్డీ భానోజీరావు, ఐఈఆర్టీలు బెల్లాన అప్పలనాయుడు, నడిపేన బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం


సెంచూరియన్ వర్సిటీలో ఓటు హక్కుపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ జీఎస్‌ఎన్ రాజు, డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్ తదితరులు

నెల్లిమర్ల రూరల్: ప్రజాస్వామ్య దేశాలలో ప్రజలకు ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని వీసీ ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు అన్నారు. కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో విద్యార్థులకు ఓటు హక్కుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలని అర్హులైన వారు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ పి.శ్రీకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందడుగు వేయాలన్నారు. సాదాసీదా చదువులు ఉన్నత స్థాయికి తీసుకెళ్లలేవని కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చునని చెప్పారు. ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వర్సిటీ ప్రతినిధులు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్‌ఎస్ వర్మ, పారా మెడికల్ డీన్ లక్ష్మీనరసింహాచార్యులు, ఎస్‌బీసీసీ జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యత

- జయహో బీసీ మహాసభను విజయవంతం చేయాలి
- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు



నెల్లిమర్ల: బీసీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ పివివి.సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) అన్నారు. బుధవారం విజయవాడలో నిర్వహించే జయహో బీసీ మహాసభకు బీసీ కులాలకు చెందిన ప్రజలంతా పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నెల్లిమర్లలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం బీసీ కులాల అభివృద్ధికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బీసీ కులాలకు చెందిన 14 మందికి మంత్రులుగా అవకాశం కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ 1.77 లక్షల కోట్లు ప్రజలకు పంపిణీ చేయగా అందులో రూ.86 వేల కోట్లు కేవలం బీసీలకే అందజేసిందన్నారు. సదరు సంక్షేమ పథకాలతో బీసీ కులాలకు చెందిన ప్రజలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. సీఎం జగన్ దృష్టిలో బీసీలు అంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని పార్టీకి, ప్రభుత్వానికి 'బ్యాక్ బోన్' అని పేర్కొన్నారు. తన తండ్రి దివంగత పెనుమత్స సాంబశివరావు ఎనిమిదిసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడానికి, రెండు సార్లు మంత్రిగా పనిచేయడానికి నియోజకవర్గంలోని బీసీ ఓటర్ల దీవెనలే కారణమని ఎమ్మెల్సీ చెప్పారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 70 శాతం మంది బీసీ కులాలకు చెందిన వారుండగా వారంతా జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని వివరించారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఇప్పటికైనా టీడీపీ, జనసేన నాయకులు అబద్ధపు ప్రచారాలు ఆపాలని ఎమ్మెల్సీ హితవు పలికారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


కేజీబీవీలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, వెలుగు సిబ్బంది

భోగాపురం: బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ సుగుణవతి, వెలుగు ఏపీఎం రమణ కోరారు. బాల్య వివాహాల నిర్మూలన, లింగ వివక్షత, రక్తహీనత, ఆడ పిల్లలపై అత్యాచారాల నిరోధం, బాలికల అక్రమ రవాణా తదితర అంశాలపై స్థానిక కేజీబీవీ పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తూ, బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి లింగ వివక్షతపై చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ రామకృష్ణనాయుడు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీసస్ బోధనలు అనుసరణీయం

- సిటీ క్రిస్మస్ వేడుకలు
- అలరించిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు


లోకరక్షకుడా అంటూ చిన్నారులు చేస్తున్న నృత్య ప్రదర్శన


ఆకట్టుకుంటున్న క్రీస్తు జననం సెట్

విజయనగరం టౌన్: జీసస్ బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని ఏపీపీఎఫ్ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ వైఎస్.థామస్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో మంగళవారం రాత్రి ది విజయనగరం డిస్ట్రిక్ట్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిటీ క్రిస్మస్ వేడుకలను సంఘమిత్ర ఆర్ ఎస్.జాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన థామస్ రెడ్డి మాట్లాడుతూ మానవాళికి ప్రభువైన క్రీస్తు అందించిన బోధనలను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సర్వమానవాళి శ్రేయస్సుకు పాటుపడాలన్నారు. రెవరెండ్ పి.జీవన్ కుమార్ ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రెవరెండ్ ఎమ్‌ఎ.నాయుడు, పి.ఆనంద్, జాన్ వెస్లీ, బిషప్ దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

విజయనగరం ఫోర్ట్: మహిళలను ప్రతి ఒక్కరు గౌరవించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పేర్కొన్నారు. స్థానిక కస్పా హైస్కూల్లో మంగళవారం మహిళల వేధింపుల చట్టంపై నిర్వహించిన కళాజాతను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనిచేసే చోట మహిళలకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని చెప్పారు. వేధింపులకు గురైన మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారిణి బి.శాంతకుమారి, సీడీపీఓ జి.ప్రసన్న, సూపర్‌వైజర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో మనోధైర్యం నింపాలి

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి


రక్తదాతలను అభినందిస్తున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం టౌన్:

దివ్యాంగులలో మనోధైర్యం నింపే ప్రయత్నం చేయాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పేర్కొన్నారు. మంగళవారం 63వ ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక వెంకటలక్ష్మీ కూడలి వద్దనున్న విజయదుర్గ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భగవంతుడు సకలాంగుల కన్నా దివ్యాంగులకే అత్యున్నత ప్రతిభాపాటవాలు ప్రసాదిస్తాడన్నారు. వైకల్యమనేది విజయ సాధనకు అడ్డుకాదని, కృషి, పట్టుదల ఉంటే ఎంతటి విజయమైనా సాధించవచ్చన్నారు. దివ్యాంగులకు మనతో పాటూ సమున్నత గౌరవం కల్పించాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, అసోసియేషన్ అధ్యక్షుడు కొండుబాబు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో సీఐటీయూ మహాసభలు


ఆశా వర్కర్లతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

భోగాపురం: జిల్లా కేంద్రంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభల్లో కార్మికులు, ఆశా వర్కర్లు పాల్గొని సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ కోరారు. ఈ మేరకు ఆశా వర్కర్లతో కలిసి మండల కేంద్రంలో మంగళవారం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించే విధంగా కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్‌కోడ్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ముడిదాం ఎస్ కన్వెన్షన్ దగ్గర నిర్వహించే జిల్లా మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, యూనియన్ సభ్యులు కనకమహాలక్ష్మి, నాగలక్ష్మి, రాజేశ్వరి, సౌజన్య, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ నేతలకు కోలగట్ల సంఘీభావం

విజయనగరం రూరల్:

బీసీల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. చలో విజయవాడ జయహో బీసీ మహాసభకు విజయనగరం నియోజకవర్గం నుంచి మంగళవారం తరలివెళ్లిన బీసీ నేతలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సంఘీభావం తెలిపారు. బుధవారం విజయవాడలో నిర్వహించనున్న జయహో బీసీ మహాసభకు బయలుదేరి వెళ్లిన బీసీ నేతల కార్ల ర్యాలీని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు ఆశపు వేణు, నగరపాలక సంస్థ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణు, రాజేష్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో బీసీలకు అన్న విధాల న్యాయం చేస్తానని ఇచ్చిన హామీలకు అనుగుణంగా అధికారం చేపట్టిన వెంటనే బీసీలకు ప్రాధాన్యత ఇచ్చే అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. బీసీ గర్జనకు బయలుదేరి వెళ్లిన వారిలో నగర మేయర్ వెంపటాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఈసరపు రేవతిదేవి, బీసీ సంఘం నేతలు ముద్దాడ మధు, ఇసరపు రామకృష్ణ, రెడ్డి గురుమూర్తి, కాళ్ల సూరిబాబు, రవిచంద్ర, కార్పొరేటర్లు గుజ్జల నారాయణరావు, మారోజు శ్రీనివాసరావు, జీవీ రంగారావు, ఎన్ని లక్ష్మణరావు, పతివాడ గణపతి, పార్టీ నాయకులు కనకల కృష్ణ, యడ్ల రాజేష్, కొసర నారాయణరావు, పలు డివిజన్లు, గ్రామాల నుంచి బీసీ సంఘం నేతలు ఉన్నారు.


భోగాపురం: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ

భోగాపురంలో...

భోగాపురం: నేడు విజయవాడలో జరగబోయే జయహో బీసీ మహాసభకు భోగాపురం మండలం నుంచి బీసీ నాయకులు మంగళవారం బస్సులపై బయలుదేరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, వైస్ ఎంపీపీ దంతులూరి రావాడబాబు, పడాల బానుప్రకాశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే వచ్చాం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 37వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం


ప్రజలతో ప్రభుత్వ పథకాల తీరుపై మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం రూరల్: ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయని అడగడానికే వచ్చామని, ఓట్ల కోసం రాలేదని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 37వ డివిజన్‌లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్సాహభరితంగా సాగిన కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల డివిజన్ పరిధిలోని స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో విద్యుత్ తీగలు ఇళ్ల మధ్యలో విద్యుత్ తీగలు ఉండడాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్తూ ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రత్యేక చొరవతో నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామని నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు తెలిపారు. జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల స్పందన అనూహ్యంగా ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్థానిక శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామికి ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్ కడియాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముస్లిం సమాజం పాల్గొనాలి

- జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు రఫీక్

విజయనగరం టౌన్: కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో జమాతే ఇస్లామీ హింద్ సేవకులు చేసిన సేవలు అనిర్వచనీయమని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ పేర్కొన్నారు. స్థానిక కంటోన్మెంట్ యూత్ హాస్టల్‌లో మంగళవారం క్యాడర్ మీట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను కులమతాలకు అతీతంగా చేయాలని సూచించారు. ముస్లిం సమాజం సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొనాలని కోరారు. సమాజంలో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. విద్య, ఉపాధి, సాంకేతిక, సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలన్నారు. సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు రఫీక్

యూఎస్ సంస్థతో ఉన్నత విద్యామండలి ఎంవోయూ

సాక్షి, అమరావతి : ఉన్నత విద్యా కోర్సుల్లో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు అమెరికా మేరీల్యాండ్‌లోని కాన్‌స్టిట్యూషన్ ఫౌండేషన్ (డీబీఏ సాయ్‌ల అకాడమీ)తో ఉన్నత విద్యామండలి సోమవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థ విద్యార్థులకు 30కిపైగా కోర్సులను అందించనుంది. 21వ శతాబ్దపు నైపుణ్యాలు, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఇంగ్లిష్ స్కిల్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, ఎకనమిక్స్, పొలిటికల్ సైన్స్ వంటి అంశాల్లో ఈ కోర్సులను ఉచితంగా అందించనుంది. చాయిస్ బేస్డ్ క్రెడిట్ విధానంలోని ఈ కోర్సుల్లో క్రెడిట్లను ఏపీలోని వర్సిటీలకు బదలాయించే అవకాశాన్ని కల్పించనున్నారు. స్వయం అభ్యసన విధానంలోని ఈ కోర్సుల్లో విద్యార్థులు ఎన్నిసార్లు అయినా పరీక్షలు రాయవచ్చు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే 70% మార్కులు రావాలి. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి సమక్షంలో మండలి కార్యదర్శి నజీర్ అహ్మద్, సాయ్‌లర్ అకాడమీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ జెఫ్రీ ఎస్.డేవిడ్‌సన్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు, సాయ్‌ల అకాడమీ ఇండియా ప్రతినిధి అర్చనా థాక్రాన్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ రోగుల హక్కుల రక్షణకు 'అంబుడ్స్‌మన్'

సాక్షి, అమరావతి : హెచ్ఐవీ/ఎయిడ్స్ రోగుల హక్కుల రక్షణకు అంబుడ్స్‌మన్ నియామకానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. హెచ్ఐవీ బాధితులు ఎక్కడ ఏ సమస్య వచ్చినా అంబుడ్స్‌మన్ ద్వారా న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుంది. ది హ్యూమన్ ఇమ్యూనో డెఫీషియన్సీ వైరస్ అండ్ అక్వైర్డ్ ఇమ్యూనో డెఫీషియన్సీ సిండ్రోమ్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్) – 2017 చట్టంలోని నిబంధనల మేరకు జారీ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో జిల్లా డీఎంహెచ్‌వోలు అంబుడ్స్‌మన్‌గా వ్యవహరిస్తారు. పని ప్రదేశాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశాల్లో ఎక్కడైనా వివక్షకు గురైన పాజిటివ్ రోగులు ఆయా జిల్లాల డీఎంహెచ్‌వోలకు ఫిర్యాదు చేయవచ్చు. వివక్ష ఘటన జరిగిన మూడు నెలల్లోపు డీఎంహెచ్‌వోల ఎదుట ఫిర్యాదు చేయవచ్చు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆరు నెలల్లోపు ఫిర్యాదులు స్వీకరించే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. మెడికల్ ఎమర్జెన్సీ సందర్భాలలో అంబుడ్స్‌మన్ లేదా అతని సహాయకుడు ఫిర్యాదుదారుని ఉల్లంఘన ఆరోపించిన ప్రదేశాలను సందర్శించి విచారణ చేపట్టవచ్చు. ఫిర్యాదుల స్వీకరణ.. వాటిని రికార్డు చేసి విచారించడం వంటివి ఉత్తర్వుల్లో సూచించారు.

పైడితల్లి సేవలో...


పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారి సేవలో భక్తులు తరించారు. అమ్మవారికి ప్రీతికరమైన మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారికి పసుపుకుంకుమలు సమర్పించారు. అభిషేకాలు జరిపారు. కోళ్లను, చీరలను చూపించి మొక్కుబడులు చెల్లించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, అర్చకులు తాళ్లపూడి ధనుంజయ్, దూసి శివప్రసాద్ శర్మ, శంబర కృష్ణలు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాధికాలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు.

మిస్సింగ్ కేసు నమోదు


అదృశ్యమైన తట్టయ్య

సీతంపేట: రెండు రోజుల కిందట స్థానిక ఏరియా ఆస్పత్రి నుంచి వ్యక్తి అదృశ్యమైనట్లు అతని కుటుంబ సభ్యులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని సిరికొండ ఒబ్బంగి గ్రామానికి చెందిన కొండగొర్రి తట్టయ్య రెండు రోజుల కిందట అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. అనంతరం అదృశ్యమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఎస్సై జీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో విజిలెన్స్ సీఐ సింహాచలం

గరుగుబిల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో విజిలెన్స్ సీఐ వి.సింహాచలం ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. గ్రామంలోని ఓ ఇంట్లో 177 ప్లాస్టిక్ సంచులలో అక్రమంగా నిల్వ చేసిన 8950 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గొడౌన్‌కు తరలించారు. సంబంధిత వ్యక్తులపై 6ఎ కేసు నమోదు చేశారు. పేదల కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, తరలించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై చర్యలు కఠినంగా ఉంటాయని సీఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో సీఎస్ డీటీ రమణారావు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

మలుపు తిరిగిన ఏపీహెచ్ఏఏ ఎన్నికల వ్యవహారం

జస్టిస్ దేవానంద్ ఉత్తర్వులపై స్టే విధించిన సీజే ధర్మాసనం

- బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు ఏకపక్ష తీరుపై ఆక్షేపణ
- పదవీ కాలాన్ని 2023 వరకు పొడిగించినప్పుడు అడ్‌హాక్ కమిటీ ఎందుకని ప్రశ్న
- రెండు వర్గాల వివాదంలో కోర్టుల జోక్యం తగదని వెల్లడి
- ఎన్నికలకు షెడ్యూల్ ఇవ్వాలని కార్యవర్గానికి స్పష్టీకరణ
- తదుపరి విచారణలో ఎన్నికలపై ఆదేశాలిస్తామని వెల్లడి
- విచారణ ఈ నెల 14కి వాయిదా



సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం (ఏపీహెచ్ఏఏ) కార్యవర్గం ఎన్నికల వ్యవహారం మరో మలుపు తిరిగింది. సంఘం కార్యకలాపాలు, ఎన్నికల నిర్వహణకు ఏడుగురు న్యాయవాదులతో రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నియమించిన అడ్‌హాక్ కమిటీ తక్షణమే కార్యవర్గం నుంచి బాధ్యతలు చేపట్టాలని ఆదేశిస్తూ సింగిల్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు ధర్మాసనం స్టే విధించింది. బార్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో చర్చించకుండా అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు చేస్తూ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, ఘోర తప్పిదానికి పాల్పడ్డారని ధర్మాసనం తప్పుపట్టింది. పైగా, తెలంగాణ బార్ కౌన్సిల్‌లో నమోదైన ఓ న్యాయవాదికి ఈ కమిటీలో ఎలా స్థానం కల్పిస్తారని చైర్మన్‌ను నిలదీసింది. ప్రస్తుత కార్యవర్గం పదవీ కాలాన్ని 2023 వరకు పొడిగిస్తూ కౌన్సిల్ చేసిన తీర్మానం అమల్లో ఉన్నప్పుడు, అందుకు విరుద్ధంగా అడ్‌హాక్ కమిటీని ఎలా నియమిస్తారని ప్రశ్నించింది. రెండు వర్గాల మధ్య వివాదంలో న్యాయస్థానాల జోక్యం హర్షణీయం కాదంది. వారి వ్యవహారాలను చక్కబెట్టుకోగల సమర్థత న్యాయవాదులకు ఉందని తెలిపింది. ఎన్నికలు నిర్వహించలేదని ఓ వర్గం చేసిన ఫిర్యాదుపై మరో వర్గానికి వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని చెప్పింది. ఉదయం ఫిర్యాదు ఇస్తే, సాయంత్రంకల్లా ఉత్తర్వులు జారీ చేయడం సరికాదంది. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని చెప్పింది. ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని, తదుపరి విచారణ సమయంలో ఎన్నికల షెడ్యూల్‌ను తమ ముందుంచాలని ప్రస్తుత కార్యవర్గాన్ని ఆదేశించింది. దాని ఆధారంగా ఎన్నికల నిర్వహణకు ఆదేశాలు జారీ చేస్తామంది. తదుపరి విచారణను ఈ నెల 14కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

తక్షణమే బాధ్యతలు తీసుకోవాలన్న ఉత్తర్వులపై అప్పీళ్లు

హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం పదవీ కాలం మార్చి 31నే ముగిసినప్పటికీ, ఎన్నికలకు బార్ కౌన్సిల్ చర్యలు తీసుకోలేదని, తమ ఫిర్యాదునూ పట్టించుకోలేదని న్యాయవాది ఎస్.వి జయభాస్కర్ దాఖలు చేసిన వ్యాజ్యంపై జస్టిస్ దేవానంద్ ఇటీవల విచారణ జరిపారు. పిటిషనర్ ఫిర్యాదుపై తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని బార్ కౌన్సిల్‌ను ఆదేశించారు. ఈ ఆదేశాలతో చైర్మన్ అడ్‌హాక్ కమిటీని నియమించారు. వెంటనే కార్యవర్గం నుంచి బాధ్యతలు తీసుకోవాలని కమిటీని ఆదేశిస్తూ జస్టిస్ దేవానంద్ ఈ నెల 1న ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రస్తుత కార్యవర్గం అధ్యక్షుడు కె.జానకిరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనపల్లి నర్సిరెడ్డి వేర్వేరుగా ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లపై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది.

మొత్తం కేసును మూడు రోజుల్లో ముగించేశారు

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండానే సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. సంఘాన్ని వివాదంలోకి లాగడం దురదృష్టకరమన్నారు. సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీవోపీ) వివరాలను బార్ కౌన్సిల్ ఇవ్వకపోవడం వల్ల ఎన్నికలు ఆలస్యమవుతున్నాయని అన్నారు. సింగిల్‌జడ్జి ముందు బార్ కౌన్సిల్ ఎలాంటి కౌంటర్ దాఖలు చేయలేదని, మూడు రోజుల్లోనే కేసును ముగించేశారని వివరించారు. విజయ్‌భాస్కర్ తరఫు న్యాయవాది చాపర్ల సీతారాం వాదనలు వినిపిస్తూ.. ఎన్నికలు నిర్వహించలేదని ఫిర్యాదు వచ్చినప్పుడు అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు అధికారం చైర్మన్‌కు ఉందన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. కార్యవర్గం కాల పరిమితిని పొడిగించిన తరువాత అడ్‌హాక్ కమిటీని ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించింది. 2023 మార్చి తరువాత కూడా ఎన్నికలు పెట్టకపోతే అప్పుడు స్పందిస్తే అర్థం ఉంటుందని తెలిపింది. ఎన్నికలు నిర్వహించకపోవడం ఎవరికీ మంచిది కాదంది. ఏకపక్ష చర్యలు ఆరోగ్యకర వాతావరణాన్ని పాడు చేస్తాయని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని, భయపడటం లేదని మోహన్‌రెడ్డి సమాధానమిచ్చారు.

తెలంగాణ

హైటెక్ సెక్స్ రాకెట్

▶ మొదటి పేజీ తరువాయి

సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మంగళవారం మీడియాకు వెల్లడించారు.

హోటల్ వర్కర్‌గా పనిచేస్తూ వ్యభిచారం దందా వైపు..

బేగంపేటకు చెందిన మహ్మద్ సల్మాన్ ఖాన్ అలియాస్ సమీర్ 2016–19 మధ్యకాలంలో సోమాజిగూడలోని కత్రియా, పార్క్ హోటళ్లలో పనిచేశాడు. అప్పట్లో వ్యభిచార ముఠా బాధితురాలు ఒకరు ఓ హోటల్లో బస చేయడం గమనించిన సమీర్.. సులభంగా డబ్బు సంపాదించేందుకు ఈ దందా చేయాలని నిర్ణయించుకున్నాడు. డ్రగ్స్ అలవాటు ఉన్న సమీర్‌కు మరో డ్రగ్ వినియోగదారుడు, మాసాబ్ ట్యాంక్‌కు చెందిన మహ్మద్ అదీమ్ అలియాస్ అర్నవ్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి 2016 నుంచి సోమాజిగూడ కేంద్రంగా వ్యభిచారం నిర్వహించడం మొదలుపెట్టారు. వీరితో పాటు మొత్తం 17 మంది ప్రధాన ఆర్గనైజర్లు వేర్వేరు రాష్ట్రాలలో వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా దందా సాగిస్తున్నారు. ఒక్కో వాట్సాప్ గ్రూప్‌లో 300 మంది ఆర్గనైజర్లు సభ్యులుగా ఉన్నారు. వీటిద్వారా మొత్తం 14,190 మంది యువతులతో వ్యభిచారం సాగిస్తున్నారు.

ముఠా దొరికింది ఇలా...

ఇటీవల వ్యభిచారం చేస్తూ పట్టుబడిన యువతులను విచారించిన పోలీసులు.. గత నెల 15న బేగంపేటకు చెందిన సల్మాన్, పీఅండ్‌టీ సన్‌సిటీకి చెందిన మహ్మద్ అబ్దుల్ కరీంలను అదుపులోకి తీసుకున్నారు. వీరి విచారణలో దేశ వ్యాప్తంగా నెట్‌వర్క్ ఉన్న ఆర్గనైజర్ల జాబితా వెలుగులోకొచ్చింది. దీంతో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందాన్ని ఏర్పాటు చేసి.. సల్మాన్, కరీంతో పాటు పలువురు ముఠా సభ్యులను అరెస్టు చేశారు. వీరిలో రాడిసన్ బ్లూ హోటల్ మేనేజర్ రాకేష్‌తో పాటు మాసాబ్‌ట్యాంక్‌కు చెందిన అర్నవ్, టోలిచౌకికి చెందిన మహ్మద్ సమీర్, సోమాజిగూడకు చెందిన హర్విందర్ కౌర్ అలియాస్ సిమ్రాన్ కౌర్, ఎస్ఆర్‌నగర్‌కు చెందిన యరసారి జోగేశ్వర్‌రావు, బాలానగర్‌కు చెందిన నడింపల్లి సాయిబాబాగౌడ్, సన్‌సిటీకి చెందిన శైలేంద్ర ప్రసాద్, మహ్మద్ అఫ్సర్, పసుపులేటి గంగాధరి, ఆసిఫ్‌నగర్‌కు చెందిన రిషీ, కోడి శ్రీనివాస్, అలీసామ్, మహ్మద్ ఫయాజ్, విష్ణు, సాయి సుధీర్, సర్వేశ్వర్ రాట్‌లున్నారు. వీరు సైబరాబాద్, హైదరాబాద్ పోలీసు కమిషనరేట్లలో 39 కేసులలో నిందితులుగా ఉన్నారు. తాజాగా వీరిపై గచ్చిబౌలి, మాదాపూర్, మియాపూర్, కూకట్‌పల్లి ఠాణాలలో ఐదు కేసులు నమోదు చేశారు. నిందితుల నుంచి రూ.95 వేలు, 34 సెల్‌ఫోన్లు, 3 కార్లు, ల్యాప్‌టాప్, 2.5 గ్రాముల ఎండీఎంఏ (మాదకద్రవ్యం)ను స్వాధీనం చేసుకున్నారు.

దందా సాగుతోందిలా..

ఆర్గనైజర్ల కింద ఉండే బ్రోకర్లు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పేద మహిళలకు ఎర వేస్తారు. ఆ తర్వాత బలవంతంగా వ్యభిచార కూపంలోకి దింపుతారు. బాధిత అమ్మాయిల ఫొటోలు, వివరాలు దేశ వ్యాప్తంగా ఉన్న వాట్సాప్ గ్రూప్‌లలో పెడతారు. లొకాంటో, స్కోక్కా, మైహెవెన్‌మోడల్స్.కామ్, నటాషారాయ్.ఇన్ వంటి కాల్‌గరల్స్ వెబ్‌సైట్లలోనూ పోస్ట్ చేస్తారు. వీటిని చూసిన విటులు తమకు నచ్చిన యువతుల కోసం అందులోని వాట్సాప్ నంబర్లకు ఫోన్ చేస్తారు. కాల్ సెంటర్ల ప్రతినిధులు అమ్మాయిల వివరాలు, రేట్లను తెలిపి.. ఏ హోటల్‌కు వెళ్లాలో సూచిస్తారు. డీల్ కుదిరాక నగదు లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయాలి. అందులో 30 శాతం యువతికి, 35 శాతం అమ్మాయిల ఫొటోలను ప్రచారం చేసేవారికి, కాల్ సెంటర్ ప్రతినిధులకు ఇస్తారు. మిగతా 35 శాతం నిర్వాహకులు వాటాలుగా పంచుకుంటారు. కాగా, విటులతో సంప్రదింపుల కోసం నిర్వాహకులు హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరుల్లో కాల్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, కోల్‌కతా, అసోం రాష్ట్రాల యువతులతో పాటు థాయ్‌లాండ్, నేపాల్, బంగ్లాదేశ్, ఉజ్బెకిస్తాన్, రష్యా దేశాల మహిళలతో వ్యభిచారం నిర్వహిస్తున్నారు. విదేశీ మహిళలకు నకిలీ పాస్‌పోర్టులు, ఆధార్ కార్డులు సృష్టించి వివిధ నగరాలకు తరలిస్తున్నారు.

విభజన చట్టాన్ని సవరించాలి

- అఖిలపక్ష సమావేశంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టాన్ని సవరించి ప్రత్యేకహోదాను అందులో చేర్చాలని వైఎస్సార్‌సీపీ డిమాండు చేసింది. పోలవరం సవరించిన అంచనాల మొత్తాన్ని కూడా సవరణ బిల్లులో చేర్చాలని కోరింది. ఢిల్లీలో మంగళవారం రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో వైఎస్సార్‌సీపీ తరఫున పార్లమెంట్‌లో పార్టీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రానికి సంబంధించిన ప్రాధాన్య అంశాలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జి–20 సదస్సు సందర్భంగా రాష్ట్రానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ధరల పెరుగుదల, పెట్రోలు డీజిలు ధరల తగ్గింపు, అన్ని పంటలకు మద్దతు ధర తదితర అంశాలు ప్రస్తావించారు. అనంతరం మార్గాని భరత్‌రామ్ ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఏపీకి సంబంధించిన పలు అంశాలు అఖిలపక్షం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. శీతాకాల సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాలే వైఎస్సార్‌సీపీ అజెండా అని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు రాష్ట్రాభివృద్ధి నిమిత్తం పార్లమెంట్‌లో అన్ని అంశాలు ప్రస్తావిస్తామని చెప్పారు.

బీసీల వాణి, రిజర్వేషన్ల అవసరం పార్లమెంట్‌లో లేవనెత్తుతాం

'ఆక్వారంగ ఎగుమతుల్లో సింహభాగం పాత్ర పోషిస్తున్న ఏపీకి ఫిషింగ్ హార్బర్ల అంశంలో కేంద్రం మద్దతు ఇవ్వాలి. అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన దిశ బిల్లు ఆమోదించాలి. ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ ఇప్పటికే ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టింది. స్వాతంత్ర్యం వచ్చాక బీసీలకు అధికంగా ప్రాధాన్యం ఇచ్చింది సీఎం జగన్ ఒక్కరే. ప్రత్యేకహోదా విషయంలో చంద్రబాబు రెండునాల్కల ధోరణితో వ్యవహరించారు' అని భరత్‌రామ్ పేర్కొన్నారు.

ఫలానా దర్యాప్తే కావాలని నిందితులు కోరలేరు

హైకోర్టులో ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు

సాక్షి, హైదరాబాద్: ఏ కేసులో అయినా నిందితులు తమకు ఫలానా సంస్థతో మాత్రమే దర్యాప్తు జరిపించాలని కోరలేరని, ఇదే విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు చెప్పిందని హైకోర్టులో ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే వాదనలు వినిపించారు. 41ఏ ప్రకారం నోటీసులు ఇచ్చి.. వారు స్పందించనప్పుడు అరెస్టు చేసే అధికారం దర్యాప్తు అధికారులకు ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలకు ఎర కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కోర్టులను ఉపయోగించుకొని విచారణను ఆలస్యం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలకు ఎర కేసును సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ సాగించాలని బీజేపీ నేత గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు నిందితులు రామచంద్రభారతి, సింహయాజీ, నందుకుమార్, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. బీజేపీ తరఫున సీనియర్ న్యాయవాది ప్రభాకర్, భారత్ ధర్మ జనసేన అధ్యక్షుడు తుషార్ తరఫున సీనియర్ న్యాయవాది హెగ్డే, అడ్వొకేట్ భూసారపు శ్రీనివాస్ తరఫున సీనియర్ న్యాయవాది ఉదయ హొల్లా, ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది దవే వాదనలు వినిపించారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను నేటికి వాయిదా వేశారు.

అభివృద్ధి అడుగులు

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటు తరువాత జిల్లా కేంద్రంలో అన్ని విధాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులు ప్రణాళికలు రచించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పనులు చకచకా పూర్తిచేస్తున్నారు. రానున్న రోజుల్లో జిల్లా కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.


పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం వ్యూ

- పార్వతీపురం రూపురేఖలు మారుతున్నాయి...
- జిల్లా కేంద్రంలో క్లాక్ టవర్ ఏర్పాటుకు చర్యలు
- పార్కులు, రహదారుల అభివృద్ధికి రూ.2 కోట్లు
- మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.64.25 కోట్లు
- వైద్య కళాశాలకు రూ.600 కోట్లు మంజూరు

అన్ని రంగాల్లో అభివృద్ధి



పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా పార్వతీపురం ఆవిర్భవించిన తరువాత ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో పార్వతీపురం పట్టణాన్ని తీర్చిదిద్దుతున్నాం. పట్టణంతో పాటు జిల్లాలోని మిగతా మూడు నియోజకవర్గాల్లో అవసరమైన మేరకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన అభివృద్ధికి పథక రచన చేశాం. అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించాం. ప్రజల ఆహ్లాదం మొదలుకొని ప్రభుత్వ కార్యకలాపాల వరకు అన్ని పనులు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. – నిషాంత్ కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

పార్వతీపురం టౌన్: కొత్తగా ఏర్పడిన పార్వతీపురం జిల్లా ప్రగతి పట్టాలెక్కుతోంది. దీనికోసం అధికార యంత్రాంగం అవిశ్రాంతంగా కృషిచేస్తోంది. జిల్లా కేంద్రాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటూ జిల్లాకు సంబంధించి అన్ని ప్రధాన కార్యాలయాలు పట్టణంలోనే ఏర్పాటయ్యాయి. అన్ని రంగాల్లోనూ జిల్లా అభివృద్ధికి పక్కా ప్రణాళికతో అధికార యంత్రాంగం ముందుకు సాగుతోంది. ప్రగతి ప్రణాళికలను వడివడిగా అమలుచేస్తోంది.

కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు

జిల్లా ఏర్పడిన మరుక్షణం నుంచే జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయాలను, క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేశారు. గతంలో ఐటీడీఏ కార్యాలయానికి నిర్మించిన కట్టడాన్ని కలెక్టర్ కార్యాలయంగా ఏర్పాటు చేశారు. స్థానికంగా సుమారు రెండెకరాల విస్తీర్ణంలో ఉన్న వైటీసీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ కార్యాలయంగా మార్చారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న ఐదెకరాలలో ఉన్న ఆర్‌సీఎం పాఠశాలను జిల్లా ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలుగా తీర్చిదిద్ది ప్రజలకు సేవలందిస్తున్నారు.

గిరిజన ఆరోగ్యానికి పెద్దపీట

అనారోగ్య కారణంతో ఏ ఒక్కరు ఇబ్బందులు గురికాకుండా ఉండేందుకు పార్వతీపురం మన్యం జిల్లాకు పూర్తి స్థాయి చర్యలు చేపడుతున్నారు. అత్యవసర సేవల కోసం, అనారోగ్యంతో విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలకు వెళ్లకుండా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోనే అన్ని ఆరోగ్య సేవలను పేదలకు, సామాన్యులకు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకుగాను వైద్య కళాశాల ఏర్పాటుకు రూ.600 కోట్లు నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. రూ.64.25 కోట్లతో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలను చేపట్టింది. జిల్లా ఆస్పత్రి సమీపంలో గల ఏడెకరాల విస్తీర్ణంలో ఉన్న పురాతన ప్రభుత్వ భవనాలను తొలగించి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టారు. ఆస్పత్రి మొదటి దశ పనులు పూర్తయ్యాయి. రెండోదశ పనులు ప్రారంభించి త్వరలోనే సంపూర్ణ వైద్య సేవలు రోగులు అందించేందుకు జిల్లా కేంద్రంలో చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆహ్లాదానికి పార్కులు

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం మున్సిపాలిటీ ప్రజల ఆహ్లాదంగా గడిపేందుకు వీలుగా సన్యాసిరాజు స్మారక పార్కును రూ.40లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టి పూర్తి చేశారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు, క్రీడల నిర్వహణకు అనువుగా తీర్చిదిద్దారు. కొత్తవలస శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోఉన్న మైదానాన్ని అభివృద్ధి పరిచారు. పట్టణంలో ఉన్న చెరువులను అమృత్ సరోవర్ పథకం ద్వారా అభివృద్ధి పరచి ప్రతీ చెరువు వద్ద వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణాలను చేపట్టారు.

గంట స్తంభం ఏర్పాటుకు చర్యలు

జిల్లా కేంద్రంలో గంట స్తంభం నిర్మాణానికి కలెక్టర్ నిషాంత్‌కుమార్ పూర్తి చర్యలు చేపట్టారు. గంట స్తంభం ఏర్పాటుకు పట్టణ, జిల్లా ప్రజల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవడంతో పాటు నమూనాకు సంబంధించి అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయ్యేనాటికి గంట స్తంభం నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు రూపొందించామన్నారు.

రహదారులు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

జిల్లా కేంద్రంలో, జిల్లాలో రహదారుల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనులను చేపట్టారు. జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు రూ. 2కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం పనులను చేపట్టారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.


కలెక్టర్ కార్యాలయం



జిల్లా ఆస్పత్రి

ఆర్థికాభ్యున్నతికి తోడ్పడాలి

- కలెక్టర్ నిషాంత్ కుమార్
- బ్యాంకర్లతో సమావేశం


బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో ఆర్థికాభ్యున్నతికి బ్యాంకులు తోడ్పడాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ బ్యాంకర్లను కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్థిక ప్రగతి రావాలని ఇందుకు బ్యాంకులు సానుకూల దృక్పథంతో ఉండాలని పిలుపునిచ్చారు. రుణాల మంజూరును వేగవంతం చేసి ఔత్సాహికులను ప్రోత్సహించాలని సూచించారు. బ్యాంకు శాఖలను ఏర్పాటు చేసి ప్రజలకు బ్యాంకుల సేవలు దగ్గర చేయాలని ఆకాంక్షించారు. సంబంధిత శాఖలు యూనిట్ల ఏర్పాటులో జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. లబ్ధిదారులను సకాలంలో గుర్తించి బ్యాంకుల నుంచి రుణాలు మంజూరుకు సమన్వయం చేయాలన్నారు. జిల్లాలో పాడి ఆవులు, చేపల యూనిట్లను ఏర్పాటు చేయడంలో సంబంధిత శాఖలు వేగంగా స్పందించాలని కోరారు. రైతుల ఆదాయం పెరగాలని కుటుంబాలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. స్టాండప్ ఇండియా, స్వనిధి, పీఎంఈజీపీ తదితర కార్యక్రమాలపై దృష్టి సారించాలని చెప్పారు.

బ్యాంకు శాఖలు ఏర్పాటు చేయాలి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎస్. మూర్తి మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలకు సెప్టెంబరు నెలాఖరుకు రూ.186.43 కోట్లు లక్ష్యం కాగా రూ.113 కోట్లను, ప్రాధాన్యం లేని రంగాలకు రూ.39 కోట్లకు గాను రూ.41 కోట్లను వెరసి రూ.225.59 కోట్లకు గాను రూ.154 కోట్లను రుణాలుగా అందించినట్లు వివరించారు. జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, పాచిపెంట, భామిని మండలాల్లో జనాభాకు తగిన విధంగా బ్యాంకింగ్ సేవలు అందించేందుకు ఆరు శాఖలను ఏర్పాటు చేయాల్సి ఉందని, బ్యాంకు నియంత్రణ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జగనన్న తోడు పథకం కింద 4,868 దరఖాస్తులు అందాయని వాటిలో 3,887 మంజూరయ్యాయని తెలిపారు. నవరత్నాలు పథకాల్లో పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులకు అదనంగా రూ.35వేలు రుణం మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ నాగ ప్రవీణ్, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి నాగార్జున, ఎస్‌బీఐ, యూబీఐ, ఏపీజీవీబీ కంట్రోలర్లు వరుసగా వెంకటేష్ దేశాయ్, సవ్యసాచి దాస్, బి.రాఘవేంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎ.ఈశ్వర రావు, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారాం, సంబంధిత అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రంగా అవంతి కళాశాల


ట్రైనింగ్ కేంద్రంగా ఎంపిక చేసిన అగ్రిమెంట్‌తో ప్రిన్సిపాల్, ఆ సంస్థ జిల్లా సమన్వయకర్తలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): హిందుస్తాన్ రోవర్స్ అండ్ రేంజర్స్ అసోసియేషన్ ట్రైనింగ్ కేంద్రంగా గరివిడి అవంతి సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలను ఎంపిక చేయడం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ డా.జాషువా జయప్రసాద్ తెలిపారు. కళాశాలలో మంగళవారం ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవారని, ఇప్పుడు కళాశాల స్థాయి విద్యార్థులకు శిక్షణలు సాగుతాయని తెలిపారు. విజయనగరం జేఎన్‌టీయూ జీవీ తర్వాత అవంతీ కళాశాల ట్రైనింగ్ కేంద్రంగా ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. శిక్షణలో భాగంగా విద్యార్థులకు మూడు స్థాయిలలో పరీక్షలు నిర్వహిస్తారని, ప్రతిభ చూపేవారికి గవర్నర్ చేతుల మీదుగా ద్రోణాచార్య అవార్డు, ప్రశంసా పత్రాలు అందజేస్తారని చెప్పారు. బస్సు టిక్కెట్లలో 50 శాతం రాయితీని వర్తింపజేస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, ఆయా కేంద్రాల జిల్లా సమన్వయకర్త శ్రీనివాస్ చౌదరి, రిసోర్సుపర్సన్ రామకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
బుధవారం ॥ 7-12-2022

త్రిష, షబ్నమ్... 'తెలుగుతేజాలు' అంటూ వార్తల్లో పతాక శీర్షికలో వెలుగుతున్న క్రీడాకారిణులిద్దరూ. మహిళల అండర్ 19 కేటగిరీలో టీ 20 వరల్డ్ కప్ క్రికెట్‌కు ఎంపికైన ఇండియా జట్టులో స్థానం సంపాదించుకున్న తెలుగమ్మాయిలు వీళ్లు. త్రిష భద్రాచలం అమ్మాయి, షబ్నమ్ వైజాగ్ అమ్మాయి.


త్రిష



షబ్నమ్

టీ 20 అండర్ 19 వరల్డ్ కప్‌లో

మన చిచ్చర పిడుగులు

ఇటీవల ముగిసిన దేశవాళీ క్రికెట్ టోర్నీల్లో తన బ్యాట్‌తో అందరినీ ఆకట్టుకున్న హైదరాబాద్ క్రికెటర్ త్రిష దక్షిణాఫ్రికాలో జనవరి 14 నుంచి 29 వరకు జరగనున్న టీ 20 ప్రపంచకప్‌లో పాల్గొనే భారత అండర్ -19 మహిళల క్రికెట్ జట్టుకు ఎంపికైంది.

డిసెంబరు 17 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే టీ 20 సీరీస్‌లో పాల్గొనే జట్టులో కూడా చోటు దక్కించుకుని తెలంగాణ నుంచి మరో మిథాలీ రాజ్ అంటూ ప్రశంసలు అందుకుంటోంది త్రిష. ఈ సందర్భంగా తన ఆనందాన్ని 'సాక్షి'తో పంచుకుంది.

తండ్రే గురువు

వృత్తిరీత్యా ఫిట్‌నెస్ కోచ్ అయిన తండ్రి నుంచి త్రిష క్రికెట్‌లో ఓనమాలు దిద్దింది. భద్రాచలంలో తండ్రి రామిరెడ్డి ద్వారా మూడేళ్ల వయసులో క్రికెట్‌కు పరిచయమైన త్రిష ఎనిమిదేళ్ల వయసులో హైదరాబాద్ అండర్ -16 జట్టులో చేరింది. ఆమెలోని ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు హైదరాబాద్ సెయింట్ జాన్స్ క్రికెట్ అకాడమీలో ఆమెను చేర్చారు. అక్కడ ఆమె కోచ్‌లందరినీ ఆకట్టుకుంది. సెయింట్ జాన్స్‌లో కోచ్ ఆధ్వర్యంలో తనను తాను మేటి క్రీడాకారిణిగా తీర్చిదిద్దుకుంది. ఆమె తన 12 సంవత్సరాల వయస్సులో సీనియర్స్ రాష్ట్ర జట్టులో చేరింది.



> నేను భద్రాచలంలో ఫిట్‌నెస్ కోచ్‌గా ఉండేవాడిని. త్రిష మాకు ఏకైక సంతానం. త్రిష అమ్మ తనకు కావల్సిన పోషకాహారంపై దృష్టి పెడితే, నేను తను క్రీడల్లో శిక్షణ ఎలా ఉందో చూసేవాడిని. తనని మంచి క్రీడాకారిణిగా చూడాలనుకున్నాను. ఇంకెన్నో విజయాలు సాధించాలన్నదే మా కల.
> – గొంగడి రామిరెడ్డి

మిథాలీకి అభిమానిని..

'భారత జట్టులో చోటు దక్కించుకోవడంతో సంతోషిస్తున్నాను. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నా..' అని ఆనందాన్ని వ్యక్తం చేసింది ఈ ఓపెనింగ్ బ్యాట్ ఉమెన్, లెగ్ స్పిన్నర్. కిందటి నెలలో విశాఖపట్నంలో జరిగిన క్వాడ్రాంగులర్ సిరీస్‌లో స్థానం దక్కించుకుంది.

వెస్టిండీస్, శ్రీలంక, ఇండియా 'ఎ', ఇండియా 'బి' జట్లతో కూడిన సిరీస్‌లో ఇండియన్ జెర్సీ ధరించడం చాలా థ్రిల్లింగ్‌గా ఉంది అంటోంది త్రిష. ''తొలి మహిళా క్రికెట్ సంచలనం మిథాలీ రాజ్, ఎం.ఎస్ ధోనీకి పెద్ద అభిమానిని. వారి నుంచే ఎంతో నేర్చుకున్నాను. వారి వల్లే నా ఆటను అద్భుతంగా మార్చుకునే ప్రయత్నం ఎప్పుడూ చేస్తుంటాను. ఉదాహరణకు ఒక విషయం చెబుతాను... ఒకరోజు మిథాలీని ఓ అబ్బాయి ప్రశ్నిస్తూ గ్రౌండ్‌లో ఎవరు బౌలింగ్ చేస్తుంటారని అడిగాడట. ఎవరు బౌలింగ్ చేస్తున్నారో తాను ఎప్పుడూ చూడనని, తన వద్దకు వచ్చే బంతిని మాత్రమే చూస్తానని మిథాలీ అతనితో చెప్పారట.. ఈ విషయం ఆమే చెప్పారు. ఇలాంటి సంఘటనలు ఎంతో స్ఫూర్తినిస్తాయి. ఆమెను చూసి నేను నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది'' అంటున్న త్రిష... తన దృష్టి మొత్తం ప్రపంచకప్‌లో రాణించడంపైనే ఉందని తెలిపింది. తన విజయంపై ఆమె దృష్టి మాత్రమే కాదు తెలుగు మహిళల అందరి దృష్టీ ఉందని చెబుతూ బెస్టాఫ్ లక్.

– నిర్మలారెడ్డి

2016లో ఎనిమిదేళ్ల వయసులో క్రికెట్ ప్రాక్టీస్ మొదలు పెట్టిన షబ్నమ్ 2019లో స్టేట్‌ని రిప్రజెంట్ చేసింది. చాలెంజర్స్ ట్రోఫీ, జడ్‌సీఏ, ఎన్‌సీఏ హై పెర్ఫార్మెన్స్ క్యాంప్, రంజీట్రోఫీలో ఒక మ్యాచ్‌లో రెండు వికెట్‌లు తీసుకున్న షబ్నమ్‌కి బౌలింగ్ ఇష్టం. న్యూజిలాండ్ సీరీస్‌లో మూడు వికెట్‌లు తీసుకుంది. ఆమె110- 115 స్పీడ్‌తో బౌలింగ్ చేస్తుంది, బౌలింగ్‌కి 20 మీటర్స్ నుంచి రన్ అప్ తీసుకుంటుంది. క్వాడ్రాంగులర్ సీరీస్‌లో శ్రీలంక, వెస్ట్ ఇండీస్ దేశాలతో ఆడిన షబ్నమ్ నిన్నటి వరకు (డిసెంబర్ 6) టీ20 సీరీస్‌లో న్యూజిలాండ్‌తో ఆడింది. వరల్డ్ కప్‌కి ఎంపిక అయిన సందర్భంగా ఆమె ముంబయి నుంచి సాక్షితో తన సంతోషాన్ని పంచుకుంది.

ప్రాక్టీస్ మానదు

షబ్నమ్ క్రికెట్ జర్నీ గురించి ఆమె తల్లి ఈశ్వరమ్మ మాట్లాడుతూ ''మా పెద్దమ్మాయి. తను రోజూ ఉదయం ఐదున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు, సాయంత్రం ఐదున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ప్రాక్టీస్ చేస్తుంది. క్రికెట్ ప్రాక్టీస్ కాక ఫిట్‌నెస్ కోసం మరో గంట వర్కవుట్ చేస్తుంది. ఏడాదిలో 365 రోజులూ ఇదే తన డైలీ రొటీన్. ఒక్క రోజు కూడా ప్రాక్టీస్ ఆపదు. వైజాగ్, ఎస్‌ఏడీ అకాడమీలో మొదలైన ప్రాక్టీస్ వీడీసీఏ, ఏసీఏలో కొనసాగుతోంది. తనిప్పుడు టెన్త్ క్లాస్. షబ్నమ్ కోసం స్కూల్ వాళ్లు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తూ సహకరిస్తున్నారు. అండర్ 19, టీ 20 వరల్డ్ కప్‌కు ఆడే అవకాశం రావడం కీలకమైన సోపానం. సీనియర్ కేటగిరీలో మనదేశం తరఫున ఆడడం తన లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరడానికి మధ్య ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. ఇక నుంచి ఇంకా దీక్షగా ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. తనకు ఫాస్ట్ బౌలింగ్ ఇష్టం.

నేను ఎంపైర్‌ని

పిల్లలు ఏదైనా సాధించాలంటే పేరెంట్స్ సహకారం చాలా అవసరం. మేమిద్దరం డిఫెన్స్ ఉద్యోగులమే. ఆయన లీడింగ్ ఫైర్‌మ్యాన్, నేను ఆఫీస్ క్లర్క్‌ని. మా వారికి క్రికెట్ చాలా ఇష్టం. అప్పట్లో తనకు అంత సహకారం, ప్రోత్సాహం లేకపోవడంతో విశాఖపట్నానికే పరిమితమయ్యారు. పిల్లలను క్రీడాకారులుగా తయారు చేయాలనే కోరిక మా వారిదే. చిన్నమ్మాయి షాజహానాబేగం కూడా క్రికెట్ ప్రాక్టీస్ చేస్తోంది. ముగ్గురూ ప్రాక్టీస్ చేస్తుంటే ఎంపైర్‌గా వ్యవహరిస్తూ ఆటను ఎంజాయ్ చేయడం నా వంతు. మాకు వేడుకైనా, పిక్‌నిక్ అయినా క్రికెటే. బంధువుల ఇళ్లలో వేడుకలకు వెళ్లే అవకాశం ఉండదు. షబ్నమ్ ఎక్కడ ఆడుతుంటే ఫ్యామిలీ మొత్తం అక్కడికి వెళ్లిపోతాం. మాకదే పిక్‌నిక్'' అన్నారు షబ్నమ్ తల్లి ఈశ్వరమ్మ.

> **ఫాస్టెస్ట్ బౌలర్‌గా నిలవాలి...**
> టీ 20 వరల్డ్ కప్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. క్రీడాకారులు ఎప్పుడూ ప్రాక్టీస్‌లోనూ, మ్యాచ్ పెర్ఫార్మెన్స్‌లోనూ కాంప్రమైజ్ కాకూడదు. మన హండ్రెడ్ పర్సెంట్ ఇవ్వాలి. అప్పుడే లక్ష్యాన్ని చేరుకోగలుగుతామనేది నా నమ్మకం. ఆడేటప్పుడు మ్యాచ్‌ని ఎంజాయ్ చేయాలి. ప్రెషర్ తీసుకోకూడదు. ప్రతి రోజూ మన బెస్ట్ కాకపోవచ్చు. కానీ మనం అంకితభావంతో ఆడడమే మనవంతు. ఫాస్ట్ బౌలర్‌గా... ఫాస్టెస్ట్ బౌలర్‌గా నిలవడం నా లక్ష్యం.
> – షబ్నమ్, క్రికెట్ క్రీడాకారిణి


షబ్నమ్ తండ్రి షకీల్ తల్లి ఈశ్వరమ్మ

– వాకా మంజులారెడ్డి

న్యూస్‌మేకర్

బాధితులకు గొంతునిచ్చి



స్నేహ జవాలే

స్నేహ జవాలే చేసిన నేరమంతా అత్తగారు అడిగిన కట్నం తేలేకపోవడమే. భర్త కిరోసిన్ పోసి చంపడానికి చూశాడు. ఆమె బతికింది. అంతేకాదు... తనలా బతుకు కోల్పోయిన వారికి అండగా నిలిచింది. అందుకే బిబిసి వారి '100 విమెన్ ఆఫ్ 2022'లో నేడు సమోన్నతంగా నిలుచుంది. ఈ సంవత్సరం ప్రపంచాన్ని ప్రభావితం చేసిన 100 మంది మహిళల పట్టిక బిబిసి విడుదల చేసింది. వీరిలో నలుగురు భారతీయ మహిళలు ఉన్నారు. ఏరోనాటికల్ ఇంజనీర్ శిరీష బండ్ల, నటి ప్రియాంకా చోప్రా, రచయిత్రి గీతాంజలితో పాటు స్నేహ జవాడే తన స్ఫూర్తిగాథతో ప్రపంచ మహిళను ప్రభావితం చేస్తోంది.

స్త్రీలు ఏ ఘనత సాధించినా అది స్త్రీలకు స్ఫూర్తిదాయకమే. ఒక స్త్రీ వేసిన ముందడుగు ప్రపంచ గమనాన్నే మార్చొచ్చు. గత పదేళ్లుగా బిబిసి 'విమెన్ ఆఫ్ ది ఇయర్'గా ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన వందమంది మహిళలను ప్రకటిస్తూ ఉంది. ఆ పరంపరలో భాగంగా 2022 సంవత్సరానికిగాను ప్రభావాన్ని చూపిన 100 మహిళలను '100 విమెన్ 2022'గా పట్టికను విడుదల చేసింది. వీరిలో తాజా అమెరికా గాన సంచలనం బిలి ఇలిష్, ఉక్రెయిన్ ప్రథమ మహిళ ఒలెనా జెలెస్కా, ఇరాన్ పర్వతారోహకురాలు ఎల్నాజ్ రెకాబి... తదితరులున్నారు. ఇండియా నుంచి నలుగురు ఈ లిస్ట్‌లో స్థానం పొందారు. కమర్షియల్ స్పేస్‌ఫ్లయిట్ ద్వారా రోదసిలోకి వెళ్లి వచ్చిన శిరిష బండ్ల, ఇటీవల బుకర్ ప్రైజ్ పొందిన గీతాంజలి శ్రీ, నటి ప్రియాంకా చోప్రా ఉన్నారు. వీరితో పాటు సామాజిక కార్యకర్త స్నేహ జవాడే కూడా. ఈ నలుగురి విజయంతో పోలిస్తే స్నేహ జవాడే విజయం భిన్నమైనది. తీవ్రమైనది. అందుకే ఆమె ఈ లిస్ట్‌లో స్థానం పొందింది.

వరకట్న బాధితురాలు

1998 సంవత్సరంలో స్నేహ జవాడే పెళ్లయింది. ఆమె తండ్రి బ్యాంకు ఉద్యోగి. తల్లి గృహిణి. లా చేస్తాను అని స్నేహ మొత్తుకుంటున్నా పెళ్లికి ఒప్పించారు. భర్త ఎం.బి.ఏ చేశాడని తనను కూడా చదివించి బాగా చూసుకుంటాడని భావించి స్నేహ వివాహం చేసుకుంది. కాని వారు కట్నం ఆశించారు. 11 లక్షలు కోరితే 'బేరం' ఐదు లక్షలకు తెగింది. ఆరు లక్షలు నష్టపోయిన భావన వారి మనసులో ఉండిపోయింది. పెళ్లయ్యాక కూడా అదే భావన అత్తామామల మాటల్లో వ్యక్తమయ్యేది. ఆమెను కొట్టి ఇంటికి పంపిన ప్రతిసారీ తల్లిదండ్రులు తిరిగి దిగబెట్టి 'మా కూతురు మా దృష్టిలో చచ్చిపోయింది. ఇక చచ్చినా బతికినా అత్తారింటిలోనే' అని చెప్పేసి వెళ్లేవారు. దాంతో భర్తకు బలం వచ్చింది. కొడుకు పుట్టాక వాడికి మూడేళ్ల వయసు ఉన్నప్పుడు భర్తే స్వయంగా కిరోసిన్ పోసి నిప్పంటించాడు. ఆ ఘటనలో స్నేహ ముఖం పూర్తిగా కాలిపోయింది. ప్రాణాలతో బయటపడింది. ఆ తర్వాత ముంబైలో ఆమెకు అనేక సర్జరీలు చేసి కొద్ది ముఖాన్ని నిర్మించగలిగారు. కాని ఆమె జీవితం ఆ రోజుతో మారిపోయింది.

పోలీస్ కేసు లేదు

అపస్మారకంలో స్నేహ ఉన్నప్పటికీ ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశామని పోలీసులు చెప్పారు. కాఫీ పెడుతుంటే ఒళ్లు కాలిందని రిపోర్టు. కోర్టులో కూడా అదే వాదన వినిపించారు. భర్త, అత్తామామలు తప్పించుకున్నారు. అంతే కాదు స్నేహను వదిలించుకుని ఆమె కొడుకును తీసుకొని వెళ్లిపోయారు. స్నేహ ఇప్పుడు ఒంటరిగా మిగిలింది. జీవితం మొత్తం శూన్యంగా మారిన స్థితిలో నిలుచుంది.

మరో మహిళ తోడుగా

ఆ సమయంలోనే కల్పనా కాడే అనే మరో మహిళ స్నేహకు మద్దతుగా నిలిచింది. ఆమెకు జ్యోతిష్యం, టారో రీడింగ్ నేర్పించింది. ఇంత కాలం తన భవిష్యత్తును మరొకరు నిర్దేశించే స్థితి నుంచి స్నేహ మరొకరి భవిష్యత్తును చెప్పగలిగే స్థితికి చేరుకుంది. అంతే కాదు తన భవిష్యత్తును కూడా తాను నిర్మించుకోవడం నేర్చుకుంది. టారో రీడింగ్‌లో స్నేహకు చాలా మంచి పేరు వచ్చింది. ఆమె ముఖం ఎలా ఉంది అని ఎవరూ చూడలేదు.. ఆమె పలుకును చూశారు. స్నేహ సొంత ఇల్లు కొనుక్కుంది. ఆర్థికంగా స్థిరపడింది. అంతే కాదు వరకట్న దురాచారంపై పోరాడటం మొదలు పెట్టింది. తనలా కాలిన గాయాలతో, యాసిడ్ దాడులతో బాధ పడుతున్నవారికి ఆత్మవిశ్వాసం ఇచ్చింది. వారిని సమాజం ఎలా చూడాలన్న అంశం మీద అవగాహన కల్పించింది. ఆమెకు ఆమె కొడుకుతో సహా ఎవరూ లేరు. కాని బాధిత మహిళలందరూ ఆమె కుటుంబం అయ్యారు. ఒకరికి ఒకరు తోడు నిలిస్తే కష్టం దాటవచ్చని స్నేహ నిరూపించింది.

అందుకే 2022 సంవత్సరంలో అత్యంత ప్రభావాన్ని కలిగిస్తున్న మహిళగా స్నేహ గౌరవం పొందింది.

'లే ఆఫ్స్' అనే మాట ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తోంది. ఎప్పుడూ వినని కంపెనీలతోపాటు సుప్రసిద్ధ బడా కంపెనీలు కూడా 'లే ఆఫ్స్' మంత్రాన్ని జపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉద్యోగం కోల్పోయిన యువ ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? ఉద్యోగంతో పాటు ఆత్మస్థైర్యం కూడా కోల్పోయారా? సామాజిక మాధ్యమాల్లో వారి అభిప్రాయాలు చూస్తుంటే అలాంటిదేమీ లేదు అనిపిస్తుంది. ఒక్క సినిమా ఫ్లాప్ అయినంత మాత్రాన హీరో హీరో కాకుండా పోతాడా!

చింత ఏలనోయి ఇంత టాలెంట్ ఉండగా!



యూత్ పల్స్

ప్రపంచ వ్యాప్తంగా పెద్దపెద్ద కంపెనీలలో 'ఉద్యోగ కోత పర్వం' మొదలైంది. మన దేశంలో కూడా ఎన్నో స్టార్టప్ కంపెనీలు ఇదే బాటలో పయనిస్తున్నాయి. బైజూస్, జొమాటో, ఓయోలాంటి పెద్ద సంస్థల నోట కూడా 'కోత' మాట వినిపిస్తోంది.

'భవిష్యత్‌లో కొత్త ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడినప్పుడు మీకే తొలి ప్రాధాన్యత ఇస్తాం' అని తీసివేసిన ఉద్యోగులకు హామీ ఇస్తున్నాయి కొన్ని కంపెనీలు.

ఆర్థిక మాంద్యం భయాల నుంచి వ్యయనియంత్రణ వరకు లే ఆఫ్స్‌కు ఎన్నో కారణాలు ఉండవచ్చు. ఈ విషయం ఎలా ఉన్నా ఉద్వాసనకు గురైన యువ ఉద్యోగుల పరిస్థితి ఏమిటి? వారి పోస్ట్-లే ఆఫ్ లైఫ్ ఎలా ఉండబోతుంది?

ఉద్యోగంలో చేరిన రోజు నుంచి వారికంటూ ఒక భవిష్యత్ ప్రణాళిక ఉండి ఉండవచ్చు. హఠాత్తుగా ఉద్యోగం పోతే ప్రణాళిక పట్టాలు తప్పడం అనేది ఒక విషయం అయితే, మానసిక పరిస్థితుల్లో మార్పు రావడం అనేది మరో విషయం.

ఉద్యోగాల కోత ప్రభావం టెక్నాలజీ సెక్టార్‌లో ఎక్కువగా ఉంది. ఆ సెక్టార్‌లో తాజాగా ఉద్యోగం కోల్పోయిన ఒక యువ ఉద్యోగి తన అభిప్రాయాన్ని సామాజిక మాధ్యమంలో ఇలా పోస్ట్ చేశాడు...

'ఉద్యోగానికి దూరమై మూడు వారాలవుతోంది. నేనేమైనా తప్పు చేశానా? నాలో లోపం ఏమిటి... ఇలా మొదట్లో ఆలోచించేవాడిని. ఒకవిధంగా చెప్పాలంటే నన్ను నేనే దోషిగా చూస్తూ, నన్ను నేనే నిందించుకుంటూ టాక్సిక్ మైండ్‌సెట్‌లోకి వెళ్లిపోయాను. నేను అక్కడే ఉంటే నిరాశ, నిస్పృహ అనే చీకట్లోనే కొట్టుమిట్టాడుతుండేవాడిని. అదృష్టవశాత్తు అక్కడి నుంచి బయటపడ్డాను. ఇప్పుడు ప్రతి విషయం గురించి లోతుగా ఆలోచించే అవకాశం నాకు దొరికింది. లే ఆఫ్స్ పుణ్యమా అని ఉరుకులు పరుగుల జీవితం నుంచి దూరంగా జరిగి ఒక దగ్గర కుదురుగా కూర్చొని నా గురించి నేను తెలుసుకునే అవకాశం దొరికింది'

> పోస్ట్-లే ఆఫ్ లైఫ్ వారి ముందు పజిల్‌గా, జవాబు తెలియని ప్రశ్నగా నిలిచి భయపెట్టడం లేదు. దీనికి కారణం వారి దగ్గర ఉన్న పరిష్కార మార్గాలతోపాటు మానసిక పరిణతి.

లే ఆఫ్స్ ప్రభావం వల్ల ఒక కార్పొరేట్ కంపెనీ నుంచి బయటికి వచ్చిన ఒక ఉద్యోగి ఇలా పోస్ట్ చేసింది...

'ఈ అనుకోని పరిస్థితికి అడ్జెస్ట్ కావడానికి కాస్త టైమ్ పట్టింది. కొత్త చాప్టర్ మొదలు పెట్టేవరకు ఈ ఖాళీ సమయాన్ని నా కుటుంబసభ్యులు, స్నేహితులతో గడపాలనుకుంటున్నాను. ట్రావెల్ చేయాలనుకుంటున్నాను'.

'ఒక హీరో సినిమా ఫ్లాప్ అయినంత మాత్రాన అతడి కెరీర్ ముగిసినట్లు కాదు. మీరు కూడా అంతే. మీకు మంచి భవిష్యత్ ఉంది' అని ఒకరు కామెంట్ పెట్టారు.

'జరిగిందేదో జరిగింది' అనుకునే వాళ్లతో పాటు 'ఇలా ఎందుకు జరిగింది అంటే' అంటూ కంపెనీల వైపు వేలు చూపేవారు కూడా ఉన్నారు. ఉదాహరణకు వి. ఒక ప్రముఖ ఎడ్‌టెక్ కంపెనీలో ఉద్యోగం చేసిన 'వి' లే ఆఫ్స్ దెబ్బతో బయటికి వచ్చాడు. ఒకప్పుడు ఐకానిక్ స్టార్టప్‌గా వార్తల్లో నిలిచిన సంస్థ ఇప్పుడు మాస్ లే ఆఫ్‌లతో పతాక శీర్షికలకు ఎక్కడానికి కారణం ఏమిటో లోతుగా విశ్లేషించి చెప్పగలడు. ఇతడికి రెండు నెలల తరువాత వేరే కంపెనీలో ఉద్యోగం దొరికింది.

అయితే చాలామంది యువ ఉద్యోగులకు కంపెనీల తప్పొప్పులు, తలనొప్పుల కంటే 'తర్వాత ఏమిటి?' అని తమ గురించి ఆలోచించడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు.

'లే ఆఫ్ అనేది సైక్లికల్ ట్రెండ్. మార్కెట్ కరెక్షన్స్‌లో భాగంగా ప్రతి మూడు, నాలుగు సంవత్సరాలకు ఇలా జరుగుతుంది' అంటున్నాడు అర్బన్ ల్యాడర్ కో-ఫౌండర్ రాజీవ్ శ్రీవాస్తవ.

ఒకప్పుడు ఉద్యోగం పోతే కుటుంబసభ్యులో, స్నేహితులో ధైర్యవచనాలు పలికేవారు. అయితే నేటితరం మాత్రం తమకు తామే కొండంత ధైర్యంగా నిలుస్తుంది. పోస్ట్-లే ఆఫ్ లైఫ్ వారి ముందు పజిల్‌గా, జవాబు తెలియని ప్రశ్నగా నిలిచి భయపెట్టడం లేదు. దీనికి కారణం వారి దగ్గర ఉన్న పరిష్కార మార్గాలతో పాటు మానసిక పరిణతి.

బ్యూటిప్

జుట్టు తెల్లబడుతోందా? ఆందోళన వద్దు



ఇనప మూకుడు తీసుకుని దానిలో కప్పు ఆవనూనె, కప్పు కొబ్బరి నూనె, టేబుల్ స్పూన్ మెంతిపొడి లేదా మెంతులు, టేబుల్ స్పూన్ ఉసిరిపొడి, అరకప్పు గోరింటాకు పొడి వేసి బాగా కలపాలి. ఇప్పుడు సన్నని మంట మీద ఈ బాణలి పెట్టి పదినిమిషాలు మరగనివ్వాలి. ఆయిల్ రంగు మారిన తరువాత స్టవ్ ఆపేసి పన్నెండు గంటలపాటు పక్కన పెట్టాలి. తరువాత తలవెంట్రుకలకు రాసి మూడు గంటల తరవాత తలస్నానం చేయాలి. నెలకు రెండు మూడుసార్లు ఇలా ఈ ఆయిల్‌ను తలకు పట్టించడం వల్ల నల్లని ఒత్తైన కురులు మీ సొంతమవుతాయి.

గాజా గ్రీన్ గోల్డ్

వేగంగా అభివృద్ధి చెందుతోన్న నేటి ఆధునిక ప్రపంచంలో శ్వాసించే గాలి నుంచి తినే తిండి వరకు అన్నీ రసాయనాల మయం. కెమికల్స్‌తో తయారు చేసిన ఉత్పత్తులను వాడడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటున్నప్పటికీ కార్పొరేట్ కంపెనీలు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా కాసులు పోసుకుంటున్నాయి. ఇటువంటి తరుణంలో రసాయనాలు వాడని, సహజసిద్ధంగా దొరికే మూలికలతో సౌందర్య ఉత్పత్తుల తయారీ ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ మరోపక్క ఆదాయాన్ని కూడా పొందుతున్నారు గాజా మహిళలు.

గాజాలో కొంతమంది మహిళలు కలిసి రసాయనాలు లేని సౌందర్య ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. రోజ్మెరి, తులసి, పుదీనా, చమోలి ఆకుల పార్స్లీ, పుదీనా, దురదగుండ, వాటర్ క్రీస్, రోజ్మెరీ వంటివాటిని ఉపయోగించి హానికరం కాని కాస్మొటిక్ ఉత్పత్తులను తయారు చేయడం విశేషం. ఆస్ట్రేలియా విదేశీ విభాగం, ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ అండ్ ఎన్జీవో నజ్డ్ డెవలప్‌మెంట్ ఫోరం వారు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఈ కార్యక్రమంలో 40 మంది పాలస్తీనా మహిళలు పాల్గొంటున్నారు. వీరిలో కొంతమంది సంబంధిత హెర్బల్స్‌ను పెంచి తరువాత వాటిని సౌందర్య ఉత్పత్తులుగా మారుస్తున్నారు.

రసాయనాలు లేని సహజసిద్ధమైన మూలికలతో బ్యూటీ ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇచ్చి వారితో తయారు చేయించడం ద్వారా స్థానిక మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. నిరుద్యోగ సమస్యతో తీవ్ర పేదరికాన్ని ఎదుర్కొంటున్న పాలస్తీనా మహిళలకు ఈ ప్రాజెక్టు ఊరటను కలిగిస్తోందని ప్రాజెక్టు నిర్వాహకులు చెబుతున్నారు.

గ్రీన్ గోల్డ్

గాజాలో దొరికే వివిధ రకాల మూలికలు, సహజసిద్ధమైన మొక్కలు బ్యూటీ ఉత్పత్తులు తయారు చేయడానికి ఉపయోగపడుతున్నాయి. నలభై మంది మహిళల్లో ఇరవై మందికి మూలికా మొక్కలు, మెడిసినల్, అరోమాటిక్ మొక్కలను అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా ఎలా పెంచాలి, సేకరణ, భద్రపరచడం వంటివాటిపై శిక్షణ ఇచ్చారు. మిగతావారు షాంపులు, కండీషనర్, ఫేస్‌క్రీమ్‌లు, హెయిర్ ఆయిల్స్ వంటివి దాదాపు 17 రకాల ఉత్పత్తులను 'గ్రీన్ గోల్డ్' (జీజీ) పేరుతో విక్రయిస్తున్నారు. వీటిని వాడిన కస్టమర్ల నుంచి మంచి స్పందన వస్తుండడంతో... రోజుకు రెండు వందల నుంచి ఐదు వందల వరకు కాస్మెటిక్స్ ఉత్పత్తి చేస్తున్నారు. వీటిని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్,ఫార్మాసూటికల్స్ ద్వారా యాభై స్టోర్లలో విక్రయిస్తున్నారు.







జీజీని ఉత్పత్తి చేస్తోన్న మహిళలు సైతం ఎంతో సంతోషంగా ఉన్నారు. ''దీని వల్ల కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడమేగాక, ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాము. మాలో కొంతమందికి ఎటువంటి ఉద్యోగం దొరకకపోవడం, ఆదాయం వచ్చే మార్గం లేని వారు ఉన్నారు. అటువంటి వారందరికి ఇది చాలా బాగా ఉపయోగపడుతుంది'' అని గాజా మహిళలు చెబుతున్నారు.



తొలి మ్యాచ్‌లో కొడాయ్ నరోకాతో ప్రణయ్ 'ఢీ'

బ్యాడ్మింటన్ సీజన్ ముగింపు టోర్నీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌కు మొదటిసారి అర్హత సాధించిన భారత అగ్రశ్రేణి షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి మ్యాచ్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్)తో ఆడతాడు. బ్యాంకాక్‌లో నేటి నుంచి జరిగే ఈ మెగా టోర్నీలో పురుషుల సింగిల్స్ గ్రూప్ 'ఎ'లో ప్రణయ్‌తోపాటు ఒలింపిక్ చాంపియన్ అక్సెల్‌సన్ (డెన్మార్క్), లూ గ్వాంగ్ జు (చైనా), నరోకా ఉన్నారు. నరోకాతో ఈ ఏడాది సింగపూర్ ఓపెన్‌లో ఆడిన ప్రణయ్ మూడు గేముల్లో ఓడిపోయాడు.



భారత చెస్ 77వ గ్రాండ్‌మాస్టర్‌గా ఆదిత్య

ముంబైకి చెందిన 16 ఏళ్ల ఆదిత్య మిట్టల్ భారత చెస్‌లో 77వ గ్రాండ్‌మాస్టర్ (జీఎం)గా అవతరించాడు. స్పెయిన్‌లో జరుగుతున్న ఎలోబ్రెగట్ టోర్నీలో ఆరో రౌండ్‌లో ఫ్రాన్సిస్కో (స్పెయిన్)పై ఆదిత్య గెలిచి జీఎం నార్మ్ ఖరారు కావడానికి అవసరమైన 2500 ఎలో రేటింగ్‌ను అందుకున్నాడు. జీఎం కావాలంటే ఓ చెస్ ప్లేయర్ మూడు జీఎం నార్మ్‌లతోపాటు 2500 ఎలో రేటింగ్ పాయింట్లను సాధించాలి. ఆదిత్య 2021లో తొలి జీఎం నార్మ్, 2022లో మిగతా రెండు జీఎం నార్మ్‌లు సంపాదించాడు.

● హీరో ఆఫ్ ద మ్యాచ్


స్పెయిన్ ప్లేయర్ బుస్క్వెట్స్ పెనాల్టీ షాట్‌ను నిలువరిస్తున్న మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బోనో

మొరాకో మెరిసె

- తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి
- 'షూటౌట్'లో స్పెయిన్‌పై విజయం

దోహా: ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో 2010 విజేత స్పెయిన్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఇంటిముఖం పట్టింది. ఆఫ్రికా ఖండానికి చెందిన ప్రపంచ 22వ ర్యాంకర్ మొరాకో జట్టు మొండి పట్టుదలతో ఆడి ఏడో ర్యాంకర్ స్పెయిన్‌ను ఓడించి తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో రెండు జట్లు నిర్ణీత సమయంలో... ఆ తర్వాత అదనపు సమయంలో నూ గోల్స్ చేయలేకపోయాయి. దాంతో 'షూటౌ ట్' అనివార్యమైంది. 'షూటౌట్'లో స్పెయిన్ ఆటగాళ్లు ఘోరంగా విఫలమయ్యారు. వరుసగా మూడు షాట్‌లను లక్ష్యానికి పంపించలేకపోయారు. సరాబియా తొలి షాట్ గోల్‌పోస్ట్ బార్‌కు తగిలి పక్కకు వెళ్లగా... సోలెర్ రెండో షాట్‌ను.. బుస్క్వెట్స్ మూడో షాట్‌ను మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బోనో నేర్పుతో నిలువరించి తమ జట్టుకు చిరస్మరణీయ విజయం అందించాడు. ప్రపంచకప్‌లో నాలుగుసార్లు పెనాల్టీ షూటౌట్‌లలో ఓడిన జట్టుగా స్పెయిన్ నిలిచింది. పోర్చుగల్, స్విట్జర్లాండ్ జట్ల మధ్య ప్రిక్వార్టర్ ఫైనల్ విజేతతో ఈనెల 10న క్వార్టర్ ఫైనల్లో మొరాకో తలపడుతుంది.

షూటౌట్ సాగిందిలా...

మొరాకో		స్కోరు	స్పెయిన్	
సాబిరి	✔	1-0	సరాబియా	✘
జియెచ్	✔	2-0	సోలెర్	✘
బెనౌన్	✘	2-0	బుస్క్వెట్స్	✘
హకీమి	✔	3-0	------	

నోట్: ఫలితం తేలిపోవడంతో తర్వాతి పెనాల్టీలు తీసుకోలేదు


మొరాకో ఆటగాళ్ల ఆనందం

4 ప్రపంచకప్ చరిత్రలో క్వార్టర్ ఫైనల్ చేరిన నాలుగో ఆఫ్రికా దేశం మొరాకో. గతంలో కామెరూన్ (1990లో), సెనెగల్ (2002లో), ఘనా (2010లో) ఈ ఘనత సాధించాయి.

బ్రెజిల్ గర్జన

- కొరియాపై 4–1తో ఘనవిజయం
- తొలి 36 నిమిషాల్లోనే నాలుగు గోల్స్
- 14వసారి క్వార్టర్స్ చేరిన మాజీ విజేత
- 9న క్రొయేషియాతో 'ఢీ'

దోహా: తమ నంబర్‌వన్ ర్యాంక్‌కు తగ్గ ఆటతో ఐదుసార్లు విశ్వవిజేత బ్రెజిల్ ఫుట్‌బాల్ ప్రపంచ కప్ టోర్నీలో మరో అడుగు ముందుకేసింది. భారత కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో బ్రెజిల్ 4-1 గోల్స్ తేడాతో దక్షిణ కొరియాను ఓడించి ఈ మెగా ఈవెంట్‌లో 14వసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బ్రెజిల్ తరఫున వినిసియస్ (7వ ని.లో), నెమార్ (13వ ని.లో), రిచార్లీసన్ (29వ ని.లో), లుకాస్ పక్వెటా (36వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. కొరియా తరఫున 79వ నిమిషంలో పాయిక్ సెంగ్‌హో ఏకైక గోల్ సాధించాడు. ఈనెల 9న జరిగే క్వార్టర్ ఫైనల్లో గత ప్రపంచకప్ రన్నరప్ క్రొయేషియాతో బ్రెజిల్ తలపడుతుంది.

ఏడో నిమిషంలో రఫిన్హా ఇచ్చిన పాస్ ఇద్దరు బ్రెజిల్ స్ట్రయికర్లను దాటుకుంటూ వినిసియస్ జూనియర్ వద్దకు రాగా అతను గోల్‌పోస్ట్‌లోకి పంపించాడు. 13వ నిమిషంలో లభించిన పెనాల్టీ కిక్‌ను నెమార్ గోల్ చేయడంతో ఆధిక్యం 2-0కు చేరింది. మరోవైపు కొరియన్లు కూడా గోల్ కోసం గట్టిగానే ప్రయత్నించారు. ఈ క్రమంలోనే 17వ నిమిషంలో వాంగ్ హిచన్ కొట్టిన కిక్ గోల్‌పోస్ట్ లెఫ్ట్‌కార్నర్‌లో ఎంతో ఎత్తు నుంచి దూసుకొచ్చింది. కానీ బ్రెజిల్ గోల్‌కీపర్ అలీసన్ ఎడంవైపునకు హైజంప్ చేసి కుడిచేతి పంచ్‌తో బయటికి పంపాడు. ఇలా కొరియా స్కోరు చేయాల్సిన చోట అలీసన్ అడ్డుగోడ కట్టేశాడు. 29వ నిమిషంలో రిచార్లీసన్ కొరియా డిఫెండర్లను బోల్తా కొట్టించిన తీరు అద్భుతం. 'డి' ఏరియాకు ముందు బంతిని హెడర్‌తో నియంత్రించిన రిచార్లీసన్ కాలితో దగ్గరే ఉన్న మార్కిన్‌హాస్‌కు పాస్ చేయగా... అతను దాన్ని రఫిన్హాకు అందించాడు. ఈలోపే రిచార్లీసన్ 'డి' ఏరియాలోని గోల్‌పోస్ట్ ముందుకు దూసుకొచ్చాడు. రఫిన్హా వెంటనే బంతిని పాస్ చేయడంతో రిచార్లీసన్ గోల్ చేశాడు. ఇదంతా ఏడు సెకన్లలోనే జరిగిపోయింది. ఇలా అరగంటలోపే బ్రెజిల్ ఎదురేలేని ఆధిక్యం సంపాదించింది. కాసేపటికి మళ్లీ 36వ నిమిషంలో నెమార్, రిచార్లీసన్ పాస్‌లతో బంతి కొరియా 'డి' ఏరియాలోకి వచ్చింది. అక్కడ వాళ్లిద్దరితో పాటు మరో ఇద్దరు బ్రెజిల్ స్ట్రయికర్లు కూడా వచ్చినప్పటికీ కొరియన్ డిఫెండర్లు ఈ నలుగురిని కాచుకున్నారు. అయితే అనూహ్యంగా ఆఖరుగా 'డి' ఏరియాలోకి ప్రవేశించిన లుకాస్... బంతి అధీనంలో ఉన్న వినిసియస్ జూనియర్‌కు చేతితో సైగ చేశాడు. వెంటనే అతను కొరియన్ డిఫెండర్ల తలపై నుంచి బంతిని లుకాస్‌కు చేరవేశాడు. అతను కొరియన్ల కాళ్ల సందుల్లోంచి బంతిని గోల్‌పోస్ట్‌లోకి కొట్టాడు. ఇలా తొలి అర్ధభాగంలోనే 4-0తో మ్యాచ్‌ను ఏకపక్షంగా లాగేసిన బ్రెజిల్ రెండో అర్ధభాగంలోనూ జోరు కొనసాగించింది.

రెండో గోల్ తర్వాత బ్రెజిల్ ఆటగాళ్లు వినిసియస్, రఫిన్హా, లుకాస్, నెమార్ సంబరం


5 వరుసగా మూడు ప్రపంచకప్ టోర్నీలలో గోల్స్ సాధించిన ఐదో ప్లేయర్‌గా నెమార్ నిలిచాడు. గతంలో మెస్సీ (అర్జెంటీనా), క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్), షాకిరి (స్విట్జర్లాండ్), పెరిసిచ్ (క్రొయేషియా) ఈ ఘనత సాధించారు.

26 ఈసారి ప్రపంచకప్‌లో బ్రెజిల్ జట్టు నాలుగు మ్యాచ్‌ల్లో 26 మంది ఆటగాళ్లకు ఆడే అవకాశం కల్పించింది. మొత్తం ఎంపిక చేసిన 26 మంది ఆటగాళ్లకు ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడే అవకాశం కల్పించిన తొలి జట్టుగా బ్రెజిల్ నిలిచింది.

2 వరుసగా ఎనిమిదిసార్లు ప్రపంచకప్‌లో క్వార్టర్ ఫైనల్ దశకు చేరిన రెండో జట్టు బ్రెజిల్. గతంలో జర్మనీ (1986 నుంచి 2014 వరకు) మాత్రమే ఈ ఘనత సాధించింది. అంతేకాకుండా ఓవరాల్‌గా 14వసారి బ్రెజిల్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించి జర్మనీ (14 సార్లు) పేరిట ఉన్న రికార్డును సమం చేసింది.

2 గత 60 ఏళ్లలో ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లోని తొలి అర్ధభాగంలోనే నాలుగు అంతకంటే ఎక్కువ గోల్స్ సాధించిన రెండో జట్టుగా బ్రెజిల్ గుర్తింపు పొందింది. గతంలో నాలుగుసార్లు చాంపియన్ జర్మనీ జట్టు మాత్రమే (2014 సెమీఫైనల్లో బ్రెజిల్‌పై ఐదు గోల్స్) ఈ ఘనత సాధించింది.

సత్తా చాటితేనే సమం

- నేడు బంగ్లాదేశ్‌తో భారత్ రెండో వన్డే
- ఉదయం గం.11.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మిర్పూర్: ఏడేళ్ల క్రితం భారత జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటించినప్పుడు 1–2 తేడాతో వన్డే సిరీస్‌ను కోల్పోయింది. ధోని నాయకత్వంలో నాడు తొలి రెండు వన్డేల్లోనే ఓడిన తర్వాత చివరి మ్యాచ్‌లో నెగ్గి పరువు దక్కించుకుంది. ఇప్పుడు మరోసారి మన జట్టు దాదాపు అలాంటి స్థితినే ఎదుర్కొంటోంది. ఆదివారం అనూహ్యంగా మొదటి మ్యాచ్‌లో ఓడిన రోహిత్ శర్మ బృందం సిరీస్ చేజారకుండా ఉండాలంటే తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే రెండో వన్డేలో బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్ కూడా గత వన్డే జరిగిన వేదికపైనే జరగనుంది. పిచ్ అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు కూడా అనుకూలిస్తూ సమతూకంగా ఉంది. మ్యాచ్‌కు వర్ష సూచన లేదు.

రంజీ ట్రోఫీలో తొలిసారి మహిళా అంపైర్లు


జననీ, గాయత్రి, బ్రిందా రాఠి (ఎడమ నుంచి)

ముంబై: భారత దేశవాళీ ఫస్ట్‌క్లాస్ టోర్నీ రంజీ ట్రోఫీలో తొలిసారి మహిళా అంపైర్లు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. దీనికి సంబంధించి ముగ్గురు మహిళా అంపైర్లను బీసీసీఐ ఎంపిక చేసింది. భారత క్రికెట్‌లో ఇది కొత్త మలుపు కానుందని బోర్డు అభిప్రాయ పడింది. బ్రిందా రాఠి (ముంబై), జనని నారాయణ్ (చెన్నై), గాయత్రి వేణుగోపాలన్ (ఢిల్లీ)లకు ఈ అవకాశం దక్కింది. డిసెంబర్ 13న ప్రారంభం కానున్న రంజీ ట్రోఫీలో కొన్ని ఎంపిక చేసిన మ్యాచ్‌లకు వీరు అంపైర్లుగా వ్యవహరిస్తారు. 32 ఏళ్ల బ్రిందా ముంబైలో చిన్న స్థాయి క్లబ్ మ్యాచ్‌ల నుంచి మొదలు పెట్టి బీసీసీఐ అంపైర్‌గా ఎదగగా, 43 ఏళ్ల గాయత్రి బోర్డు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణురాలై 2019 నుంచి అంపైరింగ్ చేస్తోంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన 36 ఏళ్ల జనని క్రికెట్‌పై ఆసక్తితో ఉద్యోగం వదిలి అంపైరింగ్ వైపు వెళ్లింది.

ముకేశ్‌కు ఆరు వికెట్లు

సిల్హెట్: బంగ్లాదేశ్ 'ఎ' జట్టుతో మంగళవారం మొదలైన రెండో అనధికారిక టెస్టులో భారత 'ఎ' పేస్ బౌలర్ ముకేశ్ కుమార్ (6/40) ఆరు వికెట్లతో అదరగొట్టాడు. ఫలితంగా బంగ్లాదేశ్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 80.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. ఉమేశ్ యాదవ్, జయంత్ యాదవ్‌లకు రెండు వికెట్లు చొప్పున లభించాయి. బంగ్లా జట్టులో షాహదత్ హుస్సేన్ (80; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), జకీర్ అలీ (62; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆట ముగిసే సమయానికి భారత్ 'ఎ' 4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 11 పరుగులు చేసింది.

ఎన్‌సీఏకు పొవార్

భారత మహిళల టి20 జట్టు బ్యాటింగ్ కోచ్‌గా హృషికేశ్ కనిత్కర్ నియామకం

న్యూఢిల్లీ: ఇంకో రెండు నెలల్లోనే దక్షిణాఫ్రికాలో మహిళల టి20 ప్రపంచకప్ జరగనుంది. ఇలాంటి తరుణంలో భారత మహిళల జట్టు హెడ్ కోచ్ రమేశ్ పొవార్‌ను జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి బదిలీ చేస్తూ బోర్డు తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యపరుస్తోంది. అంతేకాదు... ఇంకెవరినీ హెడ్ కోచ్‌గా నియమించలేదు. భారత మాజీ క్రికెటర్ హృషికేశ్ కనిత్కర్‌ను మాత్రం బ్యాటింగ్ కోచ్‌గా నియమించింది. 'బెంగళూరులోని ఎన్‌సీఏకు పొవార్‌ను బదిలీ చేశాం. అకాడమీ డైరెక్టర్ లక్ష్మణ్ బృందంలో పురుషుల క్రికెట్ కోసం అతను పనిచేస్తాడు. బోర్డు పునర్నిర్మాణ ప్రణాళికల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నాం' అని బీసీసీఐ తెలిపింది.


పొవార్

సినిమా

ఇద్దరమ్మాయిల ప్రేమకథ కొత్తగా ఉంటుంది
- రామ్‌గోపాల్ వర్మ



''హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ నేపథ్యంలో లెక్కలేనన్ని సినిమాలు వచ్చాయి. కానీ, ఇద్దరు అమ్మాయిల మధ్య ప్రేమ ఎలా ఉంటుంది? అనే కొత్త ఆలోచనతో 'డేంజరస్' సినిమా తీశా. ఈ ప్రేమకథ సరికొత్తగా, ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. నైనా గంగూలీ, అప్సరా రాణి లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'డేంజరస్'. రామ్‌గోపాల్ వర్మ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఈ నెల 9న విడుదలకానుంది. ఈ సందర్భంగా రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ– ''రొమాంటిక్, క్రైమ్, సస్పెన్స్, యాక్షన్ వంటి అంశాలతో 'డేంజరస్' తెరకెక్కింది. అబ్బాయిల వల్ల చేదు అనుభవాలు ఎదుర్కొన్న ఇద్దరు అమ్మాయిలు, ఆ అమ్మాయిల మధ్య చిగురించే ప్రేమ నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. మంచి హీరోయిన్ డేట్స్ దొరికి హీరో డేట్స్ కుదరకపోయినా ఇద్దరు హీరోయిన్లతో కూడా సినిమాలు చేయొచ్చనే ఆలోచనతో ఈ సినిమా తీశాను. హిందీలో అమితాబ్ బచ్చన్‌గారితో, కన్నడలో ఉపేంద్రతో నా దర్శకత్వంలో చేయనున్న సినిమాలు వచ్చే ఏడాది ప్రారంభమవుతాయి. ● ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న రాజకీయాలపై తొలి భాగం 'వ్యూహం', రెండవ భాగం 'శపథం' టైటిల్‌తో సినిమాలు చేయనున్నాను. సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డిగారు చనిపోయాక జరిగిన ఘటనలు, వ్యూహాల నేపథ్యంలో 'వ్యూహం' ఉంటుంది.. ఏపీ రాజకీయాల్లో ఉన్న డ్రామా తెలంగాణలో లేదు. అందుకే ఏపీ పాలిటిక్స్‌పై సినిమాలు తీస్తున్నాను. పైగా వైసీపీ, టీడీపీ పార్టీల్లో నాకు ఫ్రెండ్స్ ఉండడం కూడా మరో కారణం.


● రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఆర్ఆర్ఆర్‌కు హాలీవుడ్ క్రిటిక్స్ అవార్డ్స్

హాలీవుడ్ గ్రౌండ్‌లో ప్రస్తుతం 'ఆర్ఆర్ఆర్' (రౌద్రం..రణం..రుధిరం) సినిమా సౌండ్ ఓ రేంజ్‌లో వినిపిస్తోంది. ఇప్పటికే ఈ ఏడాది న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్ వారి బెస్ట్ డైరెక్టర్ అవార్డును సాధించారు దర్శకుడు రాజమౌళి. తాజాగా హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ జ్యూరీ స్పాట్‌లైట్ అవార్డును 'ఆర్ఆర్ఆర్'కు ప్రకటించింది. అలాగే అట్లాంటా ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డ్స్‌లో ఉత్తమ అంతర్జాతీయ చిత్రంగా 'ఆర్ఆర్ఆర్' నిలిచింది. ఇక 'ఫర్ యువర్ కన్సిడరేషన్' కింద 'ఆర్ఆర్ఆర్' యూనిట్ ఆస్కార్ అకాడమీకి అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది మార్చి 25న రిలీజై, ఘనవిజయం సాధించింది. మరి.. 95వ ఆస్కార్ అవార్డ్స్ నామినేషన్ 'ఆర్ఆర్ఆర్'కు దక్కుతుందా? లేదా అనేది జనవరిలో నామినేషన్స్ ప్రకటన అప్పుడు తెలుస్తుంది. అవార్డుల వేడుక మార్చి12న జరగనుంది.


● వెంకటేశ్

వెండితెరకు నారప్ప

కరోనా లాక్‌డౌన్ సమయంలో చాలా సినిమాలు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో విడుదలైన విషయం తెలిసిందే. అలా విడుదలైన చిత్రాల్లో 'నారప్ప' ఒకటి. వెంకటేశ్ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో సురేష్ ప్రొడక్షన్స్, వి క్రియేషన్స్ నిర్మించిన ఈ చిత్రం వెండితెరకు రానుంది. ఈ నెల 13న వెంకటేశ్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లలో అదే తేదీన విడుదల చేయనున్నారు.

హ్యాట్రిక్ హిట్ కొట్టడం గ్రేట్
- 'దిల్' రాజు


● 'దిల్' రాజు, సాయికిరణ్, రాహుల్


''మళ్ళీ రావా, ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ, మసూద' వంటి హ్యాట్రిక్ హిట్ కొట్టడం గ్రేట్. వరుసగా మూడు హిట్లు సాధించిన రాహుల్ యాదవ్‌కి, టీమ్‌కి అభినందనలు. మంచి సినిమాలకు సీజన్ ఉండదు.. ఇలాంటి మంచి చిత్రాలొస్తే ప్రేక్షకులు ఆదరిస్తారని 'మసూద' మళ్లీ నిరూపించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. సంగీత, తిరువీర్, కావ్య కల్యాణ్ రామ్, బాంధవి శ్రీధర్, 'శుభలేఖ' సుధాకర్ ముఖ్యపాత్రల్లో సాయికిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మసూద'. రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ సినిమా నవంబర్ 18న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన థ్యాంక్యూ మీట్‌లో ''పెద్ద హిట్ సాధించిన 'మసూద' టీమ్‌కి కంగ్రాట్స్'' అన్నారు హీరో సుమంత్. ''నా ఫ్యామిలీ సపోర్ట్ లేకపోతే ఈ స్థాయిలో ఉండేవాణ్ణి కాదు'' అన్నారు రాహుల్ యాదవ్ నక్కా. ''మా సినిమాను గ్రాండ్ సక్సెస్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సాయి కిరణ్.

సైంటిఫిక్ థ్రిల్లర్

సూర్య శ్రీనివాస్, షెర్రీ అగర్వాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సైంటిఫిక్ థ్రిల్లర్ 'ఎంతవారు గాని'. దర్శక– నిర్మాత రామ్‌గోపాల్ వర్మ సినిమాలకు ఎడిటర్, సౌండ్ ఇంజినీర్‌గా చేసిన ఎన్. శ్రీనివాసన్ (ఎన్ 'నివాస్' పేరుతో..) ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, సురేంద్ర కారుమంచి, శివ ముప్పరాజు నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను హీరో అడివి శేష్ విడుదల చేశారు. ''యువత మెచ్చే అంశాలతో పాటు సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


● అడివి శేష్, శ్రీనివాస్ ఎన్., సూర్య శ్రీనివాస్

ఛత్రపతి శివాజీగా...


● అక్షయ్ కుమార్

మహావీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ఆధారంగా మరాఠీలో 'వేడాట్ మరాఠే వీర్ దౌడ్లే సాత్' అనే చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో ఛత్రపతి శివాజీగా బాలీవుడ్ స్టార్ అక్షయ్‌కుమార్ నటిస్తున్నారు. మహేశ్ మంజ్రేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఆరంభమైంది. ఈ సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఛత్రపతి శివాజీగా నటించడం అనేది చాలా పెద్ద బాధ్యత. నా శక్తివంచన లేకుండా కృషి చేస్తాను'' అని పేర్కొన్నారు అక్షయ్ కుమార్. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది దీపావళికి విడుదల చేయాలనుకుంటున్నారు. కాగా హిందీలో హీరోగానూ, ప్రత్యేక పాత్రలు చేసిన చిత్రాలు, దక్షిణాదిన చేసిన రెండు మూడు చిత్రాలతో కలుపుకుని అక్షయ్ 150 చిత్రాలకు చేరువలో ఉన్నారు. ఇప్పుడు మరాఠీలో మెయిన్ లీడ్ యాక్టర్‌గా అక్షయ్‌కు 'వేడాట్ మరాఠే వీర్ దౌడ్లే సాత్' తొలి చిత్రం కావడం విశేషం.

నటనకు అవకాశం దక్కింది
- ప్రియ వడ్లమాని

ఈ సినిమా నాకో చాలెంజ్
- అయేషా ఖాన్



వికాస్ వశిష్ఠ, ప్రియ వడ్లమాని, చైతన్య రావ్, అయేషా ఖాన్ ప్రధాన పాత్రల్లో హీరో విశ్వక్‌సేన్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'ముఖచిత్రం'. ఎస్‌కేఎన్ సమర్పణలో ప్రదీప్ యాదవ్, మోహన్ యల్ల నిర్మించిన ఈ చిత్రానికి గంగాధర్ దర్శకుడు. 'కలర్‌ఫోటో' ఫేమ్ సందీప్‌రాజ్ కథ, స్క్రీన్‌ప్లే మాటలు అందించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటించిన ప్రియ వడ్లమాని మాట్లాడుతూ– ''ఇందులో నేను రెండు డిఫరెంట్ రోల్స్ చేశాను. విజయవాడలోని చిన్న టౌన్‌కు చెందిన అమాయకురాలైన అమ్మాయిగా, సిటీలో రఫ్ అండ్ టఫ్‌గా ఉండే మాయా ఫెర్నాండెజ్‌గా కనిపిస్తాను. మాయ క్యారెక్టర్ గాయపడితే, అమాయకురాలి ముఖాన్ని ఆమెకు రీప్లేస్ చేస్తారు. నటనకు అవకాశం దక్కింది. ఈ సినిమా నా కెరీర్‌ను నెక్ట్స్ లెవల్‌కు తీసుకెళ్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

మరో హీరోయిన్ అయేషా ఖాన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో ఏ విషయంలోనూ ఈజీగా రాజీపడని సిటీ గాళ్ మాయా ఫెర్నాండెజ్ పాత్రలో కనిపిస్తాను. నాకు ఇది తొలి చిత్రం. ఇలాంటి మంచి సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు హ్యాపీగా ఉంది. ఈ సినిమాలో యాక్సిడెంట్ సీన్ చిత్రీకరించేప్పుడు నిజంగానే నాకు గాయాలయ్యాయి. దాదాపు రెండు నెలలు విశ్రాంతి తీసుకున్నాను. ఈ ప్రమాదం తాలూకు గాయాలు అప్పుడప్పుడు బాధపెడుతూనే ఉన్నాయి. కానీ కష్టపడితేనే లైఫ్‌లో ఉన్నత స్థాయికి చేరుకోగలం. ఇక తెలుగు భాష రాకపోవడంతో డైలాగ్స్ నేర్చుకుని, సరైన మాడ్యులేషన్‌తో చెప్పడం సవాల్‌గా అనిపించింది'' అన్నారు.



ఇన్నేళ్లు ఉంటాననుకోలేదు!
- తమన్నా

''హీరోల్లో పెద్ద హీరో, చిన్న హీరో అనే తేడా చూడను. నాకు కథే ముఖ్యం. నేను చేసే సినిమా ప్రేక్షకులకు నచ్చాలని కోరుకుంటాను. అలాంటి మంచి కథ ఉన్న చిత్రమే 'గుర్తుందా శీతాకాలం'' అని హీరోయిన్ తమన్నా అన్నారు. సత్యదేవ్ హీరోగా తమన్నా, మేఘా ఆకాష్, కావ్య శెట్టి హీరోయిన్లుగా నాగశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గుర్తుందా శీతాకాలం'. చినబాబు, ఎం. సుబ్బారెడ్డి సమర్పణలో చింతపల్లి రామారావు, భావన రవి, నాగశేఖర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా తమన్నా పంచుకున్న విశేషాలు.

● సత్యదేవ్ నటించిన 'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య'లో తన నటన సహజంగా అనిపించింది. తనతో ఓ సినిమా చేయాలనే ఆసక్తి కలిగింది. 'గుర్తుందా శీతాకాలం'లో మేమిద్దరం మంచి ఎమోషన్స్ పండించే చాన్స్ దక్కింది. ● కన్నడ మూవీ 'లవ్ మాక్‌టైల్'కి 'గుర్తుందా శీతాకాలం' రీమేక్. నేను ఎన్నో రీమేక్ సినిమాల్లో నటించాను. అయితే ఒరిజినాలిటీని మిస్ కాకుండా చాలెంజ్‌లా తీసుకుని చేస్తాను.. ఇక ఈ సినిమాలో నా పాత్ర, ఎమోషన్స్ ఆకట్టుకుంటాయి.

● 'గుర్తుందా శీతాకాలం' ట్రైలర్ చూసి, నాగార్జునగారి 'గీతాంజలి'తో పోల్చడం హ్యాపీగా ఉంది. ఇప్పటివరకూ యాక్టర్ కమ్ డైరెక్టర్‌తో నేను సినిమా చేయలేదు. ఇక నాగశేఖర్ స్వతహాగా నటుడు కావడంతో తనకు ఎలా కావాలో అలా మాతో చేయించారు. ● నేను ఇండస్ట్రీకి వచ్చి 17 ఏళ్లయినా సినిమాపై క్రేజ్, ప్యాషన్ ఏమాత్రం తగ్గలేదు. అయితే ఇండస్ట్రీలో ఇన్నేళ్లు ఉంటాననుకోలేదు. ప్రస్తుతం తెలుగులో చిరంజీవిగారి 'భోళా శంకర్', మలయాళంలో 'బాంద్రా' అనే సినిమా, మూడు ఓటీటీ ప్రాజెక్ట్స్ చేస్తున్నాను.

నా పెళ్లి గురించి సోషల్ మీడియాలో వచ్చే రూమర్స్ గురించి ఎక్కువగా ఆలోచించను. గతంలో ఓ డాక్టర్‌తో నా పెళ్లి జరగనుందని రాశారు.. ఇప్పుడు ఓ వ్యాపారవేత్తని పెళ్లి చేసుకోబోతున్నానని ప్రచారం చేస్తున్నారు. పెళ్లనేది జీవితంలో ఎంతో ముఖ్యమైనది. మా ఇంట్లో కూడా ఎప్పట్నుంచో పెళ్లి చేసుకోమంటున్నారు. సంబంధాలు కూడా చూస్తు న్నారు. కానీ, నేనింకా ఏ నిర్ణయం తీసుకోలేదు.. ఆ టైమ్ వస్తే నేనే చెబుతాను.

సందేశంతో సేట్‌జీ


● స్వప్న, సాయికృష్ణ

తల్లాడ సాయికృష్ణ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'నమస్తే సేట్‌జీ..'. అమ్మినేని స్వప్న హీరోయిన్. తల్లాడ శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం ఈ 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాతలు రామసత్యనారాయణ, మహంకాళి దివాకర్ పాల్గొని ట్రైలర్, ఆడియోలను లాంచ్ చేశారు. సాయికృష్ణ మాట్లాడుతూ– ''కిరాణా షాపు యజమానుల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. కరోనా టైమ్‌లో నన్ను కలచివేసిన వాస్తవ ఘటనలతో సందేశాత్మకంగా ఈ సినిమా తీశాను'' అన్నారు. ''ప్రతి కిరాణా షాపు యజమాని చూడాల్సిన చిత్రమిది'' అన్నారు తల్లాడ శ్రీనివాస్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
208	58
62,626	18,643

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,038	▽	202
డోజోన్స్	33,606	▽	341
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,521	▽	46
డాక్స్	14,343	▽	104
షాంఘై	3,213	△	1
నికాయ్	27,886	△	65

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	53,629	▽ 225
బంగారం (99.5 స్వచ్ఛత)	53,414	▽ 224
వెండి (కిలో)	64,648	▽ 1,116

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.50	83.17
€	యూరో	ఎస్‌బీఐ	84.87	87.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.77	102.07
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	59.20	61.10
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.27	56.61
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.74	61.71
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.03	22.71
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.60	23.39
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.69	12.72

రూపాయికి మరో షాక్

- మళ్లీ 65 పైసలు పతనం
- 4 వారాల కనిష్టం, 82.50కు



ముంబై: డాలరు మారకంలో వరుసగా మూడో రోజు దేశీ కరెన్సీ నీరసించింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి 65 పైసలు పతనమైంది. ఇది గత ఆరు వారాల్లోనే అత్యధిక నష్టంకాగా.. 4 వారాల కనిష్టం 82.50 వద్ద ముగిసింది. ఆర్‌బీఐ పాలసీ సమీక్ష నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు సైతం మూడో రోజు డీలా పడగా.. విదేశీ ఇన్వెస్టర్లు తిరిగి అమ్మకాల బాట పట్టడం రూపాయిని దెబ్బతీస్తున్నట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. దీనికి తోడు ముడిచమురు ధరలు తిరిగి బలపడుతున్నాయి. తాజాగా లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.65 శాతం ఎగసి 83.22 డాలర్లను తాకింది. మరోవైపు ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు 105.24కు పుంజుకుంది. కాగా.. రూపాయి సోమవారం 52 పైసలు కోల్పోయి 81.85 వద్ద స్థిరపడిన సంగతి తెలిసిందే. వెరసి మూడు రోజుల్లో రూపాయి 124 పైసలు పడిపోయింది!

నేలచూపులోనే

డాలరు, చమురు ధరల ప్రభావంతో రూపాయి వెనకడుగుతో ప్రారంభమైంది. ఒక దశలో 82.63 వరకూ పతనమైంది. 81.94 వద్ద ప్రారంభమైన రూపాయికి ఇదే ఇంట్రాడే గరిష్టంకావడం గమనార్హం! డాలరు మారకంలో రూపాయి విలువ ఈ ఏడాది ప్రారంభం నుంచి చూస్తే 10 శాతం క్షీణించింది. డాలరు ఇండెక్స్ 114 వద్ద రెండు దశాబ్దాల గరిష్టానికి చేరడంతో అక్టోబర్ 19న చరిత్రాత్మక కనిష్టం 83 వద్ద ముగిసింది. ప్రస్తుతం ఈ స్థాయికి చేరువలో నిలవడం ప్రస్తావించదగ్గ అంశం!!

మూడో రోజూ నేలచూపు

- సెన్సెక్స్ 208 పాయింట్లు డౌన్
- 62,626 వద్ద ముగింపు
- నిఫ్టీ 58 పాయింట్ల క్షీణత
- ప్రభుత్వ బ్యాంకుల ఎదురీత

ముంబై: వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు నష్టాలతో నిలిచాయి. సెన్సెక్స్ 208 పాయింట్లు క్షీణించి 62,626 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సైతం 58 పాయింట్ల వెనకడుగుతో 18,643 వద్ద స్థిరపడింది. తొలి నుంచీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే ప్రాధాన్యమివ్వడంతో మార్కెట్లు రోజంతా నేల చూపులకే పరిమితమయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 445 పాయింట్లు పతనమై 62,390ను తాకగా.. నిఫ్టీ 123 పాయింట్లు నీరసించి 18,578 దిగువకు చేరింది. చమురు ధరల పెరుగుదల, గ్లోబల్ మార్కెట్లు బలహీనపడటం, రూపాయి పతనం వంటి అంశాలు సెంటిమెంటును దెబ్బతీసినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలియజేశారు.

ఐటీ వీక్..: ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఐటీ 1.5 శాతం నష్టపోగా.. మీడియా, మెటల్, ఫార్మా, రియల్టీ, ప్రయివేట్ బ్యాంక్స్ 1–0.5 శాతం మధ్య డీలా పడ్డాయి. అయితే పీఎస్‌యూ బ్యాంక్స్ 1.25 శాతం ఎగశాయి. నిఫ్టీ దిగ్గజాలలో బీపీసీఎల్, హిండాల్కో, టాటా స్టీల్, డాక్టర్ రెడ్డీస్, యూపీఎల్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్, ఐషర్, ఎస్‌బీఐ, జేఎస్‌డబ్ల్యూ, టాటా స్టీల్ 3–1.3 శాతం మధ్య క్షీణించాయి. ఇతర బ్లూచిప్స్‌లో అదానీ, హెచ్‌యూఎల్, నెస్లే, బజాజ్ ఆటో, అల్ట్రాటెక్, యాక్సిస్, పవర్‌గ్రిడ్, గ్రాసిమ్, బ్రిటానియా, హెచ్‌డీఎఫ్‌సీ 2.5–0.5 శాతం మధ్య లాభపడ్డాయి.



చిన్న షేర్లు సైతం..: మార్కెట్ల బాటలో బీఎస్‌ఈ మిడ్ క్యాప్ 0.5 శాతం నీరసించింది. ట్రేడైన షేర్లలో 1,936 నష్టపోగా.. 1,563 పుంజుకున్నాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 635 కోట్లు, దేశీ ఫండ్స్(డీఐఐలు) దాదాపు రూ. 559 కోట్లు చొప్పున అమ్మకాలు చేపట్టాయి. సోమవారం సైతం ఎఫ్‌పీఐలు రూ. 1,139 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న సంగతి తెలిసిందే.

స్టాక్ హైలైట్స్

- రానున్న ఐదేళ్లలో అమ్మకాలను మూడు రెట్లు పెంచుకునే ప్రణాళికలు ప్రకటించడంతో వెస్ట్‌లైఫ్ ఫుడ్ వరల్డ్ షేరు 6 శాతం జంప్‌చేసింది. రూ. 782 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ. 815ను అధిగమించడం ద్వారా సరికొత్త గరిష్టాన్ని అందుకుంది.
- విభిన్న సెక్యూరిటీల జారీ ద్వారా రూ. 400 కోట్ల సమీకరణ అంశంపై వారాంతాన సమావేశంకానున్నట్లు వెల్లడించడంతో ఆస్ట్రా మైక్రోవేవ్ షేరు 5 శాతం జంప్‌చేసింది. రూ. 322 వద్ద ముగిసింది. తొలుత రూ. 329ను సైతం దాటింది.
- ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఐవోసీ నుంచి రూ. 343 కోట్లకుపైగా విలువైన కాంట్రాక్టును పొందడంతో అయాన్ ఎక్స్ఛేంజ్ (ఇండియా) షేరు 2.4 శాతం బలపడి రూ. 2,975 వద్ద నిలిచింది. తొలుత రూ. 2,988 వద్ద సరికొత్త గరిష్టాన్ని సాధించింది.
- సొంత ఈక్విటీ షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనపై శుక్రవారం సమావేశంకానున్నట్లు పేర్కొనడంతో బజాజ్ కన్జూమర్ షేరు తొలుత 5 శాతం జంప్‌చేసి రూ. 185కు చేరింది. చివరికి 1.6 శాతం లాభంతో రూ. 178 వద్ద ముగిసింది.

184 దేశాలకు ఒకే రోమింగ్ ప్యాక్

ఎయిర్‌టెల్ వరల్డ్ పాస్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విదేశీ ప్రయాణం చేసేవారి కోసం ఎయిర్‌టెల్ వరల్డ్ పాస్ పేరుతో ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌ను పరిచయం చేసింది. ఈ ప్యాక్‌తో కస్టమర్లు 184 దేశాల్లో రోమింగ్ సేవలను పొందవచ్చు. ప్రీపెయిడ్, పోస్ట్‌పెయిడ్‌లోనూ ఇవి లభిస్తాయి. ఇంటర్నెట్, కాల్స్ వినియోగం, బిల్లు వంటి విషయాలను వినియోగదార్లు ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్‌లో తెలుసుకోవచ్చు. ఒకరోజుతో మొదలుకుని 365 రోజుల కాలపరిమితితో ఇవి లభిస్తాయి. ఎంచుకున్న ప్యాక్‌నుబట్టి చార్జీ రూ.649 నుంచి రూ.14,999 వరకు ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-12-2022	
విశాఖ	545–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	544–00
విజయవాడ	544–00
రిటైల్ ధర (డజను)	78.00
6-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	541–00
వరంగల్	543–00
రిటైల్ ధర	6.00

భారత్ వృద్ధి రేటు అప్‌గ్రేడ్

- ప్రపంచ బ్యాంక్ 'యూ' టర్న్
- క్రితం 6.5% అంచనాలు 6.9 శాతానికి పెంపు
- సవాళ్లను ఎదుర్కోగలగడమే తాజా పెంపునకు కారణం





న్యూఢిల్లీ: భారత్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) వృద్ధి అంచనాలను పలు అంతర్జాతీయ, దేశీయ ఆర్థిక సంస్థలు తగ్గిస్తున్న నేపథ్యంలో ప్రపంచబ్యాంక్ ఇందుకు భిన్నంగా మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. వృద్ధి రేటు అంచనాలను తాజాగా 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచింది. నిజానికి అక్టోబర్‌లోనే బహుళజాతి బ్యాంకింగ్ దిగ్గజం భారత్ 2022–23 వృద్ధి రేటును 7.5 శాతం నుంచి 1 శాతం తగ్గించింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి దిగివచ్చింది. అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్లను తట్టుకుని భారత్ ఎకానమీ నిలబడగలగడమే తాజా 40 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) అంచనా పెంపునకు కారణమని పేర్కొంది. దీనితో పాటు రెండవ (సెప్టెంబర్) త్రైమాసికంలో భారత్ ఎకానమీ వృద్ధి రేటు అంచనాలకు మించి 6.3 శాతంగా నమోదుకావడమూ తమ తాజా ఎగువముఖ సవరణకు కారణమని వివరించింది. భారత్ ఎకానమీ మొదటి త్రైమాసికంలో 13.5 శాతం పురోగతి సాధించిన సంగతి తెలిసిందే. 'నావిగేటింగ్ ది స్టోమ్' (తుపానులో ప్రయాణం) శీర్షికన ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్ నివేదికలో మరి కొన్ని ముఖ్యాంశాలు...

- క్షీణిస్తున్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు భారతదేశ వృద్ధి అవకాశాలపైనా ప్రభావం చూపుతాయి. అయితే ఇతర అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో పోలిస్తే భారత్ ఎకానమీ అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొనగలుగుతోంది.
- మంచి డిమాండ్ వాతావరణంలో ప్రపంచంలోనే వేగవంతమైన ఎకానమీ హోదాను కొనసాగిస్తోంది.
- అయితే అంతర్జాతీయ పరిణామాలపై నిరంతర నిఘా అవసరం. అభివృద్ధి చెందిన దేశాల కఠిన ద్రవ్య పరపతి విధానాలు, రూపాయి పతనం, కమోడిటీ ధరల తీవ్రత, ఆయా అంశాల నేపథ్యంలో కరెంట్ అకౌంట్ సవాళ్లు దేశం ఎదుర్కొనే వీలుంది. దీనితోపాటు ఎగుమతుల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి అవసరం.
- 2023–24లో ఎకానమీ వృద్ధి రేటు 6.6%గా నమోదుకావచ్చు.
- భారీ పన్ను వసూళ్ల నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు 2022–23లో లక్ష్యాల మేరకు జీడీపీలో 6.4%కి (విలువలో రూ.16.61 లక్షల కోట్లు) కట్టడి కావచ్చు.

2022-23పై పలు సంస్థల అంచనాలు(%ల్లో)

సంస్థ	ప్రస్తుత	తొలి
ఐఎంఎఫ్	6.8	7.4
ఫిక్కీ	7.0	7.8
సిటీగ్రూప్	6.7	8.0
గోల్డ్‌మన్ శాక్స్	7.0	7.2
ఆర్‌బీఐ	7.0	7.2
ఏడీబీ	7.0	7.2
ఎస్‌బీఐ	6.8	7.5
మూడీస్	7.6	--
క్రిసిల్	7.3	--
ఇండియా రేటింగ్స్	6.9	--
ఓఈసీడీ	6.9	--
ఇక్రా	7.2	--

ఫిచ్ 7% అంచనా యథాతథం

కాగా, ఫిచ్ రేటింగ్ 2022–23 ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి అంచనాలను యథాతథంగా 7 శాతంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. అయితే వచ్చే రెండు ఆర్థిక సంవత్సరాల అంచనాలను తగ్గిస్తున్నట్లు తెలిపింది.

వైభవ్ జెమ్స్ ఐపీవోకు ఓకే

కంకార్డ్ బయోటెక్‌కూ సెబీ అనుమతి

న్యూఢిల్లీ: విశాఖపట్టణం కేంద్రంగా కార్యకలాపాలు విస్తరించిన వైభవ్ జెమ్స్ అండ్ జ్యువెలర్స్‌తోపాటు రేర్ ఎంటర్‌ప్రైజెస్‌కు పెట్టుబడులున్న కంకార్డ్ బయోటెక్ త్వరలో పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. ఇందుకు వీలుగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆగస్ట్‌లో కంకార్డ్, సెప్టెంబర్‌లో వైభవ్ సెబీకి ప్రాథమిక ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. ఇతర వివరాలు చూద్దాం..

వైభవ్ జెమ్స్

బంగారు ఆభరణాల విక్రేత వైభవ్ జెమ్స్ అండ్ జ్యువెలర్స్ పబ్లిక్ ఇష్యూకి సెబీ అనుమతించింది. ఐపీవోలో భాగంగా కంపెనీ రూ. 210 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రమోటర్ సంస్థ గ్రంధి భారత మల్లికా రత్న కుమారి(హెచ్‌యూఎఫ్) 43 లక్షల షేర్లను ఆఫర్ చేయనున్నట్లు ప్రాస్పెక్టస్‌లో పేర్కొంది. ఈక్విటీ జారీ నిధులలో రూ. 12 కోట్లను 8 కొత్త షోరూముల ఏర్పాటుకు వినియోగించనుంది. రెండేళ్లపాటు ఇన్వెంటరీ కొనుగోలుకి మరో రూ. 160 కోట్లు కేటాయించనుంది. సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం నిధులను వెచ్చించనుంది. బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి ఆభరణాలను కంపెనీ విక్రయిస్తోంది. అంతేకాకుండా విశేష బ్రాండు ద్వారా ప్రీమియం జ్యువెలరీని అందిస్తోంది.



కంకార్డ్ బయోటెక్

ఫెర్మంటేషన్ ఆధారిత బయోఫార్మాస్యూటికల్ ఏపీఐల తయారీ కంపెనీ కంకార్డ్ బయోటెక్ పబ్లిక్ ఇష్యూకి సెబీ అనుమతించింది. ఐపీవోలో భాగంగా పీఈ సంస్థ క్వాడ్రియా క్యాపిటల్‌కు చెందిన హెలిక్స్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్స్ రూ. 2.09 కోట్లకుపైగా విలువైన షేర్లను విక్రయానికి ఉంచనుంది. కంకార్డ్‌లో దివంగత రాకేశ్ ఝన్‌ఝన్‌వాలా, ఆయన భార్య రేఖ ఏర్పాటు చేసిన రేర్ ఎంటర్‌ప్రైజెస్‌కు సైతం పెట్టుబడులున్నాయి. కంపెనీ ప్రధానంగా అంకాలజీ, యాంటీఫంగల్, యాంటీబాక్టీరియల్ తదితర ప్రత్యేక విభాగాలలో కార్యకలాపాలు విస్తరించింది. గుజరాత్‌లో మూడు తయారీ ప్లాంట్లను కలిగి ఉంది. 2022 మార్చికల్లా కంపెనీ 56 బ్రాండ్లతో 65 ప్రొడక్టులను రూపొందిస్తోంది. వీటిలో 22 ఏపీఐలు, 43 ఫార్ములేషన్లు ఉన్నాయి. వీటికి అదనంగా వివిధ దేశాలలో 120 డీఎంఎఫ్‌లను దాఖలు చేసింది.

భవిత

- ప్రభుత్వ ఉద్యోగాల సమాచారం- జాబ్ పాయింట్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

దైలీ కరెంట్ అఫైర్స్ — అన్ని పోటీ పరీక్షలకు ఉపయోగపడే కీలకమైన 'డైలీ కరెంట్ అఫైర్స్' కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్ — మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఈఎస్‌ఐసీ, హైదరాబాద్‌లో 33 స్పెషలిస్ట్ గ్రేడ్-2 పోస్టులు

హైదరాబాద్, చెన్నైలోని ఈఎస్‌ఐసీ ఆసుపత్రుల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 33
» **స్పెషాలిటీ:** కార్డియాలజీ, కార్డియో థొరాసిక్, ఎండోక్రైనాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, క్యాన్సర్ సర్జరీ, యూరాలజీ, పీడియాట్రిక్ సర్జరీ, థొరాసిక్ సర్జరీ.
» **అర్హత:** సంబంధిత స్పెషాలిటీలో ఎంబీబీఎస్, డీఎం, ఎంసీహెచ్, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.12.2022
» **వెబ్‌సైట్:** www.esic.nic.in

ఐడీబీఆర్‌టీలో 10 ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(ఐడీబీఆర్‌టీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్–04, ఫుల్‌స్టాక్ డెవలపర్–06.
» **విభాగాలు:** డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీ, ఏఐ/మెషిన్ లెర్నింగ్. » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్/ఎంసీఏ /ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 2ఏళ్లు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, సంస్థ నిబంధనల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈ–మెయిల్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది హ్యూమన్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్, ఐడీఆర్‌బీటీ, క్యాస్టిల్ హిల్స్, రోడ్ నెం.1, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్–57 చిరునామకు పంపించాలి.
» **ఈమెయిల్:** vkycproject@idrbt.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 11.12.2022
» **వెబ్‌సైట్:** www.idrbt.ac.in

సీడాట్, న్యూఢిల్లీలో 10 సైంటిస్ట్ పోస్టులు

భారత్ టెలికాం టెక్నాలజీ సెంటర్‌కు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ టెలిమాటిక్స్(సీడాట్).. న్యూఢిల్లీ, బెంగళూరులోని కేంద్రాల్లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **విభాగాలు:** అప్లికేషన్స్, రేడియో యాక్సెస్ టెక్నాలజీ, ఓపెన్ ఆర్ఏఎన్, ప్యాకెట్ కోర్ డెవలప్‌మెంట్, ఫీల్డ్ సపోర్ట్ అండ్ వ్యాలిడేషన్, నెట్‌వర్క్ అండ్ సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్, ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్, ఆప్టికల్ టెక్నాలజీస్, బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ మార్కెటింగ్, మొబైల్ నెట్‌వర్క్ రోల్‌అవుట్.
» **అర్హత:** బీఈ, బీటెక్(ఈసీ/సీఎస్), ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 55ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.1,44,200 నుంచి రూ.2,18,200 చెల్లిస్తారు. » **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** careers@cdot.in
» **దరఖాస్తులకు చివరితేది:** 15.12.2022
» **వెబ్‌సైట్:** www.cdot.in

జీవీఎంసీ, విశాఖపట్నం పారిశుద్ధ్య విభాగంలో 482 పోస్టులు

విశాఖపట్నంలోని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పారిశుద్ధ్య విభాగంలో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 482
» **అర్హతలు:** బీపీఎల్ కార్డు, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి. **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.15,000, ఆరోగ్య భృతి రూ.600 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును తెన్నేటి విశ్వనాథ భవనం, గది నెంబర్ 216, శానిటరీ విభాగం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్, విశాఖపట్నం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.12.2022
» **వెబ్‌సైట్:** visakhapatnam.ap.gov.in

ఎస్వీ వైద్య కళాశాల, తిరుపతిలో వివిధ ఉద్యోగాలు

తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజ్.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01
» **పోస్టుల వివరాలు:** మార్చురీ మెకానిక్
» **అర్హత:** డిప్లొమా(ఎల్ఎంఈ)ఉత్తీర్ణులవ్వాలి, రిఫ్రిజరేటింగ్ ప్లాంట్ విభాగంలో పని పరిజ్ఞానం ఉండాలి. **వయసు:** 18 నుంచి 42ఏళ్ల మధ్య ఉండాలి. » **వేతనం:** నెలకు రూ.18,500 చెల్లిస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.12.2022
» **వెబ్‌సైట్:** chittoor.ap.gov.in

ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్, అనంతపురంలో 13 డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు

అనంతపురంలోని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్.. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **అర్హత:** డిగ్రీతో పీజీడీసీఏ లేదా బీఎస్సీ(కంప్యూటర్స్)/బీకాం(కంప్యూటర్స్) /బీటెక్(కంప్యూటర్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.18,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** టెక్నికల్ పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిస్ట్రిక్ట్ హెడ్–హౌసింగ్ కార్యాలయం, అనంతపురం చిరునామకు పంపించాలి. » **చివరితేది:** 14.12.2022
» **వెబ్‌సైట్:** ananthapuramu.ap.gov.in

బీసీ సంక్షేమ మహిళా వ్యవసాయ కళాశాలల్లో 20 టీచింగ్ అసోసియేట్ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం కరీంనగర్, వనపర్తిలలోని మహాత్మా జ్యోతిబాపులే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ.. మహాత్మా జ్యోతిబాపులే బీసీ సంక్షేమ వ్యవసాయ మహిళా డిగ్రీ గురుకుల కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ టీచింగ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 20
» **విభాగాలు:** ఆగ్రోనమీ, జెనెటిక్స్–ప్లాంట్ బ్రీడింగ్, సాయిల్ సైన్స్–అగ్రికల్చర్ కెమిస్ట్రీ, ఎంటమాలజీ, ప్లాంట్ పాథాలజీ, హార్టికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్. » **అర్హత:** ఎంఎస్సీ (అగ్రికల్చర్/హార్టికల్చర్/అగ్రికల్చర్ ఇంజనీరింగ్/అగ్రికల్చర్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** పీహెచ్‌డీ అభ్యర్థులకు నెలకు రూ. 45,000, పీజీ అభ్యర్థులకు నెలకు రూ.40,000 లభిస్తుంది. » **ఇంటర్వ్యూ తేదీ, వేదిక:** 14.12.2022, 15.12.2022, ఆరో అంతస్తు, డీఎస్ఎస్ భవన్, మసాబ్‌ట్యాంక్, హైదరాబాద్.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.12.2022
» **వెబ్‌సైట్:** mjptbcwreis.telangana.gov.in

డబ్ల్యూసీడీఎస్, హైదరాబాద్ జిల్లాలో వివిధ పోస్టులు

హైదరాబాద్ జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, మహిళా శిశు దివ్యాంగులు –వయోవృద్ధుల శాఖ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
» **పోస్టుల వివరాలు:** ప్రొటెక్షన్ ఆఫీసర్–02, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్–01, సోషల్ వర్కర్–01, ఔట్‌రీచ్ వర్కర్–03.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ పీజీ, ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, డబ్ల్యూసీడీఎస్, కలెక్టరేట్ ఆవరణ, మొదటి అంతస్తు, పాత కలెక్టరేట్ భవనం, నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.12.2022
» **వెబ్‌సైట్:** wdcw.tg.nic.in

పీహెచ్‌డీకి మార్గాలివిగో..!

పీహెచ్‌డీలో ప్రవేశాలకు యూజీసీ నూతన మార్గదర్శకాలు విడుదల చేసింది. నాలుగేళ్ల గ్రాడ్యుయేషన్‌తోనే పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు వీలు కల్పించింది. ఈ నేపథ్యంలో.. ప్రస్తుతం దేశంలో పీహెచ్‌డీలో చేరేందుకు అందుబాటులో ఉన్న వివిధ ప్రవేశ మార్గాల గురించి తెలుసుకుందాం...



హయ్యర్ ఎడ్యుకేషన్

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్

శాస్త్రసాంకేతిక రంగాల్లో పరిశోధనల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు.. జాతీయ స్థాయిలోని యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లలో పీహెచ్‌డీలో ప్రవేశం పొందేందుకు సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ పరీక్షలో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. కౌన్సిల్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ సైంటిఫిక్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)లు సంయుక్తంగా నిర్వహించే పరీక్ష సీఎస్ఐఆర్–యూజీసీ నెట్. లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్ తదితర విభాగాల్లో.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రీసెర్చ్ లేబొరేటరీల్లో పీహెచ్‌డీలో ప్రవేశించేందుకు సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ఉత్తీర్ణత చక్కటి మార్గం. 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్–ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులైన వారు సీఎస్ఐఆర్ – యూజీసీ నెట్‌కు హాజరు కావచ్చు.

వెబ్‌సైట్: www.csirhrdg.res.in

పీహెచ్‌డీ వయా యూజీసీ నెట్

సామాజిక అభివృద్ధి ఆకాంక్ష ఉన్న విద్యార్థులు.. సామాజికంగా ఎదురవుతున్న సమస్యలకు తమ పరిశోధనల ద్వారా పరిష్కారం కనుగొనాలనుకుంటే.. వారికి అందుబాటులో ఉన్న చక్కటి మార్గం.. యూజీసీ–నెట్. లాంగ్వేజెస్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో యూజీసీ–నెట్ అర్హతతో పీహెచ్‌డీలో ప్రవేశం సుగమం చేసుకోవచ్చు. ప్రతి ఏటా రెండు సార్లు నిర్వహించే ఈ టెస్ట్‌కు సంబంధిత సబ్జెక్ట్ స్పెషలైజేషన్‌తో పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. యూజీసీ నెట్‌లో అర్హత సాధించి జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) పొందితే.. జాతీయ స్థాయిలోని సోషల్ సైన్సెస్ ఇన్‌స్టిట్యూట్స్, మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌తోపాటు యూనివర్సిటీల్లోని సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశం పొందొచ్చు.

వెబ్‌సైట్: https://ugcnet.nta.nic.in

రీసెర్చ్ ల్యాబ్స్‌లో పీహెచ్‌డీకి.. జెస్ట్

పీహెచ్‌డీ అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో అద్భుత మార్గం.. జెస్ట్! దేశంలోనే ప్రతిష్టాత్మకమైన రీసెర్చ్ ల్యాబ్స్‌లోకి అడుగుపెట్టే అవకాశం కల్పిస్తుంది.. జెస్ట్(జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్). ఫిజిక్స్, థియెరాటికల్ కంప్యూటర్ సైన్స్/న్యూరోసైన్స్/కంప్యుటేషనల్ బయాలజీ సబ్జెక్ట్‌లలో నిర్వహించే జెస్ట్‌లో విజయం సాధిస్తే..ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్సెస్, హోమీబాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్, హరీశ్ చంద్ర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఐఐఎస్సీ–బెంగళూరు వంటి 29 రీసెర్చ్ కేంద్రాల్లో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో, అదే విధంగా ఎంఎస్ బై రీసెర్చ్ వంటి ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం పొందొచ్చు.

వెబ్‌సైట్: https://www.jest.org.in

గేట్‌తో.. ఐఐటీలు, నిట్‌లు

గేట్.. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్. బీటెక్ చదువుతున్న విద్యార్థులందరికీ సుపరిచితమైన పరీక్ష ఇది. ప్రతి ఏటా నిర్వహించే ఈ పరీక్షలో ఉత్తీర్ణతతోనూ పీహెచ్‌డీలో ప్రవేశించేందుకు అవకాశం ఉంది. గేట్ స్కోర్ ఆధారంగా రాష్ట్రాల స్థాయిలోని యూనివర్సిటీలతోపాటు.. దేశంలోనే టెక్నికల్ విద్యకు ప్రతిష్టాత్మకంగా భావించే ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు.ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లతోపాటు సైన్సెస్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ అభ్యర్థులు కూడా గేట్ రాసేందుకు అవకాశం కల్పించారు. గేట్ ద్వారా పీహెచ్‌డీలో ప్రవేశం పొందితే ఫెలోషిప్ సైతం లభిస్తుంది. ముఖ్యంగా జాతీయ స్థాయితో పాటు, రాష్ట్ర స్థాయిలోని ఇన్‌స్టిట్యూట్స్‌లోనూ ప్రవేశాల్లో గేట్ అభ్యర్థులకు ప్రాధాన్యం లభిస్తుంది.

వెబ్‌సైట్: https://gate.iitk.ac.in

ఐఐఎంల్లో ఫెలో ప్రోగ్రామ్/పీహెచ్‌డీ

ప్రస్తుత కార్పొరేట్ యుగంలో మేనేజ్‌మెంట్ (నిర్వహణ) రంగం సరికొత్త పుంతలు తొక్కుతోంది. మేనేజ్‌మెంట్ విభాగాల్లోనూ పరిశోధనలు ఆవశ్యకమవుతున్నాయి. మేనేజ్‌మెంట్‌లో రీసెర్చ్ చేయడానికి సరైన వేదికలు దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) క్యాంపస్‌లు అని చెప్పొచ్చు. ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ పేరుతో ఐఐఎంలు రీసెర్చ్‌కు అవకాశం కల్పిస్తున్నాయి. ఈ ప్రోగ్రామ్ పీహెచ్‌డీకి సమానంగా పరిగణిస్తారు. క్యాట్, జీమ్యాట్ స్కోర్ ఆధారంగా వీటిలో అడుగుపెట్టొచ్చు. దేశంలోని దాదాపు అన్ని ఐఐఎంలలో ఇప్పుడు మేనేజ్‌మెంట్ పీహెచ్‌డీ అవకాశం అందుబాటులోకి వచ్చింది.

వెబ్‌సైట్: https://iimcat.ac.in

ప్రతిష్టాత్మక ఫెలోషిప్.. పీఎంఆర్ఎఫ్

దేశంలో రీసెర్చ్ అభ్యర్థులకు అందుబాటులోకి వచ్చిన మరో ప్రధాన మార్గం.. ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్ స్కీమ్(పీఎంఆర్ఎఫ్). సైన్స్/ఇంజనీరింగ్ /టెక్నాలజీ విభాగాల్లో పరిశోధనలను ప్రోత్సహించేందుకు ఈ స్కీమ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు, ట్రిపుల్ ఐటీల్లో ఆయా విభాగాల్లో పీహెచ్‌డీలోకి ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఈ స్కీమ్‌ను తెచ్చారు.

బీటెక్ చివరి సంవత్సరం అభ్యర్థులు మొదలు ఎంటెక్, ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ, డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ అభ్యసిస్తున్న వారు ఈ స్కీమ్ ద్వారా పైన పేర్కొన్న ఇన్‌స్టిట్యూట్‌లలో పీహెచ్‌డీలో ప్రవేశం పొందొచ్చు.

నాలుగంచెల విధానంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. నామినేషన్, డిటెయిల్డ్ అప్లికేషన్, ఎవాల్యుయేషన్, ఫైనల్ సెలక్షన్.

గేట్‌లో కనీసం 650 స్కోర్‌తో ఉత్తీర్ణత సాధించాలి. ఐఐటీలు, ఎన్ఐటీల్లోనే అకడమిక్ డిగ్రీలు చదువుతున్న అభ్యర్థులు ప్రతి సెమిస్టర్‌లో సీజీపీఏ ఎనిమిది పాయింట్లు పొందాలి. ఈ అర్హతలు ఉన్న అభ్యర్థులు తమ రీసెర్చ్ ప్రతిపాదన అంశాన్ని పీఎంఆర్ఎఫ్ ద్వారా తెలియజేయాలి. వీటిని నిపుణుల కమిటీ సమీక్షిస్తుంది. ఈ సమీక్షలో సంతృప్తికరమైన ప్రతిపాదనలు పంపిన విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి.. ఆయా క్యాంపస్‌లలో పీహెచ్‌డీ చేసే విధంగా అలాట్‌మెంట్ చేస్తుంది.

ఎంపికైన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.70వేలు, మూడో ఏడాది నెలకు రూ.75వేలు, నాలుగో సంవత్సరం నెలకు రూ.80వేలు, ఐదో సంవత్సరం నెలకు రూ.80వేలు అందిస్తారు. ఇంటిగ్రేటెడ్ కోర్సుతో పీహెచ్‌డీలో చేరిన వారికి నాలుగో ఏడాది వరకే ఈ ఫెలోషిప్ లభిస్తుంది. అదేవిధంగా బీటెక్‌తో ఐదో ఏడాది కూడా ఫెలోషిప్ అందుతుంది. వెబ్‌సైట్: https://www.pmrf.in

క్లుప్తంగా

సీఎస్‌ను కలిసిన సమాచార కమిషనర్లు

సాక్షి, అమరావతి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా బాధ్యతలు స్వీకరించిన కేఎస్ జవహర్‌రెడ్డిని సమాచార కమిషనర్లు మంగళవారం సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్య సమాచార కమిషనర్ ఆర్.మహబూబ్ బాషా, కమిషనర్లు బీవీ రమణ కుమార్, కట్టా జనార్దనరావు, ఐలాపురం రాజా, రేపాల శ్రీనివాసరావు, యు.హరి ప్రసాద్ రెడ్డి, కాకర్ల చెన్నారెడ్డి, పి.శామ్యూల్ జొనాతన్, సమాచార కమిషన్ కార్యదర్శి వి.సాంబశివ రాజు పాల్గొన్నారు.

పారామెడికల్ సీట్ల కేటాయింపు



సాక్షి, అమరావతి: 2022–23 విద్యా సంవత్సరానికి పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాల్లో భాగంగా రెండో విడత కన్వీనర్ కోటా సీట్ల కేటాయింపు జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ మంగళవారం విడుదల చేసింది. https://ugparamedical. ntruhs-admissions. com/ ugpm& allotment/ లో అలాట్‌మెంట్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తమకు కేటాయించిన కాలేజీల్లో విద్యార్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల డిగ్రీ, బీపీటీ, ఎంఎల్టీ, ఇతర పారామెడికల్ కోర్సు చేయడానికి 349 కళాశాలల్లో 10,004 సీట్ల భర్తీకి ఇప్పటివరకు 2 పర్యాయాలు కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా..9,027 సీట్లను కేటాయించగా, 977 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

రేషన్ డీలర్ల ఉపాధి భద్రతకు చర్యలు తీసుకోవాలి

- సీఎం వైఎస్ జగన్‌కు సీపీఎం నేత మధు లేఖ

సాక్షి, అమరావతి: రేషన్ డీలర్ అథెంటికేషన్‌తో డోర్ డెలివరీ చేసే విధానం కావాలని వారు కోరుతున్నారని, వారి ఉపాధి రక్షణకు చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌కి సీపీఎం సీనియర్ నేత పి.మధు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎంకు రాసిన లేఖను మంగళవారం మీడియాకు విడుదల చేశారు. కేవలం బియ్యం మాత్రమే పంపిణీతో డీలర్ల మార్జిన్ బాగా తగ్గిపోయిందని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం తాలూకు సరఫరా చేసిన బియ్యం బిల్లుల బకాయిలు ఏళ్ళ తరబడి చెల్లించలేదన్నారు. నాన్ పీడీఎస్ సరుకులు అమ్ముకునే విధానం ఇంటింటికీ సరఫరా విధానం వల్ల ఆగిపోయిందన్నారు. వీటన్నింటి వల్ల వేలాది మంది డీలర్ల ఉపాధి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీలర్ల జీవనోపాధికి ప్రత్యామ్నాయం చూపాలని, వారికి కూడా సంక్షేమ విధానాలు వర్తింపజేయాలని మధు విజ్ఞప్తి చేశారు.

వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలను ప్రోత్సహించాలి

ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తల వినతి



పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలకు పారిశ్రామికంగా ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు పారిశ్రామిక వేత్తలు కోరారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలో ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు సమావేశమై సలహాలు, సూచనలు ఇచ్చారు. రాష్ట్రంలో వైఎస్సార్ వన్, వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం ద్వారా ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు భరోసా ఇస్తోందన్నారు. గత ప్రభుత్వంలోని పెండింగ్ రాయితీ బకాయిలను కూడా విడుదల చేసి ఆర్థిక తోడ్పాటును అందించిందని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు 2009 నుంచి 2020 మధ్యలో కేటాయించిన స్థలాల్లో పరిశ్రమల స్థాపన లేకపోవడంతో వాటిని రద్దు చేశారని, ఇప్పుడు తిరిగి వాటిని పాతవారికే కేటాయిస్తుండడం మంచి పరిణామమన్నారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు ప్రభుత్వం కల్పిస్తున్న సింగిల్ విండో సేవలు, రాయితీలు వినియోగించుకునేలా ప్రతి కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ విధానంలో హ్యాండ్ హోల్డింగ్ సేవలను అందుబాటులోకి తేవాలని అభిప్రాయపడ్డారు. ఎఫ్ఎస్ఎంఈ ఇండియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీనివాస్ రంగారావు, ఫ్యాప్సీయా అధ్యక్షుడు మురళీకృష్ణ, ఇతర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీని తాకనున్న 'మాండూస్'

వాయుగుండంగా మారిన అల్పపీడనం



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/సూళ్లూరుపేట: దక్షిణ అండమాన్ సముద్రంలో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం సాయంత్రానికి వాయుగుండంగా బలపడింది. మంగళవారం రాత్రికి ఇది చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 1,020 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం బుధవారం సాయంత్రానికి పశ్చిమ వాయవ్యదిశలో కదులుతూ మాండూస్ తుపానుగా బలపడి గురువారం ఉదయానికి నైరుతి బంగాళాఖాతంలోని ఉత్తర తమిళనాడు–పుదుచ్చేరి, దక్షిణ కోస్తాంధ్ర తీరానికి సమీపంలోకి చేరుకుంటుంది. అనంతరం అదేదిశలో పయనిస్తూ 48 గంటల పాటు అదేప్రాంతంలో కొనసాగనుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం రాత్రి విడుదల చేసిన ప్రత్యేక బులెటిన్‌లో వెల్లడించింది. మాండూస్ తుపాను 9వ తేదీన తమిళనాడులోని మహాబలిపురం సమీపంలో తీరం దాటే అవకాశం ఉంది. తుపానుగానైనా లేకపోతే బలహీనపడి వాయుగుండంగానైనా తీరం దాటిన తరువాత ఇది చిత్తూరు వైపు కదులుతూ క్రమంగా ఇంకా బలహీనపడే అవకాశం ఉంది. దీని ప్రభావం 8, 9, 10 తేదీల్లో ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, కడప, అనంతపురం, ప్రకాశం జిల్లాలపై ఉండనుంది. ఈ జిల్లాల్లో అక్కడక్కడా భారీనుంచి అతిభారీ వర్షాలు పడతాయని, మిగిలినచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. సముద్రం అలజడిగా మారుతుందని, అందువల్ల మత్స్యకారులు ఈ నెల 10వ తేదీ వరకు చేపలవేటకు వెళ్లవద్దని విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే వెనక్కి తిరిగిరావాలని కోరింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కచ్చా ఇళ్లకు నష్టం వాటిల్లుతుందని, విద్యుత్, సమాచార, రవాణా వ్యవస్థలకు అంతరాయం కలుగుతుందని, చెట్లు కూలే ప్రమాదం ఉందని, పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యే వీలుందని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీ.ఆర్.అంబేద్కర్ కోరారు. బుధవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు పులికాట్ సరస్సులో చేపలవేటకు వెళ్లవద్దని సూళ్లూరుపేట ఆర్డీవో కె.ఎం.రోజ్‌మాండ్ మత్స్యకారులకు సూచించారు.

తుపానును ఎదుర్కొనేందుకు సన్నద్ధం

- సహాయచర్యలకు 11 ఎస్డీఆర్ఎఫ్, 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని హెచ్చరించాం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి చెప్పారు. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ మంగళవారం ఢిల్లీ నుంచి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తుపాన్‌ను ఎదుర్కొనే ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానంగా నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, అనంతపురంతో పాటు మరో రెండు సమీప జిల్లాలపై తుపాన్ ప్రభావం ఉంటుందని చెప్పారు. ఇప్పటికే ఆయా జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏటిగట్లు, రిజర్వాయర్లకు గండ్లుపడకుండా ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. సహాయచర్యలు అందించేందుకు 11 ఎస్డీఆర్ఎఫ్, 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తుపాన్ దృష్ట్యా మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లవద్దని హెచ్చరించినట్లు చెప్పారు. ఇప్పటికే వేటకు వెళ్లినవారు ఒడ్డుకు చేరుకునేలా సందేశాలు పంపించామన్నారు. కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ మాట్లాడుతూ తుపాన్ ప్రభావం ఎక్కువ ఉండే జిల్లాల్లోని లోతట్టు ప్రదేశాలు, గుడిసెలు, కచ్చా ఇళ్లలో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వీడియో సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణసంస్థ డైరెక్టర్ బి.ఆర్.అంబేద్కర్, భారత వాతావరణశాఖ రాష్ట్ర డైరెక్టర్ స్టెల్లా పాల్గొన్నారు.

వంశీరామ్ బిల్డర్స్‌పై ఐటీ దాడులు

▶ మొదటి పేజీ తరువాయి

మనీలాండరింగ్ కోణం కూడా అధికారుల దృష్టికొచ్చినట్టు తెలిసింది. ఈ సంస్థ తన వినియోగదారులకు విక్రయించిన నివాస, వాణిజ్య సముదాయాలకు సంబంధించిన లావాదేవీల్లో సగం మొత్తాన్ని వైట్‌గా, మరో సగం బ్లాక్‌గా వసూలుచేసినట్లు సమాచారం. తన దగ్గర పనిచేస్తున్న ఉద్యోగులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి వాటి నుంచి నిధులు మళ్లించారని చెబుతున్నారు. దాడుల్లో పలు కీలక పత్రాలు, పెద్ద ఎత్తున నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. సంస్థ పెద్ద ఎత్తున ఇతరులతో ఆస్తులకు సంబంధించి చేసుకున్న ఒప్పంద పత్రాలనూ అధికారులు తీసుకెళ్లినట్టు సమాచారం. ఉదయం నుంచి మొత్తం 36 ప్రాంతాల్లో ఈ సోదాలు చేసినట్లు అధికార వర్గాల సమాచారం. వినియోగదారుల నుంచి నగదు రూపంలో తీసుకున్న మొత్తాన్ని యాజమాన్యం హవాలా ద్వారా తరలించినట్లు చెబుతున్నారు. ఈ దాడులకు సంబంధించి ఐటీ అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

విజయవాడ, నెల్లూరులలోనూ సోదాలు

ఆదాయ పన్ను శాఖ అధికారులు విజయవాడ, నెల్లూరులలోనూ సోదాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేత దేవినేని అవినాశ్ హైదరాబాద్‌లో తమ కుటుంబానికి చెందిన ఓ స్థలాన్ని ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు డెవలప్‌మెంట్ కోసం ఒప్పందం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ రియల్ ఎస్టేట్ సంస్థతో పాటు నెల్లూరులోని ఆ సంస్థ డైరెక్టర్ నివాసం, విజయవాడలోని దేవినేని అవినాశ్ నివాసాలలోనూ సోదాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా అవినాశ్ నివాసాల్లో దాడులను నిరసిస్తూ ఆయన అభిమానులు విజయవాడలో ఆందోళన చేపట్టారు.

బొల్లినేని గాంధీ సస్పెన్షన్ పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బొల్లినేని శ్రీనివాసగాంధీ సస్పెన్షన్‌ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) మరోసారి పొడిగించింది. 2021 ఫిబ్రవరిలో బొల్లినేని సస్పెన్షన్‌కు గురయ్యారు. అప్పటినుంచి ఇప్పటివరకు అనేకసార్లు సస్పెన్షన్‌ను పొడిగించారు. తాజాగా ఆయన సస్పెన్షన్‌ను 2023 మే 7వ తేదీ వరకు పొడిగించింది. సెంట్రల్ జీఎస్టీకి సంబంధించిన ఎగవేత నిరోధక విభాగంలో బొల్లినేని పనిచేస్తున్నప్పుడు వివేకానందస్వామి దాఖలు చేసిన ఫిర్యాదుపై సీబీఐ చర్య తీసుకుంది. అయితే అనంతరం అదే విభాగంలో ఆయన కొనసాగారు. కానీ 2021 ఫిబ్రవరిలో సీబీఐసీ బొల్లినేని గాంధీతో పాటు మరో అధికారి సుధారాణిని లంచం కేసులో సస్పెండ్ చేసింది. అప్పటినుంచి బొల్లినేని సస్పెన్షన్‌ను పొడిగిస్తోంది.

పెండింగ్ ఫైళ్లపై దేవదాయ శాఖ దృష్టి

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖలో అధికారుల వద్ద గత పదేళ్లకుపైగా పరిష్కారానికి నోచుకోని వేలకొద్దీ పెండింగ్ ఫైళ్ల దుమ్ము దులిపే పని మొదలైంది. రాష్ట్ర కమిషనర్ నుంచి జిల్లాలో దేవదాయ శాఖ అధికారుల వరకు ప్రస్తుతం తమ వద్ద పేరుకుపోయిన ఫైళ్ల పరిష్కారంపై దృష్టి పెట్టారు. రాష్ట్ర దేవదాయ శాఖలో వివిధ దశల్లో ప్రస్తుతం 12,541 ఫైళ్లు పెండింగ్ ఉన్నాయి. వీటిలో ఎక్కువగా దేవదాయ శాఖ సిబ్బందికి సంబంధించి విజిలెన్స్ విభాగం ఫిర్యాదులు వంటివే ఉన్నాయని ఆ శాఖ అధికార వర్గాలు పేర్కొన్నాయి. నవంబర్ 23వ తేదీ నుంచి డిసెంబర్ ఐదో తేదీ (సోమవారం) వరకు 3,219 ఫైళ్లను పరిష్కరించారు.

రామోజీ.. ఇదా జర్నలిజం?

- ఆయనకు వయస్సు పెరిగినా, బుద్ధి మాత్రం మారలేదు
- అగ్రిటెక్ సమావేశంలో నేను చెప్పిన మాటలను వక్రీకరిస్తారా?
- పథకం ప్రకారం ఈనాడులో అసత్య కథనాలు
- రామోజీలాంటి దగుల్బాజీ బ్లాక్‌మెయిలింగ్ వార్తలకు బెదరం
- బాబు చేసిన అప్పులను ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి చెల్లిస్తున్నారు
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు (సెంట్రల్): ఈనాడు రామోజీరావుకు వయస్సు పెరిగింది కానీ బుద్ధి మాత్రం మారలేదని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లుతూ, రైతులను తప్పుదోవ పట్టించేలా ఈనాడులో అసత్య కథనాలు ప్రచురిస్తున్నారని చెప్పారు. ఇటీవల జరిగిన అగ్రిటెక్ సమావేశంలో తాను మాట్లాడిన విషయాలను వక్రీకరించి అసత్యాలు ప్రచురించారని, ఉద్దేశపూర్వకంగానే ఈ విధంగా రాశారని చెప్పారు. ఇదేమి జర్నలిజమని అన్నారు. మంత్రి మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అగ్రిటెక్ సమావేశంలో మాట్లాడిన వీడియోని ప్రదర్శించారు. గతంలోకంటే సగటున 13 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా వస్తున్నాయని, ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బందులు లేవని ఆయన చెప్పిన మాటలను ప్రదర్శించారు. ఈ మాటలు రామోజీరావు వినాలంటూ చురకలంటించారు. తన ప్రసంగాన్ని మీడియా ముందు ఉంచానని, ఇప్పుడు రామోజీ తల ఎక్కడ పెట్టుకుంటారని అన్నారు. ధాన్యం కొనడానికి ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బందులు లేవని, రైతులు భూసార పరీక్షలు చేయించుకుని, లాభదాయకంగా ఉండే పంటలు వేసుకోవాలని చెప్పానన్నారు. కానీ, ఈనాడులో మాత్రం ధాన్యం కొనడానికి ప్రభుత్వానికి ఇబ్బందులు అని, రైతులకు తలకుమించిన భారం వల్ల వరి సాగు చేయవద్దని అన్నట్లుగా వక్రీకరించి రాశారని తెలిపారు. రామోజీలాంటి దగుల్బాజీ బ్లాక్‌మెయిలింగ్ వార్తలకు బెదిరిపోమని చెప్పారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధికాదాయం పొందేందుకు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి పెడితే మంచిది అన్న నా మాటలను వక్రీకరించిన రామోజీరావు పత్రిక రంగంలో పనిచేయడానికి అనర్హుడని అన్నారు. సొంత ప్రయోజనాల కోసం రామోజీ గడ్డి కరుస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై కథనాలు రాసేందుకు ఒక్క టీం కాదు కదా పది టీంలను పంపినా భయపడబోనని స్పష్టం చేశారు. ఏ తప్పూ చేయని తాము ఎన్ని అసత్య కథనాలు రాసినా బెదరబోమని చెప్పారు. దమ్ముంటే నిరూపించే వార్తలు రాయాలని సవాల్ చేశారు. రామోజీ ఎన్ని రాతలు రాసినా ప్రజల తరఫున ఆయన్ని నిలదీస్తూనే ఉంటామని చెప్పారు.

చంద్రబాబు బకాయిలూ జగన్ సర్కారే చెల్లించింది

రామోజీ రాతలు గురివిందను తలపిస్తున్నాయని మంత్రి చెప్పారు. రైతుల పేరుతో దోచుకున్నది చంద్రబాబునాయుడేనని అన్నారు. సీఎంగా వెలగబెట్టిన సమయంలో రైతులకు ఏ ఒక్క పథకం అమలు చేయలేదన్నారు. పైగా, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్, ధాన్యం కొనుగోలు బకాయిలు వేల కోట్లు చెల్లించకుండా వాటిని కప్పెట్టిన విషయం రామోజీకి గుర్తు లేదా అని ప్రశ్నించారు. రైతులకు చంద్రబాబు బకాయి పెట్టిన వేల కోట్ల రూపాయలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి పైసా చెల్లించారని తెలిపారు. వీటిని రాయడానికి రామోజీకి మనస్సు రాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు నిర్వాకం వల్ల సివిల్ సప్లైస్ పరిస్థితి దారుణంగా తయారైందని చెప్పారు. మార్గదర్శి పేరుతో జనం డబ్బును దోపిడీ చేసి, దానిని కప్పెట్టేందుకు ఇష్టమొచ్చినట్టు రాస్తారా అని నిలదీశారు.

ఇది సిగ్గుచేటు

ఏదైనా సంక్షేమ పథకం అమలు విషయంలో 99 శాతం బాగా జరిగి, కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ఒక శాతం ఆలస్యం అయితే దాన్ని ఈనాడులో భూతద్దంలో పెట్టి చూపించడం సిగ్గుచేటన్నారు. గతంలో మాదిరి ఇప్పుడు రైతులను అడ్డంపెట్టుకుని దోచుకోవడం లేదనే విషయం ఈనాడు తెలుసుకోవాలన్నారు. ప్రాజెక్టుల విషయంలో కూడా ఈనాడులో అసత్య కథనాలు రాస్తోందని చెప్పారు. ఏదైనా ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించిన వారు గొప్పా, లేక పెండింగ్‌లో పెట్టిన వారు గొప్పా అనే విషయం కూడా రామోజీ తెలుసుకోవడం లేదని అన్నారు. చంద్రబాబును వెంటనే గద్దెనెక్కించాలన్న తపనతో అసత్య కథనాలు వండుతున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం రైతులకు ఎప్పటికీ అండగా ఉంటుందని చెప్పారు. రైతులను రెచ్చగొట్టేలా ఈనాడు రాస్తున్న అసత్య కథనాలను ఎవరూ పట్టించుకోరనే విషయం గుర్తుపెట్టుకోవాలని చురకలంటించారు. రామోజీ సొంత ప్రయోజనాలు మానుకోవాలని, వయస్సు మళ్లిన ఆయన దగుల్బాజీ వార్తలు రాయడం నిలిపివేయాలని చెప్పారు. ఆయనకు బుద్ధి, సిగ్గు రావాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా రామోజీ పశ్చాత్తాపపడతారని ఆశిస్తున్నామని మంత్రి చెప్పారు.

వివాదాస్పద భూమినే.. వివాద రిజిస్టర్‌లో ఉంచాలి

▶ మొదటి పేజీ తరువాయి

ముగ్గురి పేరు మీద ఉండి.. వారు సబ్ డివిజన్ చేసుకోకుండా దాన్ని సాగు చేస్తున్నారనుకుందాం. వారిలో ఒకరి పేరు మీద ఉన్న భూమిపై వివాదం ఏర్పడితే మొత్తం ఆ సర్వే నంబర్ అంతటినీ వెబ్ ల్యాండ్‌లోని వివాద రిజిస్టర్‌లో పెడుతున్నారు. దీంతో వివాదం లేని ఇద్దరి భూమి కూడా వివాదంలోకి వెళ్తోంది. గ్రామాల్లో ఇలాంటి కేసులు చాలా ఉండడంతో రైతులు, భూ యజమానుల నుంచి ఎన్నో ఏళ్లుగా ఆందోళన వ్యక్తమవుతోంది. రీ సర్వే జరుగుతున్న క్రమంలోనూ దీనిపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వాటాల పంపకాలు, అమ్మకాలు, కొనుగోళ్ల తర్వాత సబ్ డివిజన్ చేసుకోకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో సబ్ డివిజన్ జరగకుండా ఉన్న భూమికి సంబంధించి.. వివాదం ఏర్పడిన భూమి పోర్షన్ వరకే వివాద రిజిస్టర్‌లో చేర్చాలని, డిజిటల్ సిగ్నేచర్ తొలగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే మొత్తం సర్వే నంబర్‌ను వివాద రిజిస్టర్‌లో పెట్టిన కేసులపై తహశీల్దార్లు వెంటనే స్పందించి.. పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. కలెక్టర్లు కూడా దీనిపై ఆర్డీఓలు, తహశీల్దార్లకు స్పష్టమైన ఆదేశాలిచ్చి అమలయ్యేలా చూడాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ సాయిప్రసాద్ సర్క్యులర్ జారీ చేశారు.

తెలంగాణ

ట్విట్టర్ టిల్లు డ్రగ్స్ వాడతాడు

బండి సంజయ్ ఆరోపణ

నిర్మల్: 'కేసీఆర్ కొడుకు ట్విట్టర్ టిల్లు డ్రగ్స్ వాడతాడు. రక్తం, వెంట్రుకల నమూనాలిస్తే నిరూపించేందుకు సిద్ధం. నేను తంబాకు తింటానని పచ్చి అబద్ధాలు చెప్పినవ్ కదా కేటీఆర్.. నువ్వు, నేను పరీక్షలు చేయించుకుందాం. నా శరీరంలోని ఏభాగమైనా పరీక్షలకు ఇచ్చేస్తా. నీకు రక్తం, రెండు వెంట్రుకలిచ్చే దమ్ముందా..?' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సవాల్ విసిరారు. దేశమంతా ఓవైపు ఉంటే.. కేసీఆర్ మరోవైపు ఉంటాడని, ప్రధాని మోదీ అంటే పడనివాళ్లు సైతం దేశం కోసం జీ–20 నిర్వహణ సమావేశానికి వెళ్లారని చెప్పారు. కేసీఆర్ మాత్రం తన బిడ్డను లిక్కర్ స్కాం నుంచి ఎలా బయట పడేయాలా అని లాయర్లతో మీటింగ్ పెట్టాడని విమర్శించారు. నిర్మల్ జిల్లాలో ప్రజాసంగ్రామ యాత్ర మంగళవారం మామడ మండల కేంద్రం నుంచి ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రానికి చేరుకుంది. మార్గమధ్యలో దిమ్మదుర్తిలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సంజయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నిర్వహించిన సభలో మాట్లాడారు. అవినీతిలో అయ్యకు తగ్గ బిడ్డగా కవిత గుర్తింపు పొందిందని ఆరోపించారు. బిడ్డను కాపాడుకునే క్రమంలో రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేందుకు కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు.

కాలుష్య కాసారం.. బెంగళూరు

- పెరుగుతున్న వాయు కాలుష్యం
- 40 శాతం మేర పెరిగిన ఏక్యూఐ
- భవిష్యత్‌లో మాస్కులు తప్పనిసరి?

- సాక్షి, బెంగళూరు



నానాటికీ పెరిగిపోతున్న మితిమీరిన వాహనాల సంఖ్య.. తద్వారా వెలువడుతున్న ట్రాఫిక్ ఉద్గారాల కారణంగా సిలికాన్ సిటీ బెంగళూరు నగరం కాలుష్య కాసారంగా మారిపోయింది. దేశ రాజధాని ఢిల్లీ తరహాలో బెంగళూరులోనూ వాయు కాలుష్య పరిమాణం గణనీయంగా పెరుగుతున్నది. దీంతో రానురాను ఊపిరి తీసుకోవడం కూడా కష్టంగా మారనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పెరుగుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఎయిర్ ప్యూరిఫైయర్స్ ఉపయోగించాల్సి ఉందని నిపుణులు సూచిస్తున్నారు. బయటకు రావాల్సిన పరిస్థితుల్లో మాస్కులు ధరించాలని చెబుతున్నారు. కాగా, గతేడాదితో పోలిస్తే నగరంలో గాలి నాణ్యత సూచి (ఏక్యూఐ) సమారు 40 శాతం పెరిగింది. దీంతో గతేడాది నవంబర్‌లో 66 ఏక్యూఐ ఉండగా ఈ ఏడాది అదే సమయానికి 93కు చేరుకుంది. కాగా, శీతాకాల సహజ వాతావరణ పరిస్థితులకు తోడు నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ ఉద్గారాల కారణంగా కూడా ఏక్యూఐ పెరుగుతున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే నగరంలో వాయు కాలుష్య ప్రమాణాన్ని కొలిచేందుకు ఏడు వేర్వేరు చోట్ల కేంద్రాలను ప్రారంభించారు. ఢిల్లీ తరహా పరిస్థితులు బెంగళూరులో క్రమక్రమంగా ఏర్పడుతున్నాయి. ఏక్యూఐ వెబ్‌సైట్‌లో క్రమంగా బెంగళూరులో గాలి నాణ్యత సూచీ పెరుగుతుండడం భయాందోళనకు గురిచేస్తోంది. బుధవారం ఏక్యూఐ 150కి చేరుకుంటుందని ఆ వెబ్‌సైట్ అంచనా వేసింది.

సైకత శిల్పకళ పోటీల్లో బాలాజీ ప్రతిభ

తమిళనాడు కళాకారుడితో కలిసి ప్రథమ బహుమతి కైవసం



ఆహుతులను ఆకట్టుకున్న బాలాజీ రూపొందించిన సైకత శిల్పం

సాక్షి, అమరావతి: ఒడిశాలో నిర్వహించిన అంతర్జాతీయ సైకత శిల్పకళ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆకునూరు బాలాజీ వరప్రసాద్, తమిళనాడు కళాకారుడు శామ్యూల్ సెల్వమణి జోడీకి ప్రథమ బహుమతి లభించింది. ఈ నెల ఒకటి నుంచి ఐదో తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని కోణార్క్ చంద్రభాగా బీచ్‌లో జరిగిన 'అంతర్జాతీయ సైకత శిల్ప కళోత్సవం–2022' పోటీల్లో ఏపీ నుంచి ఏలూరు జిల్లా కైకలూరు మండలం పల్లెవాడకు చెందిన బాలాజీ పాల్గొన్నారు. ఎనిమిది దేశాలు, వివిధ రాష్ట్రాలకు చెందిన 208 మంది సైకత శిల్పులు ఈ పోటీలకు ఎంట్రీలు పంపగా, 103 మందికి పాల్గొనే అవకాశం లభించింది. డబుల్స్, ట్రిబుల్స్, గ్రూప్ (బృందం) విభాగాల్లో పోటీలు నిర్వహించారు. డబుల్స్ విభాగంలో తమిళనాడుకు చెందిన ఉపాధ్యాయుడు శామ్యూల్ సెల్వమణితో కలిసి బాలాజీ పాల్గొన్నారు. నిర్వాహకులు రోజుకొక అంశం ఇవ్వగా, సైకత శిల్పాలను రూపొందించారు. క్రీడలు, ఉత్సవం, పండుగలు, భారతదేశ సంస్కృతి, ప్రపంచ శాంతి వంటి అంశాలకు అద్దంపట్టేలా సైకత శిల్పాలను తీర్చిదిద్దారు. దీంతో బాలాజీ, శామ్యూల్ సెల్వమణి జోడీకి అంతర్జాతీయ స్థాయిలో మొదటి బహుమతి లభించింది. సోమవారం రాత్రి నిర్వహించిన ముగింపు వేడుకల్లో రూ.లక్ష నగదు బహుమతిని ఒడిశా పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్రకుమార్, అంతర్జాతీయ సైకత శిల్ప నిపుణుడు, ఒడిశా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ బ్రాండ్ అంబాసిడర్ సుదర్శన్ పట్నాయక్ చేతుల మీదుగా బాలాజీ అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం బాలాజీ 'సాక్షి'తో మాట్లాడుతూ తాను అంతర్జాతీయ పోటీల్లో ప్రథమ బహుమతి అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటి వరకు రెండు అంతర్జాతీయ అవార్డులు, 8 జాతీయ అవార్డులు, రెండు పురస్కారాలు పొందానని, రెండు ప్రపంచ రికార్డులు సాధించానని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited. Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.